సాహిత్య

# ప్రస్థానం

డిసెంబర్ 2010



సాహితీ స్రవంతి



సాహిత్య ప్రస్థానం
డిసెంబర్ 2010
సంపుటి : 10 సంచిక : 60

# కీలక దశకం

కాలగమనంలో మరో ఏడాది గడిచిపోతున్నది. దాంతోపాటే ఒక దశాబ్ది ముగుస్తుంది. చరిత్రలో చెప్పుకోదగిన దశకం ఇది. నూతన సహస్రాబ్ది రాగానే ఏదో ఒరిగిపడుతుందని హడావుడిపడిన అమాయకులకు ఈ పదేళ్ళ పయనం కళ్ళు తెరిపించింది. గత శతాబ్ది చివరి దశకం సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు ప్రారంభమైతే ఈ శతాబ్ది తొలి దశకం దాన్ని సంపూర్ణం చేసింది. జీవిత సంబంధమైన అన్ని పార్శ్వాలలోకీ ప్రపంచీకరణ ప్రవహించింది. తనతోపాటే బోలెడు కాలుష్యం తెచ్చింది. గత నెలలో అమెరికా అధ్యక్షుడు ఒబామా భారత పర్యటన అందుకో ఉదాహరణ మాత్రమే. ఈ క్రమంలో మనవంటి వర్ధమాన దేశాల సార్వభౌమత్వం, జనబాహుళ్యం స్థితిగతులు దిగజారాయి. ఆధిపత్యానికై అభద్రతలూ, అనైక్యతలూ ఆకాశమంటేలా చేసిన 'సామ్రాజ్యం' ఇప్పుడు తనే గొంతువరకూ సంక్షోభంలో కూరుకుపోయి, దాన్ని మనపై రుద్దాలని పాచికలు వేస్తుంటే పాలకులు లొంగిపోతున్నారు. ఇదే కాలంలో దేశంలో మతతత్వం, మార్కెట్‌తత్వం, మార్మిక అస్తిత్వ వాదాలు అన్ని పరాకాష్టకు చేరాయి. ఈ సమయంలో దేశాన్ని కాపాడుకోగలిగింది ప్రజల అప్రమత్తతే.

– – –

ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఈ కాలంలో అనేకానేక ఉద్రిక్తతలు, వ్యర్ధ వివాదాలు చూశారు. పాలకపక్షం అంతఃకలహాలనూ వీక్షించారు. ఇన్నిటి మధ్యనా ఇప్పుడు కొత్త ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. వేచిచూస్తున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, ప్రజా జీవితంలో ప్రశాంతతను, ప్రజాస్వామిక విలువలను ఆయన ప్రభుత్వం కాపాడుతుందని ఆశించాలి. అదే సమయంలో అంతులేని అవినీతిని అరికట్టే కనీస చర్యలైనా చేపట్టాలని కోరుకోవాలి. గత ఏడాది ఈ సమయంలో అట్టుడికిపోయిన తెలుగు నేల ఈ మాత్రం ప్రశాంతతను పొందగలిగిందంటే ప్రజల శాంతి కాంక్షనే కారణం. ఎవరి రాజకీయ ప్రయోజనాలు ఏమైనప్పటికీ, ప్రాంతాల భవితవ్యంపై అంతిమ నిర్ణయాలు ఏమైనప్పటికీ ఈ ప్రశాంతతను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. అందుకు చొరవ చూపాల్సింది, అందరినీ కలుపుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవలసింది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. లేకపోతే మార్పు వ్యక్తులకే పరిమితమవుతుంది.

– – –

సాహితీ ప్రవంతికి ఈ దశకం చాలా కీలకమైంది. ఈ కాలంలోనే ప్రవంతి ఆవిర్భావం, కార్యకలాపాల నిర్వహణ, పత్రిక స్థాపన అన్నీ జరిగాయి. తెలుగు సాహిత్యంలో విశాల వేదిక భావన బలం పొందింది. అనేక సంక్లిష్టతల మధ్య సాగిన సాహిత్య ప్రస్థానం విలువైన అనుభవాలు నేర్పింది. పైన చెప్పుకున్న రాష్ట్ర నేపథ్యమూ అనేక పాఠాలు అందించింది. వాటిని సవ్యంగా సమీక్షించుకోవడానికి రానున్న కాలపు కర్తవ్య ప్రణాళిక సిద్ధం చేసుకోవడానికి ఇది సరైన సమయం.

**బొమ్మలు : శివాజి, వెంకటేష్, కె. శ్రీనివాస్**

## ఈ సంచికలో...

నా పేరేమిటి? (కథ) .............................. 2
కవితలు .............................................. 5
జానపద విజ్ఞాన పరిచయం ........................ 6
కవితలు .............................................. 9
రచయిత – రాజ్యం ................................ 10
కవితలు ............................................ 12
లేడీ డాక్టర్ (కథ) .................................. 13
కవిత ................................................ 15
సాహిత్యంలో కులాధిపత్యం :
నన్నయ్య నాటి చరిత్ర ........................ 16
జ్ఞానో కవి రచనా ధార .......................... 19
కవితలు ............................................ 20
పోస్ట్ మోడరన్ (అనువాద కథ) ................ 21
కవితలు ............................................ 28
ఆర్థిక, ఆధిపత్య ప్రయోజనాలకే
ఒబామా పర్యటన .............................. 29
కవితలు ............................................ 31
దూది (టుమ్రీ) .................................... 32
కవితలు ............................................ 33
ఆశయాల బతుకుపుటల్లో
అనుభవాల నెమలి కన్నులు ................ 34
కొత్త పుస్తకాలు .................................. 36
కవితలు ............................................ 38
ప్రజాకవి 'అల' (నివాళి) ........................ 39
మెరుగు (నివేదిక) ................................ 40
డైరీ .................................................. 41

సంపాదకవర్గం

తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
వొరప్రసాద్
హిమజ్వాల

కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా

సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in

**కథ**

# నా పేరేమిటి?



**డా॥ కట్టా సత్యప్రసాద్**

***వారం రోజులుగా సెంద్రికీ, నోరిగానికీ చేతినిండా పని. రంగాపురం కరణం గారి పాత భవంతికి కొత్త మెరుగులు దిద్దేపని. ఇంటి చుట్టూ గడ్డి మొలిచి, దాదాపు పాడుబడ్డ దాన్లా తయారైన ఇంటికి జీవకళ తెచ్చే పనిలో కుస్తీ పడుతున్నారు వాళ్లు.***

ఎనిమిది పదుల వయసు పైబడినా వడి తగ్గని కరణంగారు పనులు పురమాయిస్తూ హడావుడి చేస్తున్నాడు. లంకంత ఇల్లు. పిల్లపాపలతో సందడిగా ఉండేది. పిల్లలు చదువులకు, పట్నాలకు పోతే, వారి పిల్లలు పై చదువులకు, ఉద్యోగాలకు విదేశాలకు పోయారు. ముసలివాళ్లు మాత్రం ఈ ఊళ్లో మిగిలిపోయారు. ఒక్క ఈ ఇల్లే కాదు ఆ బజారు బజారు అంతా అలా ఖాళీ అయిందే. సగం కూలిన ఇళ్లు, మొండిగోడలతో దర్శనమిస్తుంటాయి! కరణం గారింట్లో హడావుడి మొదలై బూజులు దులిపి సున్నాలు వేయటం మొదలు పెట్టేసరికి గుడి దగ్గర చర్చ మొదలయింది. ఎప్పుడోగాని రాని కరణంగారబ్బాయి ఈ వారంలో రెండు సార్లొచ్చి దగ్గరుండి మరీ పనులు చూసుకుని పొయ్యాడు. ఆయన హైదరాబాద్‌లో అడ్వకేట్. కొడుకు రావటం వల్లనో ఏమోగాని ఎప్పుడూ నీరసంగా, నిర్లిప్తంగా ఉండే కరణంగారి ముఖంలో వెయ్యి బల్బులు వెలిగినట్లు సంతోషంతో కనబడుతున్నాడు. దారినపోయే వాళ్లను పిలిచి మరీ ముచ్చట పెడుతున్నాడు.

ఆ సాయంత్రం కరణంగారింట్లో పని ముగించుకుని సెంద్రీ, నోరిగాడు ఇంటికి పోతుంటే గుడ్డి దగ్గర కూచున్నోళ్లు ఆరా తీశారు. కరణం గారేంటీ ఈ మధ్య మస్తు హుషారుగున్నాడు సున్నాలేయిస్తున్నడు. ఏమిటి గిరాకీ అని?

"గిరాకే. ఫంక్సన్ జేయిస్తుండు." నోరిగాని సమాధానం

"పెద్ధాయన మనమడికి కొడుకు బుట్టిండంట" సెంద్రి జెప్పింది.

"ఏం ఫంక్సనేంటి?" జనంలోంచి ప్రశ్న

“ఏందో పేరు బెడతరంట. ఆళ్లెక్కడో అమెరెకలుంటరంట. ముత్తాత చేతుల మీదుగా ఆ పని జేయిస్తే మంచిదని వకీలు సాబుకుంది. పెద్దాయనక్కూడ మనసుల అదే వుంది. ఈయన్ని పట్నం తీస్కపోదమని వకీలు సాబొస్తే రానంటే రానన్నడంట. మొదట్నించీ ఈ ఆయన పట్టిందేపట్టు” సెంద్రి చెప్పుకొచ్చింది.

“ఈ పెద్దాయన మొండిమడిసని వాళ్లే వస్తన్నరు. రేపే ఫంక్సన్.”

గుడి మెట్ల మీంచి పూజారిగారు చూశారూ మన భారతీయ సంస్కృతి గొప్పతనం. ఎక్కడో సప్త సముద్రాల నుంచి వస్తున్నారు. ఇక్కడ మన నేలమీద మమకారంతో. ఇక్కడ జన్మస్థలంలో నామకరణం చేయించుకోవాలననీనూ.. ఎంతైనా పేరు బలం ఉంది చూశారూ... మహా గొప్పది సుమండీ! జన్మ నక్షత్రం, ఘడియ...లెక్కలు వేసి పెట్టిన పేరు వాని భవిష్యత్తు దేదీప్యమానంగా ఉండేందుకు పునాది వేస్తుందంటే నమ్మండీ.



నోరిగాడికి పొద్దుబోతే మళ్ళీ రేప్పొద్దుటి చాకిరీ గుర్తొచ్చి సెంద్రిని వెంటబెట్టుకుని అక్కణ్ణించి నెమ్మదిగా జారుకున్నాడు. సెంద్రి మనసులో మాత్రం గుడి అయ్యగారి మాటలు మెదులుతున్నయ్. ఉండబట్టలేక అడిగింది. “మామా పేరులో అంత బలముంటదా? పంతులేమో శానా శానా జెప్తున్నడు.

నోరిగాడు నోరు మెదపలేదు. ఇంటికొచ్చేపాటికి ఇద్దరు మనవలు నిదరపోయినరు. టి.వి.లో పేదల కోసం జీవితమంతా కృషి చేసిన ఐపియస్ అధికారి శంకరన్ గురించి ప్రోగ్రాం వస్తుంటే కొడుకూ కోడలు సూస్తుంటే ఇద్దరూ సూస్తానే నిద్రలోకి జారుకున్నరు. “మణిసై పుడితే గా శంకరన్‌లా బతకాలె” సెంద్రి తనలో తాను చెప్పుకుంటున్నది.

“కలవరిస్తుండావేందే సెంద్రి” నవ్వుతూ అడిగాడు నోరిగాడు

“లేదులే... మబ్బులో పోవాలే పండుకో”.

ఎప్పుడు లేచారో ఏమో, సెంద్రీ, నోరిగాడు కరణం గారి అరుగుల మీద కారు వెలుతురు పడటంతో లేచి కూర్చున్నారు. తెల తెల వారుతుండగానే, మసక చీకట్లలోనే అగ్గిపెట్టె కాలనీ ఇండ్ల మధ్యలోంచి, రామాలయం మలుపు తిరిగి పాత బజారులోకి ఒకటొకటే పడవకార్లు మెల్లి మెల్లిగా వచ్చి కరణంగా అరుగుల దగ్గర ఆగాయి. కరణంగారు, ఆయన భార్య ఆ రాత్రి నిద్రపోయారో లేదో వాళ్ల ఆనందానికి అవధుల్లేవ్. మనవనికి దిష్టి తీయించి మరీ ఇంట్లోకి తీసుకెళ్లింది. మనవడు ఆమెరికా నుండి తెచ్చిన అత్తర్లతో తాతకు షోకు చేస్తుంటే మురిసిపోయి ప్రపంచాన్నే మరచిపోయాడు. వచ్చిన వాళ్ళకు ఏర్పాట్లలో సెంద్రీ, నారిగాడికి నడ్డి విరిగే పని, ఉరుకులూ, పరుగులూ, నామకరణ మహోత్సవానికి ఏర్పాట్లు. ఏర్పాట్లన్నీ పూర్తియే సరికి మధ్యాహ్నం అయింది. బ్రాహ్మణులూ, పండితులు వచ్చారు. పంచాంగాలు తిరగేశారు. అమెరికా నుండి వచ్చిన వాళ్లు వారి వారి లాప్‌టాప్‌లు తీసి పిల్లవాని జన్మనక్షత్రాన్ని బట్టి అయ్యవారు చెప్పిన అక్షరంపై తర్జన భర్జనల తర్వాత పేరు ఖాయంజేశారు. సెంద్రికి మాత్రం కొంత రికామిగా ఉంది. ఒక్క ప్రక్కన జేరి తంతు చూస్తున్నారు. తాతగారి వళ్లో పిల్లవాణ్ణి ఉంచి నామకరణం జరిపించారు. భోజనాలు ముగిశాయి.

తిరుగు ప్రయాణాలు, టెంటు సామాన్లు, సర్దుబాట్లు ఇలా నోరిగాడు, సెంద్రి పనులు ముగించుకుని ఇల్లు జేరేసరికి పొద్దువాలింది. ఇంటికి పోయే ముందు కరణం గారి భార్య వంటకాలు అవీ యిస్తూ సెంద్రితో అంది.

“సెంద్రీ నీ కోడలికి కవలలు పుట్టారట కదా! ఏం పేర్లు పెట్టుకున్నారు?”

“ఆ! మా పేర్లకేముందిలే అమ్మ. ఏం బెట్టినా నడిసిపోద్ది. ఇంకా ఏం అనుకోలే” సెంద్రి సమాధానం.

“అట్లా అంటే ఎట్లానే. వెనకంటే ఎలానో నడిచిపోయింది. మంచి పేర్లు చూసిపెట్టండి” సలహా ఇచ్చింది సెంద్రికి.

“అట్లాగేలే అమ్మ”.

సెంద్రి, నోరిగాడు ఇంటి ముఖం బట్టారు.

ఇల్లు జేరుకునే సరికి కొడుకూ, కోడలు పిల్లలిద్దర్ని ఆడించుకుంటూ ఉన్నారు. ఇద్దరూ కాళ్ళూ, చేతులు కడుక్కుని మనవళ్లని ఎత్తుకున్నారు. తను తెచ్చిన వంటకాలు కొడుక్కు పెట్టమని పురమాయించింది. కరణం గారి భార్య చెప్పిన మాటల్ని కొడుకు చెవిలో వేసింది సెంద్రి. కొడుకు మాత్రం నాయన ఎట్లంటే అట్లని నారిగాని మీదేసిండు భారం. నారిగాడు మాత్రం నోరు విప్పడం లేదు. మళ్లీ సెంద్రినే అందుకుంది.“ఆయనేం మాట్లాడతడు. నోరులేనివోడు” అంటూ దీర్ఘాలు పోయింది ఈసారి.

“అత్తమ్మా అంత మాటంట వేంది మామను అన్నేయంగా” కోడలు అడ్డొచ్చింది. ఈ దెబ్బతో నోరిగాడి మౌనం బద్దలైంది. “సత్తెం. నన్నంతా నోరిగాడంటరు. కాని నాకు నోరు లేదు. నాకే కాదు. నా జాతి జాతికే నోరు లేదు” అన్నాడు.

## నవంబర్ నెల పురస్కారాలు



### ఆరని మంటలు

**కథకు........రూ.700/-**

**రచయిత : శింగమాల సుబ్రహ్మణ్యం**

### మాటలు



**కవితకు.......రూ.500/-**

**రచయిత : కె. నవీన్**

***సినీ రచయిత జనార్ధన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి.***

*కవితలు, మీరు చదివిన కథలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. ఒక రచయిత ఈ ఎంపిక నుంచి తనను మినహాయించాలని కోరాదు. అలాంటి అభిప్రాయాలున్న రచయితలు కూడా మాకు రాయవచ్చు.*

***- ఎడిటర్***

---

ఏదో సరదాగా మొదలైన ముచ్చట ఉన్నట్టుండి ఇలా మలుపుతిరుగుతుందని ఎవరూ ఊహించనే లేకపోయారు. దిమ్మదిరిగి తెల్లమొహాలేసి ఏం చేయాలో తోచక చూస్తుండిపోయారు. కోడలు పిల్లే కొంత గొంతు పెకిలించుకుని...

"అంతమాట అనొద్దు మామా.." అంది

"నేనట్టా అనలేదయ్యా.." కన్నీళ్లతో సెంద్రి....

"పిచ్చోళ్లారా... మీరన్నారంట ల్లేదే. నత్తెంజెవుతాండా. నిజం నిట్టూరంగానే ఉంటది మరి! ఇయ్యాల కరణం గారింట్ల పండుగయింది. ఏం పండుగ? పేరు పెట్టుకునే పండగ? కలిగినోండ్ల ఇండ్లలో ఏదైనా పండగే అనుకో. మరి మనికి?" అదోరకంగా మాట్లాడిండు నోరిగాడు.



"అమ్మగారు మన పిల్లలకు కూడ మంచిపేర్లు పెట్టుకోమన్నదిగా!" అమాయకంగా అంది సెంద్రి.

"మంచి పేరు! మన పిల్లలకు!!" వింతగా నవ్వాడు నోరిగాడు. తల్లీ, కొడుకు, కోడలు అర్థంగాక బిక్కపోయి చూస్తున్నారు. ఈరోజు నోరిగానిలో ఓ కొత్తమనిషి కనబడుతున్నాడు. ఏదో కొత్తలోకం వచ్చిన వాడిలా మాట్లాడుతున్నాడు."నా పేరేమిటో తెలుసా మీకు?" మళ్ళీ నోరిగాడే ప్రశ్నించాడు.

ఇదేమిటి ఇలా అడుగుతున్నాడు అనుకున్నారు వాళ్లు. మళ్లీ నోరిగాడే అందుకున్నాడు. "మీకే కాదు. ఈ ఊళ్లో ఎవరికీ తెలవదు. నా పేరే కాదు. మన గూడెంలో ఏ ఒక్కరి పేర్లూ తెలవవు. వింతేమిటంటే వాళ్ళ పేర్లేమిటో వాళ్ళకే తెలవదు. మా తాతల నుండీ ఇదే తంతు."

"అదెట్లా మామా ఇంతకూ నీ పేరేమిటి? కోడలు ప్రశ్న.

"అదంతే. మాతాత నాకు నెవురూ గారి పేరు పెట్టుకున్నడు. నెవురూ గార్ని ఏంజేశారో చూశారా! "నోరిగాణ్ణి చేశారు." ఇక ఏ "మంచిపేరు" పెట్టి ఏం లాభం చెప్పండి?

''అందరూ మౌనంగా ఉండిపోయారు. ఈసారి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ సెంద్రి మాట్లాడింది."

"నీ తాతలకు నీకు చేతకానిది, నీ కొడుకుతో కానిది, నా మనమలు సాధిస్తారేమో!" సెంద్రిగొంతులో ఒక కొత్త ఆశ, భవిష్యత్తుపై కొండంత నమ్మకం ధ్వనించాయి.

"నా కొడుకూ, కోడలికి ఇష్టమైతే నా మనవళ్లకి మనమే మంచిపేర్లు పెడదాం. కరణంగారింట్లో ఆ పెద్దోళ్లు. బుల్లిపెట్టెలో ఎతికి, ఎతికి, పుస్తకాలు తిరగేసి మరీ పెట్టేరే. వాటిని తలదన్నే గొప్పపేర్లు – మన బతుకుల్ని మార్చిన మహానుభావులపేర్లు పెడదాం. ఏమంటారు?"

మరుక్షణమే ఇద్దరు పిల్లల్ని తెచ్చి సెంద్రీ అత్త, మామల చేతుల్లో ఉంచింది. సెంద్రి తన చేతిలో బిడ్డకు 'శంకరన్ అనీ నెవురూ చేతిలో బిడ్డకు సుందరయ్య అనీ 'నామకరణం' చేసింది. ■

## కవిత

# బద్నాం గల్లీ

### - సంగెవేని రవీంద్ర



ముందుగా ఓ పేరంటూ ఉంటే
మంచీ చెడుల సంకెళ్ళని
తగిలించుకోవచ్చు.. వదిలించుకోనూ వచ్చు..
ఒకప్పుడది మట్టికి, శ్రమకు పట్టం కట్టిన ప్రాంతమే..
అమ్మ పాలలాంటి కమ్మటి చోటే..
ఇప్పుడది కాలం పేల్చిన కామ పర్వతాల్ని
ఆర్పేసే వీర్యగంధాల వీధి...
పొట్టలు కొట్టే పెట్టుబడులెక్కడో
మార్కెట్లో షేర్లయినట్టు...
ఆకలే పెట్టుబడై ఇక్కడ
మానాన్ని మార్కెట్లో విక్రయించే వైనం...
చీకట్లను మోసే శిథిల శరీరాలిక్కడ...
రొచ్చు దేహాల కార్చిచ్చు నార్పే
చలివేంద్రాలు...
లోలోన భళ్ళున పగిలిన రక్తం
పెదాలు చప్పరించిన తడవుతుంది...
నిప్పుల్లో దూకి నిప్పులార్పుకునే కాంక్షలు...
దారులెప్పుడూ మూసుకుపోని దేహజాతరలు...
కాసుల గలగలల ముందు ఖామోషైన కన్నీళ్ళు...
ఫెటీల్మని పగిలిన సంస్కారం ముసుగులోంచి
కూసం వదిలిన మనుషులిక్కడ
పాముల్లా కామం కక్కుతుంటే...
కోర్కెల కొలిమిలో సమిథలైన శరీరాలు
వలువలు త్యజించిన దగ్ధదీపాలై భగ్గుమంటై...
ఊకదంపుడు ఊపిరితిత్తుల్ని వెక్కిరిస్తూ
కాలుతున్న శీలం కమురు వాసన...
స్వేద పరిమళాలు వెదజల్లిన చోటిప్పుడు
గాయపడ్డ బిచ్చగాడి వేణుగానం..
నిన్నటి వెచ్చని తెలుగు వెలుగుల బాట
నేడు హెచ్చైవీల రక్షణ కోట...
కమ్మటి చోటే..
తల్లిపెట్టిన పేరేదైనా ఇప్పుడిది...
మభ్యపెట్టిన కుళ్ళు సమాజాన్ని
జల్లెడ పట్టే బద్నాం గల్లీ...!

**(ముంబైలో తెలుగువారి కర్మభూమి 'కమాటిపురా',**
**ఇప్పుడు ఆసియాలో అతిపెద్ద రెడ్‌లైట్ ఏరియా...!)**

---

# ఓ మహాకవి

### మరాఠీ మూలం : దయాపవార్
### తెలుగు : డా॥ జి.వి. రత్నాకర్



తండ్రీ వాల్మీకి
రామరాజ్యాన్ని నువ్వు కీర్తించు
ఎందుకంటే నువ్వు కవులకే మహాకవివి
క్రౌంచపక్షిని చంపడం చూసి
దయాపూరితమైన మీ మనసు విలపించింది
నువ్వు ఊరిబైట పుట్టావు
వెలివేయబడ్డ పల్లెలో బాధల్లో పుట్టావు
అక్కడి విషణ్ణ వదనాలు చూసి బాధల పొలాల్ని దున్నాయి
పళ్ళు పూలతో పాటు వాళ్ళ మొహాలెప్పుడూ వికసించలేదు
విముక్తి కోసం వాళ్లు పెద్ద పెద్దగా నినదించారు
నిజంగా అవి నీకు వినపడలేదా?
నీ రక్తాన్ని పంచుకుపుట్టిన ఒక శంభూకుడు
విద్వేషాగ్నిలో నిలువునా కాలిపోయాడు
రామరాజ్యాన్ని కీర్తించే
ఓ మహాకవి
అక్కడ కూడా
అమానవీయమైన మంచుకొండలు
విరిగిపడ్డాయి
ఓ మహాకవి
నిన్ను మహాకవి అని ఎలా పిలవగలను
ఈ అన్యాయం అత్యాచారాల గురించి
తెలియపరిచే
ఒక్క శ్లోకం అయినా నువ్వు వ్రాసి ఉంటే
నీ పేరు నేను గుండెలపై వ్రాసుకునేవాడిని

# జానపద విజ్ఞానం పరిచయం



- జయంతి పాపారావు

*జానపదులు పల్లెటూరికే పరిమితమైపోయి, ఎల్లకాలం అక్కడే ఉండిపోరు. సామాజిక రాజకీయ ఆర్థిక పరిణామాల్లో బ్రతుకు తెరువు కోసమో, విద్యకోసమో, ఉద్యోగం కోసమో, వ్యాపారం కోసమో, పెద్ద జనసమూహం ఉన్న ప్రాంతాలకు అంటే పట్టణం - నగరం - మహానగరం వెళ్ళిపోతారు. జానపదులు ఆ విధంగా వెళ్లిపోయారంటే, వాళ్లతో పాటు తరతరాలుగా సంక్రమించిన వాళ్ల జీవన విధానాన్ని, జీవన సంస్కృతిని మోసుకుపోతారు.*

జానపద విజ్ఞానంలో జానపద వాఙ్మయంలో కొన్ని ముఖ్యమైన అంశాలకు భిన్నమైన నిర్వచనాలుంటాయి. శాస్త్రవేత్తలు విభిన్న ప్రాంతాలకూ, విభిన్న దేశాలకూ సంబంధించిన వారై ఉంటారు. వారు అధ్యయనం చేసిన జానపద విజ్ఞానం – జానపద వాఙ్మయం విభిన్నంగా ఉంటుంది. ఆ అధ్యయనానికి అనువైన ప్రాతిపదికవారు ఏర్పరచుకుంటారు. ఆ విధంగా విభిన్నమైన నిర్వచనాలు ఏర్పడతాయి. రెండో విషయం ఏమిటంటే ప్రతి సంస్కృతిలోనూ పరిణామాలు తప్పవు. వాటి ఆధారంగా కూడ నిర్వచనాలు మారుతాయి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని అవగాహన చేసుకోవలసిన అవసరం ఉంది.

జనపదమనగా పల్లెటూరు. జనపదములయందుండువారు జానపదులు. 19వ శతాబ్దిలో కొందరు శాస్త్రవేత్తలు జానపదులంటే చదువురాని కర్షకజనులని, పల్లెటూరువారని అభిప్రాయపడ్డారు. మానవ శాస్త్రవేత్తలు (Anthropologists) 'నాగరికత' ప్రాతిపదికను నిర్వచించారు. అరణ్య జీవన స్థితి అనాగరిక స్థితి నాగరికస్థితిలో రెండో దశ అనాగరికత దశకు చెందినవారు జానపదులన్నారు. ఆ విధంగా 'పల్లెటూరు'కే పరిమితమైపోయిన నిర్వచనం పరిణామంలో విస్తృతి చెంది నాగరికతలో రెండో దశకు చేరుకుంది. ఆ విధంగా జానపదులు పల్లెటూరికే పరిమితమైపోయి, ఎల్లకాలం అక్కడే ఉండిపోరు. సామాజిక రాజకీయ ఆర్థిక పరిణామాల్లో బ్రతుకు తెరువు కోసమో, విద్యకోసమో, ఉద్యోగం కోసమో, వ్యాపారం కోసమో, పెద్ద జనసమూహం ఉన్న ప్రాంతాలకు అంటే పట్టణం – నగరం – మహానగరం వెళ్ళిపోతారు. జానపదులు ఆ విధంగా వెళ్లిపోయారంటే, వాళ్లతో పాటు తరతరాలుగా సంక్రమించిన వాళ్ల జీవన విధానాన్ని, జీవన సంస్కృతిని మోసుకుపోతారు. అవి 'పెద్ద సమూహం' జీవన విధానంలో ఒకేసారిపోవు. క్రమక్రమంగా కొన్ని అవశేషాలను, చిహ్నాలను మిగుల్చుకుంటూ నశించిపోతాయి. అందువల్ల ఏ సమూహమైన జానపద జీవన విధానం జానపద జీవన సంస్కృతికి సంబంధించిన ఏవైనా చిహ్నాలతో ఎక్కడ ఉన్నా వాళ్లు ఎక్కడ ఉన్నా 'జానపదులు'గా పరిగణింపబడతారు. ప్రముఖ జానపద శాస్త్రజ్ఞుడు, అలన్ డండెస్ మాటలు ఇక్కడ చెప్పుకుందాం.

" The term ' folk ' can refer to any group of people what so ever who share atleast one common factor. It does not matter what the linking factor is- it could be a common occupation, language, religion, - but what is important is that a group formed for whatever reason will have some traditions which it calls its own. In theory, a group must consist of at least two persons, but generally most groups consist of many individuals. A member of the group may not know all other members, but he will probably know the common core of traditions belonging to the group, traditions which help the group to have a sense of group identity.''

( The study of Folklore - Alan Dundes- (Ed) 1965. ఆ-2 ) .

మారిన స్థితిగతుల్లో – మారుతున్న స్థితిగతుల్లో విశాల ప్రాతిపదిక ఉన్న ఈ నిర్వచనం ఉచితమైనదిగా, సరైనదిగా ఉంది. అలన్ డండెస్ చెప్పిన మరికొన్ని మాటలు కూడా ఈ సందర్భంలో చెప్పుకుందాం.

''... But, if we look at the western '' who are Folk " in a new light, we shall see that the folk are not dying out, that there are folk cultures alive and will in the United states, Canada and Europe and that new folk cultures are bound to arise." (Essays in folkloristics - Alan dandes - 1978. P-6)

కొత్త నగరం జీవన ప్రభావాల్లో జానపద జీవన విధానానికి సంబంధించిన సాంస్కృతిక విషయాలు మార్పుకి గురి అవుతాయి. ఆ ప్రభావంలో కొత్త 'మిశ్రమ' జానపద సంస్కృతి ఏర్పడొచ్చు. కొత్త జానపద సంస్కృతి కూడ ఏర్పడొచ్చు అలన్ డండెస్ పరిశీలన నుంచి ఈ అవగాహన కలుగుతుంది. ఇటువంటి ఆశావహ పరిశీలనలు సంస్కృతి పరిరక్షణకు ఉపకరిస్తాయి. 'పరిణామ సిద్ధాంత' సంస్కృతికి కూడా వర్తిస్తుంది. జానపద సంస్కృతిలో జానపద విజ్ఞానంలో మిగిలిన 'అవశేషాలు – ఆనవాళ్లు' పరిశీలిస్తే, 'పరిణామ సిద్ధాంతం' వర్తిస్తుందని స్పష్టమౌతుంది.



'జానపదులు' అంటే ఎవరో కొంత వరకూ అవసరం మేరకు తెలుసుకున్నాం.

జానపద కథం అంటే ఏమిటో తెలుసుకోవాలంటే 'జానపద సాహిత్యం' గురించి తెలుసుకోవాలి. 'జానపద సాహిత్యం, గురించి తెలుసుకోలంటే, 'జానపద విజ్ఞానం' గురించి తెలుసుకోవాలి. ఆ పద్ధతిలో ముందుకు వెళదాం.

నాగరికత వేరు. యాంత్రీకరణ – పారిశ్రామికీకరణ – సాంకేతీకరణ అందిస్తున్న సదుపాయాలు వాడుకుంటూ కొన్ని సాంప్రదాయ విశ్వాసాలకు దూరమౌతూ, జీవించే వేగవంత జీవన విధానం – భౌతిక అభివృద్ధిలో జరుగుతున్న కృషి నాగరికత ఔతుందని ఈ వ్యాస రచయిత అభిప్రాయం. వేగం తీరికలేనితనం ప్రధాన లక్షణాలుగా కనబడుతున్నాయి. అందరూ సమానంగా బాగుపడి సుఖించే వివక్షరహిత, కులరహిత, వర్గరహిత, సమసమాజ ప్రజాస్వామ్య శాంతియుత సహజీవనం కోసం జరుగుతున్న కృషి సంస్కృతి అని ఈ వ్యాస రచయిత అభిప్రాయం.

## జానపద విజ్ఞానం అంటే ఏమిటి ?

ఆంగ్లంలోని 'folklore' అన్నమాటకు సమానార్థంగా తెలుగులో 'జానపద విజ్ఞానం' అన్నమాటను వాడుతున్నారు. 'folklore' అన్న పదాన్ని క్రీ॥శ॥ 1846 ప్రాంతమున విలియం జె.థామస్ (William J. Thomas) సృష్టించాడు. అతడు ది ఆథనీయం (Theathenaeum) అను పత్రికకు పదాన్ని వాడమని ఉత్తరం రాశాడు. Popular antiquities and people literature కు బదులుగా ఈ మాటను వాడమని సూచించాడు. దాని అర్థాన్ని కూడ కొంతవరకు సూచించాడు.

Maria leach కూర్చిన Standard dictionary of folklore mythology and legend (edited by mariaderh, Funk wagnalls or types and clarification of folklore అను వ్యాసము – పుటలు 1138 – 1147) లో 21 మంది శాస్త్రజ్ఞుల నిర్వచనాలు ఇవ్వడం జరిగింది.

అలన్‌డండెస్ ఏయే అంశాలు ఉంటే 'జానపద విజ్ఞానం' ఔతుందో, ఆ అంశాల జాబితాను ఇచ్చాడు. అంతేకాకుండా, "It might be better to use the term for folklore for the material and the term folklorstics for the study of the materials అలన్ డండెస్ నిర్వచనం అశాస్త్రీయమైందని భావించారు.

"Folklore is an echo of the part, but at the same time it is also the vigorous voice of the present" అన్నాడు రిచర్డ్ ఎమ్. డార్సన్ (Folklore and folklife introduction, richord M. dorson (ed) 1972-P 17) Those materials in culture that circulate" traditionally among members of any group in different versions, whether in oral form or by mean of (jen harded brunvend) customary example" అని బ్రున్‌వాండ నిర్వచించాడు. (An introduction to the study of indian Folklore by P.R. Subramanian - 1972 – P – 47) ఈ నిర్వచనాన్ని సముచితమైనదిగా కొందరు భావించారు. ఎందుకంటే జానపద విజ్ఞానాన్ని, జానపదం కాని విజ్ఞానం నుంచి వేరు చేయడానికి ఉపకరిస్తుంది.

రిచర్డ్ ఎం. డార్సన్ (Richard M. Dorson) జానపద విజ్ఞానాన్ని నాలుగు శీర్షికల కింద విభజించాడు. తాను సంపాదకుడిగా వ్యవహరించిన Folklore and folklife గ్రంథానికి పరిచయంలో నాలుగు శీర్షికల కింద విభజన చేశాడు. ఇందులోనూ కొన్ని లోపాలు ఉన్నప్పటికీ, ఉన్నవాటిల్లో ఇది శాస్త్రీయంగా ఉందని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు. 1. మౌఖిక జానపద విజ్ఞానం (Oral Folklore) 2. సాంఘిక జానపద ఆచారాలు (Material Culture) 4. జానపద కళలు (Folk Arts).

**1. మౌఖిక జానపద విజ్ఞానం :** జానపదగేయాలు, కథాగేయాలు, జానపద పురాణాలు, ఐతిహ్యాలు, గద్యకథలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు మొదలైనవన్నీ ఈ విభాగంలోకి వస్తాయి.

**2. సాంఘిక జానపద ఆచారాలు :** పుట్టుక - వివాహం - మరణం - కుటుంబ సంబంధాలు - మతం విశ్వాసాలు - వైద్యం - పండగలు - ఆటలు వినోదాలు మొదలైన ఆచారాలు ఇందులోకి వస్తాయి

**3. వస్తు సంస్కృతి :** భౌతిక జీవితానికి సంబంధించిన అన్ని వస్తువులు ఇందులోకి వస్తాయి. వృత్తి - ఆహారం - పూజ - అలంకరణ - వస్త్రధారణ - కళలు - కు సంబంధించిన అన్ని వస్తురూపాలు, పరికరాలు మొదలైనవి ఇందులో చేరుతాయి.

**4. జానపద కళలు :** సంగీతం, నృత్యం, అభినయం ఉండే అన్ని ప్రదర్శన కళలు ఇందులోకి వస్తాయి. గాత్ర వాద్య సంగీతాలు, తోలుబొమ్మలాటలు, వీధిభాగోతం, కోలాటం, గారడీ, పగటి వేషాలు, యక్షగానం మొదలైనవన్నీ ఇందులో చేరుతాయి. జానపద విజ్ఞాన సమగ్ర అధ్యయనానికి ఆర్.ఎస్. బాగ్స్ విభజన ఉపకరిస్తుంది. (Standard Dictionary of folkflore, mythology and legend mariadeerh - (ed) - 1975 - pp 1138 - 1147) ఈ విభజనను ఆర్వీయస్. సుందరం శాస్త్రీయంగా వివరించారు. (ఆంధ్రుల జానపద విజ్ఞానం డా॥ ఆర్వీయస్ సుందరం - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి - 1983 - పుటలు - 05 -07). ఈ వర్గీకరణవల్ల ముఖ్యంగా రెండు ప్రయోజనాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. 1. ప్రపంచంలో ఏమూలకు సంబంధించిన జానపద విషయమైనా సరే ఒక నిర్ధిష్ట సంకేతాన్ని ఉంచుకుని దాన్ని తులనాత్మకంగా పరిశీలించడానికి వీలౌతుంది. 2. ఇటువంటి సూక్ష్మ విభజనవల్ల, జానపద విజ్ఞానంలో ఏయే అంశాలు వస్తాయన్నది తెలిసి దాని స్వరూపం మనకు బోధపడుతుంది.



19వ శతాబ్దిలో జానపద విజ్ఞానం పట్ల ఆసక్తి వచ్చింది. అధ్యయనాలు చేసి శాస్త్రజ్ఞులు పలు సిద్ధాంతాలు ప్రతిపాదించారు. 'జానపద విజ్ఞానం' ఎప్పుడు పుట్టింది - ఎక్కడ పుట్టిందో - ఎందుకు పుట్టింది - ఏ విధంగా పుట్టింది - అన్న సమాచార సేకరణకు విశ్లేషణకు సిద్ధాంతాలు ఉపయోగపడతాయి. జానపద విజ్ఞానంలోని పలు శకలాల స్వరూప స్వభావాలూ, ప్రయోజనాలు తెలుసుకోవడానికి ఆ సిద్ధాంతాలు ఉపకరిస్తాయి. జానపద విజ్ఞాన ఉత్పత్తికి సంబంధించి రెండు ముఖ్య లక్షణాలను ఉపయోగిస్తారు. 1. బహుప్రదేశ అస్తిత్వం (Multiple existence) 2. వివేకరాహిత్యం (Irrationality) బహుల ప్రదేశ అస్తిత్వం గురించి పరిశీలించడానికి రెండు పద్ధతులు వాడుతారు. 1 ఏకోత్పత్తివాదం (Manogeneris) 2. బహుళోత్పత్తివాదం (polygeneris) అదే విధంగా జానపద విజ్ఞానం పుట్టుకను గురించి తెలుసుకోడానికి ఉపయోగించే కొన్ని సిద్ధాంతాలున్నాయి.

1.జూలియస్ క్రోహ్న్ (Julios krohn) మరియు కార్లే క్రోహ్న్ (Karle krohn) ప్రతిపాదించిన చారిత్రక భౌగోళిక సిద్ధాంతం 2. చారిత్రక పునర్నిర్మాణ సిద్ధాంతం (Historical reconstructional theory) 3. ధార్మిక కర్మకాండ ఆచారణాత్మక సిద్ధాంతం (Ritualistic Theory) 4. లడ్విగ్ క్రైస్నర్ ప్రతిపాదించిన మనో విశ్లేషణ (Psychoanalysis) సిద్ధాంతం. పైన పేర్కొన్న సిద్ధాంతాలను చదివి అవగాహన ఏర్పర్చుకుంటే, శాస్త్రీయమైన విధంగా సమాచార సేకరణ, జ్ఞానసేకరణ వీలౌతుంఉది. ఈ సిద్ధాంతాలు పలు గ్రంథాల్లో పేర్కొనడం జరిగింది. వివరించడం కూడ జరిగింది.

**జానపద విజ్ఞానం వల్ల ప్రయోజనాలు :**

మానవ శాస్త్రజ్ఞులు, ఇతర శాఖల శాస్త్రజ్ఞులు ప్రయోజనాలకు సంబంధించి పలు పరిశోధనలు జరిపారు. ప్రకారాత్మక సిద్ధాంతం (Functional theory) zunimy thology (జుని పురాణ శాస్త్రం) పరిశోధకురాలు బెనెగడిక్ట్ (Rutn bendict) సూత్రీకరణలు - విలియమ్ బేస్కమ్ (william bascom) సూత్రీకరణలు - రాజకీయ ప్రచారాత్మక సూత్రీకరణలు (Ideological theory) వంటి పలు సిద్ధాంతాలు - సూత్రీకరణలు - ప్రయోజనాలకు సంబంధించిన సమాచారాన్ని, జ్ఞానాన్ని అందిస్తాయి. ముఖ్యంగా ముందు చెప్పిన డార్సన్ - 1972 గ్రంథంలో వివరాలు దొరుకుతాయి.

1. ప్రతిజానపద ప్రక్రియకూ ఒక నిర్దిష్టమైన ప్రయోజనం ఉంటుంది. 2. జానపద విజ్ఞానం సాంస్కృతిక నియమావళిని పట్టించుకోకపోవచ్చు. 3. రాజకీయ ప్రచారాలకు ఉపయోగపడుతుంది. 4. వినోదం - విజ్ఞానం కలిగిస్తాయి. 5. సంస్కృతిని పరిరక్షిస్తాయి. 6. విద్యాభ్యాసంలో ఉపయోగపడుతుంది. 7. క్రమశిక్షణకు సహకరిస్తాయి. 8. అశ్లీల వంటి నిషిద్ధ అంశాలను కూడ స్వేచ్ఛగా ఉపయోగిస్తాయి. 9. సమూహంలోనూ - సమూహాల మధ్య - ఐక్యతకు ఉపయోగపడతాయి. ఆ విధంగా పెక్కు ప్రయోజనాలు, వాటి ప్రత్యేక లక్షణాలవల్ల సమకూరుస్తాయి. 10. చరిత్ర రచనకు - సామాజిక పరిణామాలు తెలుసుకోడానికి పనికొస్తాయి. 19వ శతాబ్ది నుంచి జానపద విజ్ఞానం పైన శాస్త్రీయమైన అధ్యయనం ప్రపంచ వ్యాప్తంగా ప్రారంభమైంది. తెలుగులో కూడ కల్నల్ కానిన్ మెకంజీ (1754 - 1821), సి.పి. బ్రౌన్, జె.ఎ. బోయల్ (J.A. Boyle), నందిరాజు చలపతిరావు మొదలగువారితో విజ్ఞాన సేకరణ ప్రారంభమైంది. సంప్రదించిన గ్రంథాలను, సిద్ధాంతాలను, సౌలభ్యం కోసం ఎక్కడికక్కడ ఇవ్వడం జరిగింది.

•

## కవిత

# అపర బ్రహ్మ

**-డా॥ ఈదూరు సుధాకర్**

పొద్దు పొడవక ముందే
అతడా  బోధి చెట్టు కింద
బుద్ధునిలా కూచుంటాడు
కత్తి ఆరెలను కళ్ళకద్దుకుని
చెప్పు ముక్కల్ని-
చందనపు చెక్కలా పేర్చుకుంటాడు



కాలం కన్నా వేగంగా కదిలే కాళ్ళను
తన కళ్ళ కెమెరాలో బంధిస్తుంటాడు
తెగిపోయిన చెప్పులను
మాసిన బూట్లను - ఆశగా చూసి
స్నేహితునిలా పలకరిస్తుంటాడు

కప్పు కాఫీకు ఐదు
క్వార్టర్ బాటిల్‌కు పది
టిప్పులేసే దానకర్ణులు
పాదరక్షలకు ప్రాణంపోసే
ఈ అపరబ్రహ్మలకు మాత్రం
బేరమాడి బేరమాడి బిక్షమేస్తుంటారు
మనిషి ఆకలిజీవి కదా
చీకటి పడే వేళకు
చిల్లర లెక్కేట్టుకుంటూ
పాత చెప్పుల మూటను బుజానేసుకుని
విక్రమార్కునిలా వెళుతూ ఉంటాడు

---

# కూడలి

**- ఈతకోట సుబ్బారావు**

భుజాలపైన మోస్తున్న ఆకాశం
గుండెల్లోకి దిగుతోంది
జాగర్త పడాలిప్పుడైనా
నా వెనుక నడిచే నా నీడ
దిక్కులు మారుతోంది
అడుగులు సవరించుకోవాలికనైనా
కలలకి రంగులు తొడగలేక
నల్లని కనుగుడ్లిప్పుడు



నిజాల్ని అబద్ధాలతో
కల్తీ చేయనారంభించాయి
ఎవడు ఎవడితో
ఏ భాషలో మాట్లాడినా
అవసరాల్నే తప్ప
మనసిచ్చి పుచ్చుకొనే రుతువు లేదు

పరిమళించే చిర్నవ్వు కోసం
ఏ తోటని అన్వేషించాలి?
ఏ చోట గుండె తవ్వితే
మానవ జల వూరుతుందో?
ఎదుగుతున్న కొద్దీ తరిగిపోతున్నాం
మన లోపల మనమే
మరో మనిషిని సృష్టించుకొంటున్నాం
నాలుగుదార్లు కలిసే చోటునించే
నాలుగు దిక్కుల పయనం
చేతులు కలపడమో
ముఖలు చాటేయడమో
ఇక్కడే ఇప్పుడే తేల్చుకోవాలి!

---

# అక్షర సాక్షి

**- జి. లెనిన్ శ్రీనివాస్**

అక్షరాలను ఏర్చికూర్చిన అల్లిక
హృదయాంతరాల
ఎత్తులోతులు తరచి చూచి
దూరతీరాలకు తీసుకువెళ్ళి
వాగు వంకలు, ఎండవానలు ఎదిరించి
అందని ఆకాశంలోనికి విహరించే
ఊహల భాషల ఉషస్సు
చేతి కందగానే మనస్సు యశస్సు
తనువంతా తొలకరి చినుకు పులకరింపు
ఆనందపు కన్నీళ్ళు వర్షించు లోగిళ్ళు
రెండు భావ నదుల సంగమం



రెండు హృదయాల సమ్మిళితం
ఉంచినచోటునే వుండకుండా
ఊహాంచలాల నూతన ప్రదేశాలకు
తనివి తీరా లాక్కువెళ్ళే
జ్ఞాపకాల పరుగుల బండి
దుఃఖంలోంచి ఆనందంలోకి-
సమస్యలోంచి సమాధానాల్లోకి-
అజ్ఞానంలోంచి ఆలోచనల తీరాల్లోకి -

తడి ఆరిన హృదయంలో
ఊట చెలిమల్ని నింపుతూ
ఖండాంతరాలను కలియ చుడుతూ
దిశల తెరల్ని చీల్చుకు పోతుంది!
రెండు కలవని ధృవాల్ని -
ఏకం చేస్తూ ముందుకు సాగే శకటం
అది ఒక అందాల అనుభూతి- ఒక సంజీవిని
వచ్చే ఉత్తరం విషాదాలను తెస్తుంది-
ఉత్సాహపు కాంతులను నింపుతుంది-
నిరీక్షించిన కండ్లకు నీలిమేఘమై -
కవ్వించి తుళ్ళించే హృదయానికి
కాంతిపుంజమై -
ఛిద్రమైన బ్రతుకులకు ఆసరా, ఆకాంక్ష -
అది కాలాన్ని దస్తూరితో బంధించి
కోట్లానుకోట్లు మనసు దొంతరలను సృజించి
అక్షర నిక్షిప్త సాక్షిని చేస్తుంది!

## పరిశీలన




# రచయిత - రాజ్యం

రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి

*పెట్టుబడి రాజ్యాలు ఎంత బలిసినా ప్రపంచ దేశాలకు చివరి విముక్తి సాధనం మార్క్సిజమే. బహుశా అమెరికా విముక్తికి కూడా అదే సాధనం. మార్క్సిజానికి కాలం చెల్లిపోయిందని పెట్టుబడిదారులు చేసే ప్రచారం ఇప్పుడు పై చేయిగా ఉన్నా వాస్తవం వేరొక రకంగా ఉంది. ఏ దేశమైనా సంపూర్ణంగా సమస్యల నుంచి విముక్తం కావాలంటే సమసమాజ నిర్మాణమే మార్గం. ఆయా దేశాల అంతరింగిక సామాజిక స్వభావాన్ని అనుసరించి వచ్చిన దేశీయ భావజాలాలను మార్క్సిజం సమన్వయించుకోవలసిన అవసరం మాత్రం ఉంది.*

*పాడవోయి భారతీయుడా*
*ఆడిపాడవోయి విజయగీతిక ॥పాడ॥*
*నేడే స్వాతంత్ర్య దినం - వీరుల త్యాగఫలం*
*నేడే నవోదయం - నేడే ఆనందం ॥పాడ॥*

1. *స్వాతంత్ర్యం వచ్చెనని సభలే చేసి*
*సంబరపడగానే సరిపోదోయి*
*సాధించిన దానికి సంతృప్తిని పొంది*
*అదే విజయమనుకుంటే పొరబాటోయి*
*ఆగకోయి భారతీయుడా*
*కదలిసాగవోయి ప్రగతిదారులా ॥పాడ॥*

2. *ఆకాశం అందుకునే ధరలొకవైపు*
*అదుపులేని నిరుద్యోగమింకొకవైపు*
*అవినీతి బంధుప్రీతి చీకటి బజారు*
*అలముకున్న నీదేశం ఎటు దిగజారు*
*కాంచవోయినేటి దుస్థితి*
*ఎదిరించవోయి ఈ పరిస్థితి ॥పాడ॥*

3. *పదవీవ్యామోహాలు కులమతభేదాలు*
*భాషాద్వేషాలు చెలరేగె నేడు*
*ప్రతిమనిషి మరియొకని దోచుకునేవాడే*
*తన సౌఖ్యం తన భాగ్యం చూచుకునేవాడే*
*స్వార్థమే అనర్థదాయకం*
*అది చంపు కొనుట క్షేమదాయకం ॥పాడ॥*

4. *సమసమాజ నిర్మాణమే నీ ధ్యేయం*
*సకల జనుల సౌభాగ్యమే నీ లక్ష్యం*
*ఏకదీక్షతో గమ్యం చేరిననాడే*
*లోకానికి మన భారతదేశం*
*అందించునులే శుభ సందేశం.*

**ఒ**క కవి తీసుకునే వస్తువు దాని రచనా కాలానికే కాలం చెల్లిపోయినదిగా ఉంటుంది. కాలం చెల్లిపోయిన వస్తువును తీసుకొని కవిత రాయడం ఆ కవికి గతం మీదగల అభిమానమే కారణంగా ఉంటుంది. మరో కవి తీసుకునే వస్తువు దాని రచనాకాలానికి అవసరమైందిగా ఉంటుంది. దానిని వస్తువుగా తీసుకొని కవిత రాయడం విని ఆ కవి కున్న సమకాలీన స్పృహే కారణమవుతుంది. ఇంకో కవి తీసుకునే వస్తువు దాని రచనాకాలానికి అవసరమైందిగా ఉంటూనే భవిష్యత్తుకు మరీ అవసరమైందిగా ఉంటుంది. దానిని వస్తువుగా తీసుకుని కవిత రాయడానికి ఆ కవికున్న ముందు చూపే కారణమవుతుంది. ఈ మూడో రకం కవిత ఐతిహాసిక కవిత అవుతుంది. దానిని రాసిన కవి క్రాంత దర్శి అవుతాడు.

'వెలుగు నీడలు' సినిమా కోసం శ్రీశ్రీ రాసిన "పాడవోయి భారతీయుడా" పాట ఈ మూడో రకం ఐతిహాసిక కవిత.

ఈ పాట భారత స్వాతంత్ర్యం మీద కవి ఇచ్చిన తీర్పు. స్వతంత్రం వచ్చిన ఏడాదికే 'మన స్వతంత్రం ఒక మేడిపండు. మన దారిద్ర్యం ఒక రాచపుండు' అన్నారు ఆరుద్ర. స్వతంత్రం వచ్చిన మూడేళ్ళకే 'ప్రజల కామితాలు పాటింపలేని స్వరాజ్యమేల? రామరాజ్యమేల?" అని దెప్పిపొడిచారు గుర్రం జాషువా. ఈ విమర్శలన్నిటికీ సమగ్ర రూపంగా ఉంది శ్రీశ్రీ పాట. ఈ పాటలో రాజకీయ విమర్శ వుంది. కర్తవ్య ప్రబోధం ఉంది. స్వతంత్ర్యం వచ్చిన ఒకటిన్నర దశాబ్దానికే ప్రజలలో స్వతంత్రం పట్ల, స్వతంత్ర ఫలితాల పట్ల మొలకెత్తుతున్న అప నమ్మకానికి అసంతృప్తికి ప్రతిఫలనం ఈ పాట.

ఈ పాట రాయబడిన కాలానికి సరిపోవడమే కాదు, నాటి కన్నా నేటికే ఇంకా ఎక్కువ అన్వయిస్తున్నది. ఈ పాటలో శ్రీశ్రీ ప్రస్తావించిన రుగ్మతలన్నీ అప్పట్లో మొలక దశలో ఉండి, నేటికి మహా

వృక్షాలయ్యాయి. మొక్కై వంగనిది మానై వంగునా? కవిమాట పాలకుల చెవికెక్కి ఉంటే వ్యవస్థ ఇంతగా దిగజారేది కాదు. కవి హెచ్చరికల్ని గురించి తనను తాను సవరించుకునే సౌకుమార్యం మన రాజకీయ వ్యవస్థకు లేదు గనుక ఆ రుగ్మతలు నేటికి రాక్షస రూపం ధరించాయి. ఈ పాటను విన్నప్పుడంతా శ్రీశ్రీ ఎంత ముందు చూపుతో రాశాడో గదా ! ప్రతి మాటా పొల్లు పోకుండా ఈ రోజు శ్రీశ్రీ బతికుండి ఈనాటి సమాజాన్ని గురించే రాశారని పిస్తుంది.

స్వతంత్రం వచ్చిన తర్వాత భారతదేశం ఏమీ ప్రగతి సాధించలేదని అనుకోవడం శాస్త్రీయం కాదు. కాని అరవయ్యేళ్ళ స్వతంత్ర భారత చరిత్రలో సాధించవలసినంత సాధించలేకపోయాం. ఇతర దేశాలతో పోల్చి చూస్తే, రాజకీయ మార్పులు వచ్చిన తర్వాత మనం సాధించింది తక్కువ. కారణం మాటలు ఎక్కువ, పనితక్కువ. స్వావలంబన మనం సాధించినట్లు ఎవరైనా గుండెల మీద చెయ్యి వేసుకొని చెప్పగలరా? కూడుగూడు గుడ్డ వంటి సామాన్య ప్రజల జీవిత అవసరాలను సంపూర్ణంగా పరిష్కరించడానికి అరవయ్యేళ్ళు కాలం సరిపోదా? అయితే ఆ అవసరాలెంత వరకు తీరాయి? తాను బతకడం కోసం పిల్లల్ని కని అమ్ముకొనే మహిళల్ని గురించి మాధ్యమాలలో చదువుతూ, చూస్తూ ఉన్నాం.

బంగాళా దుంపలు మొదలుకొని బంగారం దాకా ధరలు ఆకాశంలోగాక నేలమీదున్నాయా? ధరల నియంత్రణ ప్రయత్నం శూన్యమైపోయింది. నిరుద్యోగాన్ని గురించి చెప్పవలసినపనే లేదు. ప్రభుత్వ రంగ సంస్థల్ని మూసేసి విద్యాలయాలను ప్రైవేట్ వ్యాపకాల వైపు తరుముతున్నది ప్రభుత్వం. డిగ్రీలు చదువుకున్న వాళ్ళు ఏ డిగ్రీలు అవసరం లేకుండా చేయగలిగిన పనులు చేస్తున్నారు. "ఆ ఒక్కటీ అడక్కు" అన్నట్లుగా ప్రభుత్వం ఉద్యోగ కల్పనా బాధ్యతల నుంచి ఇప్పటికే చాలా వరకు తప్పుకొంది. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి ఎన్నికలు ముగిశాక ప్రపంచ బ్యాంకు మార్గదర్శకాలకు లొంగి ఉన్న ఉద్యోగులను తొలిగించే పనికి పూనుకొన్న రాజకీయ వ్యవస్థ మనది. అవినీతి భారతీయులకు ఇలవేల్పు, బంధుప్రీతి ఇష్ట దైవం అయిపోయాయి. ఏ సేవా రంగంలో కెళ్ళి ఏ చిన్న పని చేయించుకోవాలన్నా అట్టడుగు ఉద్యోగి నుండి సర్వోన్నత అధికారి దాకా చేతులు తడపందే సాధ్యంకావడం లేదు. పార్లమెంటులో ప్రశ్నలడగడానికి లంచం తీసుకున్న ప్రజా ప్రతినిధులను కన్న భారత భూమి మనది. నవ్వాలా? ఏడ్వాలా? పంచాయితీ మంచి పార్లమెంటు దాకా అవినీతి అల్లుకుపోయింది. ఎందెందు వెదకి చూచిన అందందే గలదు. నేర చరితులు చట్ట సభలలో అధిక సంఖ్యలో ఉన్నారని అనేక సంస్థలు చాటుతుంటే పార్టీలు నోరు మెదపడం లేదు. రాజకీయ రంగంలో పెట్టుబడి వ్యవహారమైపోయింది. ప్రజా సేవలో లాభార్జన అయిపోయింది. రాజకీయాలలో, సినిమాలలో ఇంకా అనేక రంగాలలో కుటుంబ వ్యవస్థ బలపడి పోయింది. గత అరవయ్యేళ్ళలో, ఒక్కొక్క కుటుంబంలో ముగ్గురు నలుగురు రాజకీయ పదవుల్ని 'అలంకరిస్తున్నా'రు. కాంట్రాక్టులలో, వివిధ పదవులలో, ఉద్యోగాలలో బంధు ప్రీతి జాతీయ జెండాగా ఎగురుతున్నది. రైతులకు చేరవలసిన ఎరువులు, విత్తనాలు రాష్ట్ర సరిహద్దులు దాటిపోవడం చీకటి వ్యవహారమే కదా! ఆశ్రమాలలో చీకటి బజారులు కానివెన్ని? మాఫియాల విషయం దేశ భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేస్తున్నది.

"రాయలసీమ నైనా రాసిస్తాను గాని, రాజకీయ పదవిని మాత్రం వదులుకోను" అనే సినిమా డైలాగ్ ఊరికే పుట్టలేదు. మన పదవీ వ్యామోహానికి రాజకీయ హాస్యం అది. కులాల కుమ్ములాటలు మతాల మారణకాండ స్వతంత్ర భారతచరిత్రలో ఎన్ని రికార్డులున్నాయో చెప్పేదెవరు? స్వతంత్రం వచ్చి ఆరు దశాబ్దాలు దాటినా దళితులు ఊరికి వెలుపలే నివాసం చేస్తున్నారు కదా!! ఇండ్లులేని దళితులకు ప్రభుత్వం చిన్నవో పెద్దవో ఇండ్లు కట్టించడం అభినందనీయమే. కాని వాటిని ఊరికి దూరంగానే కట్టించడం మన వ్యవస్థ కొనసాగింపేకదా! తమిళానికి ప్రాచీన భాషా హోదా వచ్చేదాక ఒక రకం నియమాలు. తమిళానికి ఆహోదా రాగానే ఇంకో భారతీయ భాషకు ఆ హోదా దక్కకుండా చేయడానికి మరోరకం నియమాలు పెట్టింది మన కేంద్ర ప్రభుత్వం. రాజకీయ మనుగడ కోసం భాషలమధ్య వివక్ష చూపడం మనువాదం కాదా? తమిళానికి ప్రాచీన భాషా హోదా వచ్చినాక తెలుగు కన్నడ భాషలకు ఆహోదా రాకుండా కోర్టు నుంచి స్టే తెచ్చిన వాడిని మనం ఏమని నిర్వచించగలం. కర్ణాటక తమిళనాడులలో తెలుగు భాష పాతాళానికి తొక్కేయబడుతోంది. పట్టించుకునే నాధుడు లేదు. రాజకీయ ప్రయోజనాల ముందు దేశ ప్రయోజనాలు బలాదూర్. ఒక భాషేయులు మరో భాషను ద్వేషించడం ఒక పార్శ్వమైతే, ఎవరిభాషను వాళ్ళే ద్వేషించడం స్వతంత్ర భారతంలో తెలుగు వాళ్ళు సాధించిన విజయం. తెలుగులో తెలుగెంత? ఉండేది కూడా పోతేపోనీ అని ఒక మేధావి సెలవిచ్చాడు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన ఒక తెలుగుతల్లి మాకు తెలుగెందుకు? నా బిడ్డకు ఇంగ్లీషు కావాలి అని దాపరికం లేకుండా చెప్పగలిగింది. తెలుగు వాళ్ళు డబ్బు సంపాదన కోసం పెట్టుకున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో తెలుగు భాష నిషేధింపబడుతున్నది. తెలుగు మాతృభాషగా గల విద్యార్థి తెలుగే చదువకుండా తన విద్యను పూర్తి చేసుకొనే అవకాశం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. తెలుగు రాష్ట్ర శాసన సభలలో గత పాతికేళ్ళుగా సభాపతులు తెలుగు వాళ్ళయ్యుండే ఆంగ్లంలోనే మాట్లాడుతున్నారు. ఇదంతా స్వభాషాద్వేషమే కదా!

స్వతంత్రం వచ్చిన ఒకటిన్నర దశాబ్దానికి కవి నాటి సమస్యల్ని ఈ పాటలో ప్రస్తావించాడు. అవి ఈనాటికి విరాట్ రూపం ధరించాయి. కొత్త కొత్త ఊహలను సంతరించుకున్నాయి. ఈ సమస్య లకు పరిష్కారంగా ఆయన సమ సమాజ నిర్మాణాన్ని ప్రతిపాదించాడు. ఇప్పుడు సమసమాజాన్ని గురించి మాట్లాడటమే చాదస్తమైపోయింది. పెట్టుబడి రాజ్యాలు ఎంత బలిసినా ప్రపంచ దేశాలకు చివరి విముక్తి సాధనం మార్క్సిజమే. బహుశా అమెరికా విముక్తికి కూడా అదే సాధనం. మార్క్సిజానికి కాలం చెల్లిపోయిందని పెట్టుబడిదారులు చేసే ప్రచారం ఇప్పుడు పై చేయిగా ఉన్నా వాస్తవం వేరొక రకంగా ఉంది. ఏ దేశమైనా సంపూర్ణంగా సమస్యల నుంచి విముక్తం కావాలంటే సమసమాజ నిర్మాణమే మార్గం. ఆయా దేశాల అంతరింగిక సామాజిక స్వభావాన్ని అనుసరించి వచ్చిన దేశీయ భావజాలాలను మార్క్సిజం సమన్వయించుకోవలసిన అవసరం మాత్రం ఉంది.

రచయితలు రాజ్యం కన్నా ముందుంటారు. అందుకే వాళ్ళు క్రాంతదర్శులు. 'కవీ ప్రవక్తా కాలం కన్నా ముందుంటారు" అని గురజాడ అన్నదందుకే. ప్రజా రచయితలు ఆరు దశాబ్దాలుగా చెవినిల్లు గట్టుకొని చెబుతున్నారు. రాజకీయ నాయకులను మారండయ్యా అని వినే వారేరీ!

తెలుగు సాహిత్య చరిత్రలో స్తబ్ధతా దశాబ్దంగా పిలువ బడుతున్న కాలంలో ఈ పాట రావడాన్ని అందరూ గమనించాలి.

*

## కవిత

# జీవనగమ్యం

- చైతన్య ప్రసాద్



నిబిడాంధకార నిశీధిలో
కళ్ళు రెండూ బయటకు తోడి వెదుకుతున్నా
– జీవనగమ్యం కోసం !
కళ్ళు పొడుచుకున్నా కానరాని చీకటి
– నరకమంటే ఇదేనేమో !!
నేలంతా చిత్తడి చిత్తడి – అడుగు తడబడితే
అగాధంలోకి జారిపోతానేమోననే భయం
గుండె ఝల్లుమంటోంది క్షణక్షణం
అయినా – దొరికిన ఆధారం అందిపుచ్చుకుని
వెదుకులాడుతూ పోతున్నా అడుగులో అడుగేసుకుంటూ...
చెవులు చిల్లులు పడి రక్తంకారేలా
కీచురాళ్ళను మించిన దీన ఆర్తనాదాలు
– ఘొల్లుమంటున్నాయ్ !
జానెడు పొట్టను బతికించుకోవడానికి
దొరికితే భూగోళాన్నంతనీ ఒకేసారి మింగెయ్యాలన్నంత
భయంకర ఆకలి ఆక్రందనలు...
గుండెల్లో శూలాల్లా కసుక్కున గుచ్చుకుంటున్నాయ్!
కాళ్ళకు చల్లగా తగులుతున్న శవాల గుట్టల స్పర్శకు
నిలువెల్లా కంపిస్తూ ఒళ్ళు జలదరిస్తోంది
ఒకోసారి అవి కాళ్ళకు లుంగలు పడుతుంటే
విదిలించుకుంటూనే ముందుకుసాగుతున్నా
జారిపోతున్న గుండెల్ని బిగబెట్టుకుంటూ...
ఆకస్మాత్తుగా ఆగిపోతున్న ఆర్తనాదాలు భయంకరమైన నిశ్శబ్దం
అడుగు ముందుకు పడని అయోమయస్థితి
గుప్పుమంటూ చుట్టూ ముసురుతున్న
వెచ్చని పచ్చినెత్తుటి వాసనకు కడుపులోదేవుతోంది!
పటపటమంటున్న ఎముకల చప్పుళ్ళు
ఏదో మహారాక్షసి మనుషుల్ని అప్పడాల్లా విరుచుకుతింటున్న...
భయకరమైన భావన!
ఒళ్ళంతా ముచ్చెమటలు కారిపోతున్నాయ్!!
అక్కడ్నుంచి తక్షణం బయట పడాలనే ఒకే ఒక్క కోరిక
మొండిగా ముందుకు నడిపిస్తోంది వడి వడిగా !

ఈ భయంకరమైన కరువు రాకాసి
ప్రకృతి ఇచ్చింది కాదు మనిషి సృష్టించింది
రాజకీయ రాబందుల
క్రూరమైన రెక్కల చప్పుళ్ళు వింటుంటే అప్పుడు తెలిసింది!
ఆదమరిస్తే – నన్ను కూడా ఎగరేసుకు పోతాయేమోనన్న పచ్చినిజం!!
సంపద సృష్టిస్తున్న శ్రమజీవుల్ని పునాదుల్లో తొక్కేసి
వాళ్ళ శవాల్ని గుట్టలుగా పేర్చుకుంటూ
శీతల భవనాల్ని నిర్మించుకుంటున్న కసాయిమూకలు
వికటాట్టహాసాలు చేసుకుంటూ విందులారగిస్తున్నాయ్!
వాళ్ళ గోదాముల నిండా ఆహారపదార్థాలు
బారులు తీరిన చీమల్ని సైతం చొరనీయకుండా
కాళ్ళతో కర్కశంగా నలిపేస్తున్న కాఠిన్యం...
వాళ్ళొక్కళ్ళే వాంతొచ్చేలా పీకాల దాకా తరతరాలకూ మెక్కాలనీ...
మిగిలిన వాళ్ళంతా ఆకలితో మాడి చావాలనీ అంతులేని దురాశ వాళ్ళ
రమ్య హర్మ్యాలన్నీ బాంబులు పెట్టి బూడిద చేసేయ్యాలి!!
పిచ్చి ఆవేశంతో నా పిడికిళ్ళు రెండూ బిగుసుకుంటున్నాయ్!
కానీ ఎలా? నాకు తోడుగా వచ్చేదెవరు?
అసలు ముందిక్కడ నుండి నేను బయట పడితేకదా!.... అనుమానమే!
ఆశ్చర్యం !?
అల్లంత దూరంలో.. సన్నని సంధ్య వెలుగు..
ఆశగా పరుగులు పెట్టించింది ముందుకు
శరీరాన్ని తాకిన చల్లని స్వేచ్ఛా వాయువులు
పోతున్న ప్రాణాల్ని పట్టి నిలబెట్టాయ్ !
ఒంట్లోని అణువణువు కొత్త జవసత్వాల్నికూడదీసుకుంటున్నాయ్
'మరో ప్రపంచం'లోకి అడుగిడుతున్న అనుభూతి
పచ్చ పకృతిలో పక్షుల కిలకిలా రావాలు హాయిగా ఉన్నాయ్
సంధ్య వెలుగుల్లోంచి ఉన్నట్టుండి ఆకాశం అరుణ వర్ణమయింది
అంతెత్తున రెపరెపలాడుతున్న అరుణపతాక కాంతుల్లో..!
విప్పారిన నారెండు కళ్ళనుండి ఆనంద భాష్పాలు జలజలారాలాయ్
ఈనిబిడాంధకారంలో నుండి.. ఆస్వేచ్ఛా ప్రపంచంలోకి...
ఈ నరకంలో నుండి ఆ స్వర్గంలోకి..
అమాంతం ఒక్కసారిగా దూకేసి కేరింతలు కొట్టాలనిపించింది !
కానీ... అప్పుడే నాలో మనిషి మేల్కొన్నాడు..
వెనక్కు తిరిగి గొంతు చించుకుని అరుస్తున్నా..
'రాక్షసమూకల భవంతుల పునాదుల్లో
కుమిలి కునారిల్లుతూ భయంకరమైన ఆకలితో
ఆక్రోశిస్తున్న ఓ అన్నార్తులా ! ఉవ్వెత్తున లేచిరండ'ని పిలుస్తున్నా!
'వాళ్ళ పాల రాతి పునాదుల్ని పెళ్ళగించుకుంటూ...
ఆ రాజకీయ రాబందుల రెక్కల్ని మొదలంటూ నరికేసి తప్పించుకుంటూ
వేగంగా రండ'ని మరింత బిగ్గరగా అరుస్తున్నా!!
స్వేచ్ఛాలోకంలోకి పిలుస్తోంది మరో ప్రపంచం !
శ్వేతకపోతంలా చేతులు చాచి మరీ పిలుస్తోంది మరో ప్రపంచం !
రండి! పోదాం పదండి!! త్వరగా పోదాం పదండి!!!

కథ

# లేడీ డాక్టర్



- అచ్చుల

***అచేతనంగా పడిపొయ్యాడు ఉన్నట్టుండి కాంతారావు. మాధవి కంగారు పడింది. చుట్టు ప్రక్కలవాళ్లు పోగై హాస్పటల్‌కి తీసుకెళ్లారు. పరీక్షలన్నీ ముగిసాయి. ప్రమాదకరమైన జబ్బే అని తేలింది. ఏం చేయాలో పాలుపోలేదు మాధవికి.***

"మీ నాన్న కొచ్చిన జబ్బు నీకు తెలుసు. ఈసారొస్తే ప్రమాదమన్నారు. ఇంట్లో స్థితి కూడ నీకు తెలుసు. వెంటనే ఆపరేషన్ చేయాలంటున్నారు" కన్నీళ్లు తుడుచుకుంటూ కొడుకుతో అంది మాధవి.

"ఎంతవుతుంది?"

"కనీసం అరలక్షకు తక్కువ కాదన్నారు"

"నా వల్లగాని పని. మీరంటే నాకు గౌరవం భక్తి ఉన్నాయి. కాని అంత డబ్బు సర్దమంటే నావల్ల జరిగేది కాదు." నిస్సహాయతను ప్రకటించాడు కొడుకు. చేసేది లేక వెనక్కి తిరిగొచ్చింది మాధవి. ఈ గండం గడిచి గట్టెక్కేదెట్లా? ఇదే ప్రశ్న మాధవికా రాత్రి నిద్రపట్టకుండా చేసింది.

"ఎలా ఉన్నారు?" సిక్ లీవ్ మీదున్న కాంతారావును పరామర్శించటానికి కొచ్చి అడిగాడు కొలీగ్ శేషగిరిరావు.

అలాగే ఉన్నారు? ఇంటి ఆర్థిక పరిస్థితి మీకు తెలియంది కాదు. జబ్బేమో పెద్దది." శూన్యంలోకి చూస్తూ అంది మాధవి.

"ఇటీవలనే కొత్తగా వైద్యం చదువుకున్న వాళ్లు ఉమ్మడిగా హాస్పిటల్ పెట్టారు. చాలా తక్కువ ఫీజులతో వైద్యం అందిస్తున్నారు. ఉద్యోగులకైతే జీతం, బెనిఫిట్స్‌తో ఎటాచ్‌మెంట్ పెట్టుకోని వైద్యం చేస్తున్నారు." ఆలోచన తర్వాత ఆరే ఆశాదీపానికి నూనెపోసాడు శేషగిరిరావు.

మోడువారే వృక్షానికి వసంతం వచ్చింది.

శేషగిరిరావు అందించిన చిరునామా ప్రకారం హాస్పటల్‌కు చేరుకున్నారు కాంతారావు. మాధవి దంపతులు. హాస్పటల్ ఆవరణంతా జనంతో కిక్కిరిసి ఉంది.

"ఇక్కడ డాక్టర్లు చాలా మంచోళ్లు. బీద బిక్కిని కనిపెట్టి వైద్యం చేస్తున్నారు. నరాల డాక్టర్లు, గుండె జబ్బుల డాక్టర్లు మరీ మంచోళ్లు. ఆళ్లు వెయ్యేళ్లు చల్లంగుండాలి" రోగులు వరుసలో నిలబడి హాస్పటల్‌లోని వైద్యుల్ని దీవిస్తున్నారు.

కాంతారావుని తీసుకొని వరుసలో నిలబడింది మాధవి. పరీక్షలు చేసారు రోగాన్ని బట్టి మర్నాడు స్పెషలిస్టు దగ్గరికి పంపారు.

"నమస్కారం" రెండు చేతులెత్తాడు కాంతారావు. మాధవి స్పెషలిస్టు వైపు దీనంగా చూసింది. ఆపరేషన్ థియేటర్ నుంచి వచ్చిన స్పెషలిస్టు యూనిఫాం విప్పలేదు.

"ఇంతకు ముందు ఏ హాస్పిటల్ లోనైనా ట్రీట్‌మెంట్ తీసుకున్నారా?"

"లేదండి"

''ఎన్నోసారి ఈ జబ్బు రావటం?"

"ఇదే మొదటిసారి" నుదుట పట్టిన చెమటను తుడుచుకుంటూ సమాధానమిచ్చింది మాధవి.



"పేషెంట్‌ని జాగ్రత్తగా చూసుకోవాలి"

సరేనన్నట్లు తలూపింది మాధవి. కొన్ని నిమిషాలు వాళ్ల మధ్య రాజ్యమేలాయి. తీక్షణంగా పేషెంట్‌ని స్పెషలిస్టు చూడటం జరిగింది. పెరిగిన గడ్డం, లోతుకు పీక్కుపోయిన కళ్లు, కళ తప్పిన ముఖం.

"పేషెంట్ చాల చిక్కిపొయ్యాడు. మీకేం భయం లేదు. ఆపరేషన్ జరుగుతుంది. జబ్బునయమవుతుంది."

ఆ భరోసా మాధవి ఆశను చిగురింపచేసింది.

"ఆడపిల్లల్ని పెంచటం, చదివించటం, ప్రయోజకుల్ని చేయటంలో చాలా కుటుంబాలు వివక్షత చూపుతున్నాయి. మగపిల్లలైతే పెట్టుబడి తిరిగొస్తుందని, భవిష్యత్తులో ఆదుకుంటారని ఆలోచిస్తుంటారు. మగపిల్లలైనా, ఆడపిల్లలైనా ఇద్దరూ ఒక్కటే."

డాక్టరు చెప్పే విషయాలకు అవాక్కయింది మాధవి.

"స్పెషలిస్టు వైద్యంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వాళ్లందరం కలసి ఈ హాస్పటల్ పెట్టాం. ఇక్కడ మాలో కుల భేదం కాని, మత భేదం గాని, ఆర్థిక అసమానతలు గాని, ఆడ – మగా తేడాగాని లేవు. అందరి లక్ష్యం ఒక్కటే పేద ప్రజానీకానికి చౌకగా వైద్య సదుపాయాలు కలిగించటమే."

డాక్టరు చెప్పుకుంటూ పోతున్న విషయాలు మాధవికి అయోమయంగా తోచాయి. "ఇక్కడ కట్నాల ప్రసక్తి లేదు. ఎవరికి నచ్చిన వాళ్లని వాళ్లు పెళ్లి చేసుకోవచ్చు" ఈ మాటలు డాక్టరు గారు ఎందుకు చెప్తున్నారో అర్థం కాకుండా ఉంది మాధవికి.

"నేను మీకు కొంతవరకు రుణపడి ఉన్నా" ఈ మాటకు మాధవి నోరు వృత్తమైంది.

డాక్టరుకి, తమకు ఉన్న సంబంధం ఏమిటో అంతుపట్టలేదు మాధవికి.

"అమ్మా!" మాధవిని చుట్టేసుకుంది డాక్టరు.

"నేను... రాధని..." యూనిఫాం తీస్తూ అంది.

"నన్ను క్షమించమ్మా" రెండు చేతులు పట్టుకున్నాడు కాంతారావు. ఇదంతా కలా, నిజమా? అనిపించింది మాధవికి

"మీ రుణం తీర్చాల్సిన బాధ్యత నాకుంది. +2 వరకు చదివించబట్టే ఆ తర్వాత డాక్టర్ని కాగలిగాను. అసలు బడిలోనే చేర్చకపోతే పరిస్థితి ఇలా ఉండదు. అంతవరకు చదివించినందుకు కృతజ్ఞతలు. మీరు చూపించిన లింగ వివక్షతే నాలో పట్టుదల రగిలించింది. నా లక్ష్యం చేరుకున్నాను. నా ప్రయాణంలో ఎన్నో బాధలుపడ్డాను". చదువు విషయంలో కూతుర్ని వివక్షతగా చూసినందుకు తల్లడిల్లిపొయ్యాడు కాంతారావు. జరిగింది తలుచుకుని కుమిలాడు.

కూతురు కోసం వెతికిన దారులు, జ్ఞాపకం వచ్చినప్పుడు కుమిలిన గాథలు జ్ఞాపకం వచ్చాయి కాంతారావు – మాధవి దంపతులకు.

"వైద్యం చెయ్యటమే కాదు, మీకే యిబ్బందొచ్చినా ఆర్థికంగా కూడ ఆదుకుంటాను. అవును తమ్ముడేం చేస్తున్నాడు?"

''వాడి సంపాదన సంసారం జరగటానికే పరిమితమవుతుంది. డిగ్రీ చేయించినా ప్రభుత్వ ఉద్యోగం దొరకలేదు. కంపెనీలో ప్రైవేటు గుమాస్తాగా జీవనం సాగిస్తున్నాడు. చాలీ చాలని జీతంతో సంవత్సరానికో కంపెనీతో పాటు నివాసమూ మారుస్తున్నాడు"

"వాణ్ణి కూడ ఒకసారిక్కడికి రమ్మని చెప్పండి. అసలు అడ్రసే తెలియక పోయింది."

మాధవికి, కాంతారావుకు రాధ కొండంత అండగా కనపడింది.

●

## కవిత

# నిఘా వుంటే దగాపడవేమో!

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి



విత్తులో...
మధురస భరితమై
నోరూరించే పండు వుంటుందో
కర్కశంగా బాధించి
నెత్తురు రుచిచూచే
ముల్లు వుంటుందో
ముల్లుపై నవ్వుతూ
ఊగిసలాడే అందమైన
పువ్వు వుంటుందో తెలిసేది
విత్తు మొలకెత్తి
చెట్టు అయితేనే గదా!
మనిషీ అంతే!
లోన తలెత్తిన భావ ప్రకటనలు
మూతు లెల్లబెట్టి రూపుదాల్చినప్పుడే
వాడు వినాశనకారో! విద్రోహకారో!
వినిర్మాణకారో! విప్లవకారో!
మరెవరో! అంతుబట్టేది!

ఇద్దరి మధ్య విభేదాలు
తర్కం కొలిమిలో కాగి
అర్థవంతంగా నిలబడ్డప్పుడే
ప్రేమకు అంకురార్పణ జరుగుతుంటుంది!
రెండు దేశాల మధ్య చర్చలు
సామరస్యంగా సాధువర్తనంగా ముగిసినప్పుడే
మనసులు కుదుటబడి
కరాలు ముడివడుతుంటాయ్!

జ్ఞానాన్ని ఆశ్రయించినా
గ్రహణ స్థితి లేని హృదయాలు
మురళీనాదమై మ్రోగలేనట్లు
విశ్వాసం నమ్మకం లేక
సమస్యలు ఈదేవాళ్ళు
లక్ష్యం లేని పిచ్చికుక్కల్లా
తిరుగుతూనే ఉంటారు!

ఎడారిలో నీటిబొట్లు ఇంకినట్లు
దారిద్ర్యం ఎదమీద
కన్నీటిబొట్లింకుతుంటాయ్!
మనిషిలో ఎప్పటికీ
మానని గాయమైన ఆకలి
ఆలోచనలకు పురిటిల్లై
చివుళ్ల మేసే గొంగళిపురుగులను
స్వేదం దోచే గోముఖవ్యాఘ్రాలను
ప్రతిఘటిస్తూనే వుంటుంది!

అదునులో రైతు
విత్తే ముందు విత్తనం గుణమెరిగినట్లు
ఎన్నికల్లో
విత్తంవిత్తి ఇంద్రజిత్తులై మొలకెత్తే
పాలకుల పాలసీ మీద
నిఘా వేస్తే దగాపడవేమో కదా!!


**'ప్రస్థానం'కు చందా కట్టండి!**
**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!**

అయిదేళ్లకు : రు. 500/-
పదేళ్లకు : రు. 1000/-

సంవత్సర చందా (వ్యక్తులకు) : రు.120/-
సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-
విడి ప్రతి : రు. 10/-

**చందా దారులకు విజ్ఞప్తి** చిరునామా పైన చందా ప్రారంభ మరియు ముగింపు నెలలు సూచించబడినవి. దయచేసి చందా ముగిసిన వారు తమ ముగింపు నెలను గుర్తించి వెంటనే చందాను పునరుద్ధరించుకోగలరు.

ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20
వివరాలకు : 040-27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in

## విశ్లేషణ

# సాహిత్యంలో కులాధిపత్యం : నన్నయ్య నాటి చరిత్ర



**- డా॥ కత్తి పద్మారావు**

*తెలుగు సాహిత్య చరిత్రను పూర్తిగా తిరగ రాయవలసిన చారిత్రక అవసరం కనిపిస్తుంది. సాహిత్యంలోనే కాక భావజాల రంగంలోనే కాక సాహితీ చరిత్ర నిర్మాణంలోనే బ్రాహ్మణవాదం వేళ్ళూనుకొని వుంది. చారిత్రక భౌతికవాద దృక్పథంతోనూ అంబేద్కర్, పూలే ఆలోచనలతోనూ చూసినప్పుడు ఈ అణచివేత తీవ్రత మనకు అర్థమౌతుంది. హిందూ సామ్రాజ్యవాద సంస్కృతిని ఎదిరించాలనప్పుడు ఈ చారిత్రక దృక్పథం అనివార్యం.*

తెలుగు సాహిత్యం నన్నయకు పూర్వం ఎంతో కాలం నాటిది. నన్నయ సమకాలంలో కూడా ఎంతో సాహిత్యం వచ్చింది. అయితే నన్నయను ఆదికవిగా పేర్కొనడం ఆ తరువాత తిక్కనను రెండు వందల సంవత్సరాల తరువాత మహాకవిగా వర్ణించడం బుద్ధి పూర్వకంగా చేసిన పని. ఈ మధ్య కవులందరిని నామమాత్రంగా పేర్కొని వారిద్దరినే గొప్ప కవులుగా కీర్తించడం వెనుక కులతత్వం వుంది. శాఖాభేదం వుంది. వర్ణ పక్షపాతం వుంది. వీటిని విడమర్చి చూస్తే తెలుగు జాతి చరిత్ర విస్తృతమై అటు కన్నడుల కంటే, తమిళులకంటె మహోన్నతమైనది, విశాలమైనది అవుతుంది.

ఈ క్రమంలో తెలుగు సాహిత్య చరిత్రలో బ్రాహ్మణవాదం మొదటి నుండి వేళ్లూనుకొనివుంది. బ్రాహ్మణవాదానికి మూలమైన విషయం తమ కులాన్నిబట్టో, మతాన్నిబట్టో కవిత్వాన్ని అంచనావేయడం. ముఖ్యంగా బ్రాహ్మణుల్లో వైదికులు, నియోగులు అనే భేదం మొత్తం సాహితీ చరిత్రనే ఒక పార్శ్వానికి నెట్టింది. బ్రాహ్మణుల్లో వైదికులని, నియోగులని రెండు శాఖలు వున్నాయి. కవిత్వానికి నియోగులే ప్రసిద్ధులు, వైదికులు ప్రసిద్ధులు కారని ఒక విశ్వాసం. అందుకనే సాహితీ చరిత్ర రాసేటప్పుడు ఈ కవి నియోగా? వైదికుడా? అనే చర్చ ఎక్కువ చేసేవారు. సాక్షాత్తు సంఘ సంస్కర్త అయిన కందుకూరి వీరేశలింగం నన్నయ గురించి చెప్తూ సాహితీ చరిత్రని వైదిక నియోగ భేద చర్చతో ఇలా ప్రారంభించారు. "నన్నయభట్టారకుఁడు సంస్కృతభారతమును దెనిఁగింప నారంభించిన కవి. ఇతఁడు ముద్గలగోత్రజాతుఁడగు వైదికబ్రాహ్మణుఁడు. ఒకానొక రీతఁడు వైదికబ్రాహ్మణుఁడు కాఁడనియు, తెలుఁగు కవిత్వమునకు మొదటినుండియు నియోగులే ప్రసిద్ధులయియుండుట చేత నీతఁడును నియోగియేయయి యుండుననియు, భట్టశబ్దధారణమాత్రము చేత నీతఁడు వైదికియని భ్రమింపగూడదనియు, నియోగియైన శ్రీనాథకవిగూడ తనకాశీఖండములోని ''చిన్నారిపొన్నారి చిఱుతకూకటినాఁడు'' అనుపద్యములోఁ దన్నుఁగూర్చి "శ్రీనాథభట్టసుకవి'' యని చెప్పికొనియెననియు, వ్రాసియున్నారు. నన్నయభట్టారకునికాలము నాఁటికే యాంధ్రస్మార్తుఁడయినట్టు ''తనకుల బ్రాహ్మణు ననురక్తు నవిరళజపహోమ తత్పరు..........నన్నపార్యు జూచి పరమధర్మవిదుఁడు వరచళుక్యాన్వయాభరణుఁడిట్టు లనియెఁ గరుణతోడ'' నని యాదిపర్వములోఁ జెప్పుకొని యుండుటచేత నన్నయ వైదికశిఖామణి యనియే నిశ్చయింప వలసియున్నది. కులబ్రాహ్మణులయి వంశపరంపరగా రాజపురోహితత్వము నిర్వర్తించుచుండుట వైదికులలోనే కాని నియోగులలో లేదు. ఇంకొకరు చాళుక్యులు పశ్చిమము నుండి వచ్చినవారగుటచేత నన్నయభట్టు మహారాష్ట్ర బ్రాహ్మణులసంతతి వాఁడయి యుండు నని వ్రాసియున్నారు."

ఇక్కడ కందుకూరి వీరేశలింగం తన ఆంధ్రకవుల చరిత్రని ప్రారంభిస్తూ ముందుగా కవి బ్రాహ్మణ శాఖను గురించి చేసిన చర్చ యిది. అంటే వీరేశలింగం ఉద్దేశ్యంలో నన్నయ వైదికో, నియోగో తెలియాల్సిన అవసరం వుంది అని. కొమర్రాజు లక్ష్మణరాజు అభిప్రాయం అప్పటి స్మార్త బ్రాహ్మణుల్లో వైదిక నియోగ భేదం లేదు. అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరుడు నన్నయ తమిళుడై వుంటాడని వాదించాడు. అంతేగాక నన్నయ భట్టు వ్రాసిన కొన్ని ప్రయోగాలు తమిళదేశం నుంచి వలస వచ్చిన ఎరుకల వారు మాట్లాడే ప్రయోగాలకు దగ్గరగా వున్నాయని పట్టిక వేసుకొని చూపాడు. నన్నయ మాత్రం తన కుల 'బ్రాహ్మణున్' అని మాత్రమే చెప్పుకున్నాడు. తన శాఖ చెప్పుకోలేదు. నన్నయ భట్టు అనే వ్యవహార నామంలో భట్టు సగం నారాయణ భట్టు నుంచి వచ్చిందని ఈ రచన ఇద్దరు కలిసి చేశారని నారాయణ భట్టు కర్నాటకుడు అని సోమశేఖర శర్మ చెప్తున్నాడు. ఆయన కవిత్వం మీద కంటే ఆయన కులం మీదే ఎక్కువ చర్చ చేశారు. ఇంగ్లీషులో బయోగ్రాఫికల్ ఆఫ్ స్కెచెస్ ఆప్ డెక్కన్ పోయెట్స్ అనే గ్రంథాన్ని కావలి వెంకట రామస్వామి రాశారు. ఆయన నన్నయ మరణం తరువాత అరణ్య పర్వాన్ని బాల సరస్వతి

పూరించాడని ఇలా చెప్పాడు. "This poet also translated two volumes of the Mahabharat into Telugu in conjunction with Narayinbhat, a brahmin of to Indrasect, but while employed in translating the third volume, Nannaya unfortunately died and as no other poet would undertake to complete the translation, a desciple of Nannayabhat named Balasaraswati who was a fellow student with Sarangadhara the son of Raja Raja narendra completed the work after intense labour and application."

***కందుకూరి వీరేశలింగం నన్నయ సమకాలీనులైన కవులను అణగద్రొక్కి పైకి వచ్చాడని చివరికి వారి గ్రంథాలు చించివేయడం, తగులపెట్టటం చేశాడని తెలియజేస్తున్నాడు. ముఖ్యంగా వేములవాడ బీమకవి నన్నయ కాలంలోనే చాలా గొప్ప కవి యని ఆయన రాజసన్మానం ఎక్కడ పొందుతాడో అని ఆయన గ్రంథాలని తగులబెట్టించాడని అలాగే అదర్వణాచార్యుల పట్ల వ్యవహరించాడని నన్నయ గురించి వీరేశలింగం ఇలా తెలియజేస్తున్నాడు.***

ఈ విధంగా నన్నయ భట్టు గురించి వాస్తవాలు చెప్పడం కంటె కూడా తమ శాఖా భేదాలను బట్టే ఆయన్ని వ్యాఖ్యానించారు. చివరకు నన్నయకు మతి తప్పిందని కూడా ఈ పెద్దలు కథలల్లారు. నన్నయ భట్టు నందంపూడి శాసన రచయిత ఒకరు కాదని మారేమండ రామారావు పేర్కొనాడు. గురజాడ శ్రీరామమూర్తి నన్నయ అదర్వణాచార్యులకు ద్రోహం చేశాడని చెప్పాడు. ఇంతకీ రాజరాజ నరేంద్రుడి గురించి నన్నయ పొగిడిన పొగడ్తలన్నీ అబద్ధాలని తేలింది. నన్నయ తన గురించి తాను ఇలా చెప్పుకున్నాడు.

సీ. తన కులబ్రాహ్మణు ననురక్తు నవిరళ
జపహోమతత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది
నానాపురాణవిజ్ఞాననిరతుఁ
బాత్రు నాపస్తంబసూత్రు ముద్గలగోత్ర
జాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్యరచనాభి
శోభితు సత్ప్రతిభాభియోగ్యు

గీ. నిత్యసత్యవచనను మత్యమరాధిపా
చార్యు సుజను నన్నపార్యుఁజూచి
పరమధర్మవిదుఁడు వరచళుక్యాన్వయా
భరణుఁడిట్టులనియెఁ గరుణతోడ

ఈ పద్యానికి నన్నయ్య ఆది పర్వానికి పీఠికను రాస్తూ జి.వి.సుబ్రహ్మణ్యం ఇలా వాఖ్యానించారు. "రాజరాజనరేంద్రుడు కూడ ఆంధ్రమహాభారతాన్ని తెలుగులో నిర్మించగలిగిన మహాతాత్ముని లక్షణాలూ, మహాకవి లక్షణాలూ నన్నయలో దర్శించాడు. నన్నయ భారతావతారికలోని 'తన కులబ్రాహ్మణుడు' అనే పద్యం అందుకు సాక్ష్యం. అందులో నన్నయకు వేసిన విశేషణాలను రెండు రకాలుగా విభజించవచ్చును. అవి 1. నన్నయ వ్యక్తి వివరాలు. 2. నన్నయ సాహితీ వ్యక్తిత్వపు వివరాలు. మొదటి రకానికి చెందినవి. 1. నన్నయ రాజరాజనరేంద్రునికి 'కులబ్రాహ్మణుడు' అంటే వంశపారంపర్యంగా నియమింపబడే పురోహితుడనే మంత్రి. 2. అనురక్తుడు. అంటే రాజుకు ప్రియ మిత్రుడు 3. అవిరళ జపహోమ తత్పరుడు. అంటే వేదవిహిత మంత్ర తంత్ర కర్మలు ఆచరించేవాడని అర్థం. (జపం మంత్రాలకు సంబంధించింది. హోమం యజ్ఞ కర్మ విధులకు సంబంధించింది) 4. సంహితాభ్యాసుడు అంటే వేదాధ్యయన అధ్యాపనాలలో సమర్థుడు. 5. పాత్రుడు – దానగ్రహణకూ, ప్రశంసలకూ యోగ్యుడైనవాడు. 6. ఆపస్తంబ సూత్రుడు 7. ముద్గలగోత్రజుడు – ఈ రెండూ నన్నయ ధార్మిక జీవనపద్ధతికీ వంశౌన్నత్యానికీ సంబంధించినవి. 8. సద్వినుతావ దాతుడు, 9. నిత్య సత్యవచనడు 10. బుద్ధిలో బృహస్పతి వంటివాడు. 11. సుజనుడు (ఉత్తముడు, మంచివాడు) ఈ గుణాలన్నీ నన్నయయొక్క ఉత్తమశీలాన్నీ, ఉత్తమవ్యక్తిత్వాన్నీ, బుద్ధిశక్తినీ తెలుపుతున్నాయి. జి.వి సుబ్రహ్మణ్యం నన్నయ వ్యక్తిత్వాన్ని ఈ పద్యం నుండి ఇలా వాఖ్యానిస్తుండగా కందుకూరి వీరేశలింగం నన్నయ సమకాలీనులైన కవులను అణగద్రొక్కి పైకి వచ్చాడని చివరికి వారి గ్రంథాలు చించివేయడం, తగులపెట్టటం చేశాడని తెలియజేస్తున్నాడు. ముఖ్యంగా వేములవాడ బీమకవి నన్నయ కాలంలోనే చాలా గొప్ప కవి యని ఆయన రాజసన్మానం ఎక్కడ పొందుతాడో అని ఆయన గ్రంథాలని తగులబెట్టించాడని అలాగే అదర్వణాచార్యుల పట్ల వ్యవహరించాడని నన్నయ గురించి వీరేశలింగం ఇలా తెలియ జేస్తున్నాడు. "నన్నయభట్టారకుఁడు తాను రచియింప నారంభించిన శ్రీ మహాభారతమును సంపూర్ణముగా నాంధ్రీకరింపఁలేకపోవుటకు గారణములు పలువురు పలు విధములుగాఁ చెప్పుదురు. కొందరు వేములవాడ భీమకవి శాపముచేతఁ గలిగిన మరణము కారణ మందురు. మఱికొందరు యధర్వాణాచార్యులు తెలిఁగించుచుండిన భారతమును తగులఁ బెట్టించుట చేతఁగలిగిన చిత్తచాంచల్యము కారణ మందురు. ఈ రెండు కారణములలో నేది నిజమైనను, ఈ కవి పరోత్కర్షమును సహింపఁజాలని దుస్స్వభావము కలవాఁడయినట్టూహింపఁ దగియున్నది. ఈయనతోడి సమకాలిఁడైన వేములవాడభీమకవి రాఘవపాండవీయమును కనిజనాశ్రయములోఁ జేర్చి యొకవ్యాకరణమును జేసి రాజసన్మానమును బొందుటకయి రాజమహేంద్రపురమునకుఁదెచ్చి విష్ణువర్ధనునియాస్థాన పండితుఁడయి యున్న నన్నయ భట్టునకుఁజూపఁగా నతఁ డాతనికవిత్వము మిక్కిలి శ్లాఘాపాత్రముగా నుండుట చూచి యోర్వలేక యాపుస్తకములు లోకములో వ్యాపించినయెడలఁ దనపుస్తకములకుఁ బ్రసిద్ధి రానేరదనియెంచి వానిని తగులఁబెట్టించినట్లును, అటుమీఁదట నతఁ డింట లేనప్పుడు భీమకవి వచ్చి యాతని భార్యను నీ భర్త యేమి చేయుచున్నాఁడని యడిగి యామె తన భర్త రహస్యస్థలమున నుండి యరణ్యపర్వము రచించుచున్నాఁడని చెప్పినమీఁదట నతఁడింకను నరణ్యములోనే యున్నాఁడా యట్లే యుండునుగాక యని శపించి తన పుస్తకముల నణఁగఁద్రొక్కెనన్నకోపముచేత నన్నయభట్టు రచించిన ఛందస్సును వ్యాకరణమును భార్య నడిగి పుచ్చుకొని వానిని చించి

గోదావరిలోఁ గలిపివేసి తాను చిరకాలము కష్టపడి చేసిన గ్రంథములు పోయినవన్న దుఃఖముచేత బెంగపెట్టుకొని కాలధర్మము నొందినట్లును, అతని శాపము తగిలి నన్నయభట్టు వనములో మృతి నొంది నట్లును, అట్లు నశించిన వ్యాకరణము సిద్ధులలోఁగలిసిన సారంగధరుఁడు తను చిన్నతనములో నేర్చుకొని యుండుటచేత మల బాలసరస్వతి యను బ్రాహ్మణునకుఁ జెప్పి నట్లును లోకప్రవాదము కలిగి యున్నది. కందుకూరి వీరేశలింగం ఇచ్చిన ఈ సమాచారం వల్ల ఆ రోజుల్లో భీమనలాంటి కవులు ఎందరో అణగ ద్రొకబడ్డారు. రాజులను అంటగాగిన వారి కవిత్వమే లిఖించబడి రాజమందిరాల్లో దాచబడింది. అయితే నన్నయ కాలంలో వందలాది మంది కవులు రాజులను ఎదిరించిన వాళ్ళు అణచివేయబడ్డారు. ఈ దిశగా సాహితీ చరిత్రను మనం అవగాహన చేసుకొనప్పుడు అప్పకవి మాటలను కూడా ఇక్కడ చూద్దాం.

*బ్రాహ్మణుల్లో వున్న శాఖా భేదాలతో పాటు రాజాశ్రయానికి సంబంధించిన ఎంతో పోరాటం జరిగింది. రాజును ఆశ్రయం పొందడమే గాక రాజు దగ్గర సంపదను కొల్లగొట్టడంలో కూడా వీరు పోటీ పడ్డారు. మొత్తం భారత అనువాదంలో భారత ఆధిపత్యాన్నే కాకుండా పాండవులు బ్రాహ్మణులని గౌరవించేవారు కాబట్టి వారికి దానాలు ఇచ్చేవారు కాబట్టి వాళ్ళు కౌరవుల కంటె మంచి వాళ్ళు అన్నట్టు నన్నయ చిత్రిస్తూ వచ్చాడు.*

గీ. ఆంధ్రశబ్దచింతామణి వ్యాకరణము
ముందు రచియించి తత్సూత్రములఁదెనుంగు
బాసచేఁజెప్పె నన్నయభట్టు తొల్లి
పర్వములుమూడు శ్రీ మహాభారతమున

గీ. భారతముఁ దెనిఁగించుచుఁ దారచించి
నట్టి రాఘవపాండవీయము నడంచె
ఛందము నడంప నీ పక్కి సంగ్రహించె
ననుచు భీమన యెంతయు నడఁచె దాని
అను పద్యములు కనఁబడుచున్నవి.

ఈ కథనం మీద చారిత్రక చర్చ జరగలేదు గానీ చాలా విషాదకరమైన సంఘటనలు రాజరాజనరేంద్రుని కాలంలో చోటు చేసుకున్నట్లుగా మనకు తెలుస్తుంది.

వేములవాడ భీమ కవిని ఒక చాటుకవిగా ప్రచారం చేసి నన్నయనేమో ఆకాశానికి ఎక్కించాడు. బ్రాహ్మణుల్లో వున్న శాఖా భేదాలతో పాటు రాజాశ్రయానికి సంబంధించిన ఎంతో పోరాటం జరిగింది. రాజును ఆశ్రయం పొందడమే గాక రాజు దగ్గర సంపదను కొల్లగొట్టడంలో కూడా వీరు పోటీ పడ్డారు. మొత్తం భారత అనువాదంలో భారత ఆధిపత్యాన్నే కాకుండా పాండవులు బ్రాహ్మణులని గౌరవించేవారు కాబట్టి వారికి దానాలు ఇచ్చేవారు కాబట్టి వాళ్ళు కౌరవుల కంటె మంచి వాళ్ళు అన్నట్టు నన్నయ చిత్రిస్తూ వచ్చాడు. సభాపర్వంలో ధర్మరాజు యొక్క గొప్ప తనాన్ని వర్ణిస్తూ ఒక్కొక్క బ్రాహ్మణుడికి వెయ్యి గోవులు దానం చేసినట్లు చెప్పాడు. అంటే అలా పదివేల మంది బ్రాహ్మణులకు వెయ్యి గోవుల చొప్పున ఇచ్చాడు. 10,000×1000= 1,00,00,000 చొప్పున ఇచ్చాడని పద్యంలో సంఖ్యతో సహా ఇలా చెప్పాడు.

ఉ. వీరుఁడు ధర్మజుండు పదివేవురు విప్రుల కొప్పఁబాయసా
హారము భక్తిఁబెట్టి మతి యందఱకుం జెఱువేయునేసి వి
స్తారయశుండు ధేనువుల ధర్మవిధిన్ మణి ముద్రికాద్యలం
కార దుకూల పుష్పఫల గంధయుతంబుగ నిచ్చి లీలతోన్

వీరుడు, విశేష కీర్తిమంతుడు అయిన ధర్మరాజు పదివేలమంది బ్రాహ్మణులకు భక్తితో పాయసాన్నం పెట్టాడు. అంతేకాదు ఒక్కొక్కరికి వెయ్యి గోవులతో పాటు, మణి ముద్రికాదులైన ఆభరణాలు, సన్ననివస్త్రాలు, పుష్పఫలగంధాలు వేడుకతో దానమిచ్చాడు.

ఈ భారతంలో పేర్కొన్న ఈ దానక్రమం అంతా రాజరాజనరేంద్రుడి కాలంలో జరిగిందే. ఎవరు రాజులైతే వారిని నుతించి స్తుతించి గోవుల్ని, బంగారాన్ని, భూముల్ని వశం చేసుకున్నారన్నమాట. అంతేగాక ప్రత్యర్థులపై నిర్దాక్షిణ్యంగా దుష్ప్రచారం చేయడం వారిని లెగవకుండా అణచివేయడం చేస్తూ వుండేవారు.

వేములవాడ భీమకవి పుస్తకాలు తగులబెట్టడమే కాకుండా ఆయన ఒక విధవరాలికి భర్త లేకుండా పుట్టాడని, విధవాపుత్రుడని సహపంక్తికి యోగ్యమైనవాడు కాదని, ఆయన మీద బురద చల్లారు. భీమకవి ఒకసారి బ్రాహ్మణులు వడ్డించుకున్న విస్తర్లలో పప్పుల్ని కప్పలుగా, అన్నాన్ని సున్నంగా అవ్వాలని శపించాడని తరువాత భయపడి ఆయన్ని బ్రాహ్మణుల సంఘంలో చేర్చుకున్నారని కథనం. ఏది ఏమైనా సమకాలీనుల గ్రంథాలు తమకు అడ్డం వస్తాయని తగులబెట్టె గుణం వారిని అణచివేయడానికి అనేక ప్రయత్నాలు చేసే వ్యసనం వీరికి వుందంటే ఒక కులం ద్వేషం ఎంత కర్కశంగా వుందో? మనం అర్థం చేసుకోవచ్చు. నన్నయ తరువాత రెండువందల సంవత్సరాలు తరువాత వచ్చిన తిక్కనని రెండవ కవిగా కవుల చరిత్రలన్నీ పేర్కొన్నాయి. నన్నయ అంతటి గౌరవాన్ని తిక్కనకు ఇవ్వడానికి కారణం భారతాన్ని అనువదించడం తిక్కన నియోగబ్రాహ్మణుడు కావడం. ఒక నియోగ బ్రాహ్మణుడు అయితే ఆయన మీద వందల మంది రాస్తారు. నియోగులు ఈ కవిత్వాన్ని వృత్తిగా పెట్టుకున్న వాళ్ళు ఎక్కువ మంది వుండటం దీనికి కారణం. కందుకూరి వీరేశలింగం గారంత సంస్కర్త నన్నయ తరువాత తిక్కననే కవిగా పేర్కొనడం మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

తెలుగు సాహిత్య చరిత్రను పూర్తిగా తిరగ రాయవలసిన చారిత్రక అవసరం కనిపిస్తుంది. సాహిత్యంలోనే కాక భావజాల రంగంలోనే కాక సాహితీ చరిత్ర నిర్మాణంలోనే బ్రాహ్మణవాదం వేళ్ళూనుకొని వుంది. చారిత్రక భౌతికవాద దృక్పథంతోనూ అంబేద్కర్, పూలే ఆలోచనలతోనూ చూసినప్పుడు ఈ అణచివేత తీవ్రత మనకు అర్థమౌతుంది. హిందూ సామ్రాజ్యవాద సంస్కృతిని ఎదిరించాలనప్పుడు ఈ చారిత్రక దృక్పథం అనివార్యం.

○

## విశ్లేషణ

# జ్ఞానో కవి రచనా ధార




**- డా॥ జి.వి. పూర్ణచందు**

**మ**బ్బుల పరదాలు, పచ్చని తివాచీలు, ఊటీలో నడకల అనుభూతుల్ని అక్షరాల్లో పొదిగి ఆలోచనా దారాలతో కథలల్లిన కవి- ఎదలోతుల్ని వెదికి ఆత్మకథని అసలు కథగా మలిచిన కథకుడు- కన్నీళ్ల తెలుగు గంగలో కలాన్ని ముంచి నలిగిపోయిన రైతన్న బతుకు పంచెమీద చిరుగుల్ని చిత్రించిన కథాకవి! ఎక్కడ సంఘర్షణ కన్పించినా కవితగా స్పందించే కాల కవి! సకాల కవి! కొట్టి రామారావు.

కాలం వేగానికి కళ్లెం వేద్దాం అంటూనే, మరో బాల్యాన్ని ఆహ్వానిద్దామంటాడు- ఒక చోట నిప్పులు కురిపించిన మేఘంలా జ్వలిస్తాడు. ఒకచోట 'చంద్రుడి గుండెలో నిద్రించడం రాబోయే కాలంలో నిజం' అని ప్రవర్తిస్తాడు. "జీవితాన్ని అనుభవాల సంవేదనల జ్వాల" అని ప్రవచిస్తాడు. "మనం పీలుస్తున్న ప్రాణవాయువుకు మూలం అమ్మశ్వాస" అంటాడు. మనం ఇంకా ఉమ్మనీటిలోను ఈదుకుంటున్న పుట్టీపుట్టని శిశువులం అనేది ఆయన భావనగా నాకనిపించింది! మన ఆకాంక్షల ఊహాచిత్రాలే మన పిల్లలు- అని సంభవించాడాయన. మనిషి మరణం కన్నా మానవత్వం మరణం ఎక్కువ దుర్భరం అన్నాడు. 'తృప్తి' అనే ఒక్క గుణం ఉంటే ఈ లోకంలో ధనవంతుడెవరు- దరిద్రుడెవరు అని ప్రశ్నిస్తాడు.

కొన్ని మహావృక్షాలు ఎండిపోతాయి. కొన్ని మహాసముద్రాలు చచ్చిపోతాయి. కొన్ని నక్షత్రాలు కరిగిపోతాయి. కొందరు సూర్యులు ఆవిరైపోతారు. కానీ, వర్తమానంలో జీవించే కవి చిరంజీవి అవుతాడు. చిరంజీవమైన కవితలో అంతఃకరణ స్పర్శ ఉంటుంది. అంతరంగ ధ్వని ఉంటుంది. విహారి అభి భాషించినట్లు అనురాగరీతి ఉంటుంది. ఇవన్నీ కవితా సామాగ్రిగా అక్షరాల్లోకీ, శబ్దాల్లోకీ వాక్యాల్లోకీ ప్రవహిస్తాయి. ఇవన్నీ కొట్టి రాముడి కవితా పదార్థాలు! కాలాన్నట్టి పెట్టుకున్నట్టి కవితా రాముడి పేలుడు రసాయనాలు! పేల్చగల కవితా సత్తా ఉంది కాబట్టే కాలాన్ని జయిద్దామన్నాడు. మరో బాల్యాన్ని మళ్లీ పిలుద్దామన్నాడు. జీవన స్వరాలు వినిపిద్దామన్నాడు. సంసార సాగరంలో చిక్కుకున్న నౌకకి దారి చూపించే వైట్‌హౌస్‌లా నిలుద్దామన్నాడు.

పక్కోళ్లని బక్కోళ్లని దయతో చూస్తుండమంటాడు "మంచీ- మనిషీ-' ఈ రెండు విషయాలూ పరస్పర విరుద్ధం కాకూడదని నమ్ముతాడు. మంచి చోట మనిషి ఉండడు. మనుషులున్న చోట మంచి ఉండదు- అనే పరిస్థితి రాకూడదనేమో 'మంచీ- మనిషీ-' అనే కవిత్వాన్ని సంపుటీకరించాడు.

'సంపుటం' అంటే రెండు పాత్రల్ని (గిన్నెలో, బొచ్చెలో, మూకుళ్లో) ఒక చోట చేర్చటం. రెండు పాత్రల్లోనూ కవితా పదార్థాలు నింపి రెండింటినీ సంధానం చేసినప్పుడు అది సంపుటి అవుతుంది. లేదా సంకలనం అవుతుంది. కాని అందువలన ప్రయోజనం ఏముంది...? సంపుటిలోపల పదార్థాలను పక్వానికి తీసుకురావాలి! అవి పాకానికి రావాలి! అందుకోసం భావాల జ్వాలలు వెలిగిస్తూనే ఉంటాడు కవి! వెయ్యి పుటాలు పెట్టి నిగ్గుతేల్చిన ఔషధం ఇది.. అని లోకానికి అందించటమే కవితా సంపుటి! అంతేగాని, అచ్చయినవీ, అవ్వనివీ తెచ్చి అచ్చేసి వదలడాన్ని 'సంపుటి' అంటే ఇబ్బంది!

'కొట్టి రామారావు' కవి 75 ఏళ్ల వయసులో తాను ఆర్జించిన అనుభవాన్ని, ఆదరాభిమానాల్ని, ఆత్మీయతల్ని, అనుబంధాల్ని సంపుటీకరిస్తున్నాడు. అంటే పుటంపెట్టి వదుల్తున్నాడు. సృజనాత్మకతని నిరూపించుకోవటానికే కవితా సంపుటాలు...

ఇప్పుడాయన బోధిచెట్టునీడన కూర్చొన్న మౌని కాదు- జనం నాడి పట్టిన జ్ఞాని... అనేక రంగాలలో అనుభవాలు పండించిన కావ్యకర్షకుడు. కలం హలం పట్టినవాడు. ఇంకా కనీసం పాతికేళ్లలో 50 కోసం వైట్‌హౌస్‌లా నిలిచి వుండే వాడు.. ఉండవలసిన వాడు! అందుకే ఆయనకో విన్నపం...

1) వేలెట్టిన అంశాలు, కాలెట్టిన సంఘటనలు, చూపెట్టిన మార్గాలు, దాబెట్టిన రహస్యాలు, రాబట్టిన విషయాలు.. ఇంక కొట్టి వారి కలంలోంచి బైటకురావాలి! వ్యాసాల రూపంలో రావాలి!

2) కవిత్వం, కథ, నాటిక... ఇవన్నీ రసహృదయానికి సంకేతాలు. కానీ, "వ్యాసం" మేథో పరిణితికి నిదర్శనం. వచనించిన కవిగా, ఎదిగాక, అంటే వచన కవిగా రాణించాక, కవిత్వీకరించిన వచనంగా, కొట్టివారు మారాలి...

3) తానొక 'వేత్త' అయి, శాస్త్రవేత్త అయి, శోధన కోసం, పరిశోధన కోసం, పరిశీలన కోసం, మంచి పరిపాలన కోసం, కలంతో- కాలంతో కరచాలనం చేయాలి...

4) 'కొట్టి' వారొక సిద్ధాంతకర్తయి - నిజమైన వైట్‌హౌస్‌గా మారాలి... నానో కవి సరే.. జ్ఞానోకవిగా నిలవాలని! అదీ నా ఆశంస!.

## కవిత

# "గొంతెత్తొద్దూ"



- సి.హెచ్. వి. బృందావనరావు

మొన్న ఎలా వుందో
నిన్నా అలానే వుంది
నిన్న ఎలా వుందో
నేడూ అలానే వుంది
నిన్నా నేటికన్నా
రేపు భిన్నంగా వుంటుందనే
ఆశ మాత్రం ఎక్కడా
కనపడ్డమే లేదు
అంతా ఒకే రకంగా –
ఎప్పట్లాగే ఒకే రకంగా, ఒకే రకంగా
మైళ్ళు మైళ్ళు గడచిపోతున్నాయి
ఏళ్ళు ఏళ్ళు నడిచిపోతున్నాయి
బ్రతుకంతా ఓ ఎడారి పయనమైపోయి
కలల ఎండమావులను
చూసి భ్రమించుకుంటూ
ఆశల ఒయాసిస్సుల కోసం శ్రమించుకుంటూ
ఒక్క మబ్బు మెరుపు కోసం
ఒక్క వాన చినుకు కోసం
ఎదురు చూపులతోనే వున్నాం కాని
ఒక చల్లని చెట్టు నీడల వింజామరల క్రింద
సాగిలపడి సేద దీరి ఎంత కాలమైంది
ఒక్క వాన వింటి వన్నెల చిన్నెల్తో
బతుక్కు రంగులద్దుకొని ఎంత కాలమైంది
విరగ్గాసిన నక్షత్రాల మల్లెపూల
నీలి నీలి నింగి పందిరికింద
వెన్నెల ధారల్లో వానా వల్లప్పలౌతూ
పరిమళాల పరభృతాలమై పోయి
పరవశించి పాడుకొని ఎంత కాలమైంది
నిత్య పచ్చిగా సెలవేస్తూ పోయే
సెప్టిక్ గాయాలవుతున్నాయి రోజులు
ఏ థర్మా మీటరూ చూపించలేని
ఉష్ణోగ్రత లౌతున్నాయి మనసులు
ఏ రెక్టర్‌స్కేలూ రికార్డు చెయ్యలేని
భూకంపాలవుతున్నాయి రుతువులు
ఆకలీ ఏడుపూ దారిద్ర్యాల
సాలెగూళ్ళయి పోతున్నాయి బ్రతుకులు
భయం లేకుండా గొంతెత్తి
రాగాల తీగలుగా సాగి ఎంత కాలమైంది
నిత్య సంగ్రామాలుగా మారిన జీవితాల్లో
నిమిషం పాటు విశ్రాంతి దుప్పటి కప్పుకొని
ఎంత కాలమైంది
అలుక్కుపోయిన పాత బ్లాక్ అండ్
వైట్ చిత్రంలాగా
నీరసంగా మారిపోయాయి బ్రతుకులు
మొన్నటి లాగానే – నిన్నటి లాగానే
అంతా ఎప్పటిలాగానే, ఒకే రకంగా
ఒకే రకంగా –
ఇప్పటికైనా విదిలించుకొని
గొణగటం మాని గొంతెత్తొద్దూ

---



# "ఎస్" ఆకారపు రహదారి

- వి. వెంకట్రావు

దూరంగా "ఎస్" ఆకారపు రహదారి
ఆ చివరకు చేరుకుంటే చాలు గమ్యం చేరుకున్నట్లే
పరుగు... ఒకటే పరుగు
కాళ్ళుపీకీ, ఒళ్ళుతూలి,
దబ్బున కింద పడిపోతానేమోనన్న భయం
పరిగెత్తుతూనే, వెనుతిరిగి చూసాను.
ఆ నలుగురూ,
తన శత్రువులు, కత్తులూ, గొడ్డళ్ళూ, కొడవళ్ళూ,
చేతుల్లో, కాళ్లో, పీకో దేనికది వేరుపడిపోతాయి.
ఏంచేసుకుంటారు నా అవయవాల్ని
ఫరవాలేదు, కాదేది అమ్మకాని కనర్హం
అమ్మో ! అదేమిటి నా భార్యా, పిల్లలూ వాళ్లతో కలసిపోయారు
వాళ్ళూ నన్నే తరుముతున్నారు
నాకుటుంబం.. అంతా ఓ భ్రమ
దూరం... దారి ప్రక్కన చప్టా మీద ఓ మనిషి
నారింజ వర్ణపు సాయంత్రాన్ని ఆస్వాదిస్తూ
కాసేపు అతని ప్రక్కనే కూర్చుని ప్రకృతి సోయగాన్ని
కాస్తంత జుర్రుకుందామా?
అబ్బే! వీల్లేదు, కాసేపు నిలబడితే దగ్గరకి రారూ
అయినా ఎంత దూరం అని
గమ్యం ఎంతో దూరంలో లేదు... ఆ మెరక ఎక్కితే చాలు
ఇక వాళ్ళునన్నేమీ చేయలేరు.
మరి కొంచెం శక్తి.. శరీరంలో నిల్వ ఉన్న గ్లూకోజ్
చివరికంటా తెచ్చుకోవాలి
ఈవెనింగ్ వాక్ చేసే మనిషి విషేస్ గాల్లో ప్రయాణించి,
చెళ్ళున చెంపకు తగిలింది
పరుగో.... పరుగు ఇక ఎంత దూరం
మరికొన్ని క్షణాల్లో రహదారి పూర్తి
వచ్చేసా... వచ్చేసా.. గమ్యాన్ని చేరుకున్నా
వాళ్ల బూట్ల శబ్దం, కర్కశంగా చెవులను తాకుతోంది...
మెరక ఎక్కానో లేదో...
ఎదురుగా మళ్ళీ భూతంలా...
"ఎస్" ఆకారపు రహదారి.

కథ

## అనువాద కథ

# పోస్ట్ మోడరన్




**అస్సామీ మూలం : హరే క్రిష్ణదేకా ఐ.పి.ఎస్.**

**అనువాదం : సి.హెచ్. శ్రీనివాసమూర్తి**


***ఆ**టో రిక్షాలు రెండు. మేము ముగ్గురం. జియోగ్రాఫర్, సైలెన్సర్, నేను – అంటే పొయెట్‌ను. కవిని నిజానికి మేము ముగ్గురం ఒకే ఆటోలో ప్రయాణం చేయవచ్చు. కాని జియోగ్రాఫర్ మాకు సీనియర్. వయసురీత్యా సీనియరో కాదో తెలియదుగానీ, మేము మాత్రం అతణ్ణి సీనియర్‌గానే చూస్తాం. మాకు లీడర్ లాంటి వాడు. అందుకని అతనొక్కడే మరో ఆటోలో రావటం న్యాయం. కాని రెండు ఆటోలకయే ఖర్చు మాత్రం మా ముగ్గురూ సమానంగా భరించాలని ముందే నిర్ణయించుకున్నాం.*

మా చేతుల్లో ఒక్కొక్క సూట్‌కేసుంది. వేసవికాలం. ఉన్ని కోట్లు గానీ, దుప్పట్లు గానీ అవసరం లేదు. గాలి తలగడలను సూట్‌కేసుల్లో సర్దేసుకున్నాం. కేవలం నాలుగు రోజుల కోసం మాకు పెద్దగా బట్టలు అవసరం లేదు. ఆటోలు స్టేషన్‌లో ఆగి ఆగకముందే, జియోగ్రాఫర్ రిజర్వేషన్ చార్ట్ చూడటానికి లోపలికి వెళ్ళాడు. అందుకని మేమిద్దరం – అంటే నేనూ సైలెన్సర్ – ఆటోలకు డబ్బులిచ్చేశాం. జూనియర్స్‌గా యిది మాకు తప్పదనుకున్నాం. ఆటోలు వెళ్ళిపోయిన తర్వాత జియోగ్రాఫర్ మా దగ్గరకు వచ్చి, హడావుడిగా పర్సుతీసి, మా ముఖాల వంక ఓమారు చూసి "ఓహ్ మీరుయిచ్చేశారన్నమాట. సరేలే. మన రిజర్వేషన్లు కన్‌ఫర్మ్ అయినాయి. పోదాంపదండి. ఏడో నెంబర్ ప్లాట్‌ఫామ్" అన్నాడు. అంటే మా రైలు ఏడో నెంబర్ ప్లాట్ ఫాం మీదికి వస్తుందన్న మాట.

త్వరత్వరగా రాయటం మూలాన, అసలు చెప్పాల్సిన ముఖ్య విషయాలను చెప్పకుండా వదిలేస్తున్నాను. గమనించారా?

ఈ రైలు ప్రయాణానికి మేము ముగ్గురం, ఒక ప్రత్యేకమైన, ప్రశంసనీయమైన కారణం వల్ల బయలుదేరాం. అస్సామీ సాహిత్యం సాంవత్సరిక సమ్మేళనంలో పాలుపంచుకోవడానికి బయలుదేరాం. సైలెన్సర్‌కు ఒక్కటే బాధ. అది సరైన తిండి. అతనికి తిండి ధ్యాసమెందు. అక్కడ తగిన తిండి దొరుకుతుందో లేదోనని తెగ బెంగపడిపోతున్నాడు. సమ్మేళనానికి వంట వాళ్ళను మేమున్న ప్రాంతం నుంచే తీసుకుపోతున్నారని చెప్పిన మీదట సంబరపడిపోయాడు. మేము కూడా సంబరంగానే వున్నాం. కాని కారణం వేరు. చాలా కాలం తర్వాత మా శ్రమ ఫలించి, మా సాహిత్యశాఖకు గుర్తింపు లభించింది. సాహిత్య అకాడమీ, మా శాఖ తరపున ప్రతినిధులుగా మా ముగ్గుర్ని ఆహ్వానించారు. అందుకే మా ప్రయాణం. యిలాంటి సమ్మేళనాల్లో పాల్గొనటం మాకిదే ప్రథమం. జియోగ్రాఫర్ మాత్రం యింతకు ముందొక మారు పాల్గొన్నాడు. వేరొక శాఖ తరపున అతను చాలా తెలివైనవాడు.

మా సాహిత్యశాఖను ప్రగతి సాహిత్య సంఘంగా మొదట నామకరణం చేశాం. చాలా సంవత్సరాలుగా మా సంఘాన్ని కేంద్ర సంస్థతో అనుసంధానం చేయాలని ప్రయత్నించాం కానీ సాధ్యం కాలేదు. జియోగ్రాఫర్‌కు అనుమానమొచ్చింది. అతనే మా సంస్థ పేరు "సురభి సాహిత్య సంఘం" గా మార్చాడు. దాని క్రింద చిన్న అక్షరాలతో "ప్రాంతీయ సాహిత్యాభివృద్ధికి పాటుపడే ఏకైక సాహితి సుగంధ

సుమవనం" అని రాపించాడు. అంతే... మేము పేరు మార్చి పంపించామో లేదో మా సంస్థను కేంద్ర సంఘం గుర్తించింది. నిజానికీ విషయంలో జియోగ్రాఫర్ తనదైన పద్ధతిలో తాను చేయాల్సిందంతా చేశాడు. యింకోలా చెప్పాలంటే యిదంతా ఆయన సాధించిన విజయమనే చెప్పాలి. పేరు మారినా ఫలితం దక్కింది గదా అని మేము పొంగిపోయాం.

జియోగ్రాఫర్ – సైలెన్సర్ – పొయెట్ "ఏం పేర్లివి? అసలు పేర్లుంటాయి గదా, ఈ వింత పేర్లేమిటి?" అని మీరనొచ్చు. అవును. అసలు పేర్లున్నాయి. కాని ఆ పేర్లు మాకెందుకూ పనికి రావు. కానీ ఈ మూడు పేర్ల చుట్టూ ఒక వెలుగు ఆవరించి వుంటుంది. నీకు తెలుసుకోవాలని వుందా ఈ పేర్లు ఎలా వచ్చాయో అసలు పేర్ల నేపథ్యం చెప్పకుండా కథ నడపటం అనుచితం కదూ! ఓకే. ఈ పేర్ల వెనుక ఉన్న మిస్టరీని చెప్పక తప్పదు.

మేము ముగ్గురం చదువుకున్న వాళ్ళమే. మేధావులమే. అంటే మేమంతా అసామాన్య ప్రజ్ఞాధురీణులమని కాదు. మేము స్కూలు టీచర్లం. ఒకే స్కూల్లో పిల్లలకు, పాఠాలు చెప్తుంటాము. కానీ మేమంతా వేర్వేరు ప్రాంతం నుంచి వచ్చాం. ఉద్యోగరీత్యా ఒకే ప్రాంతంలో సెటిలైనాం. ఒకరినొకరు గౌరవించుకుంటాం. అభిప్రాయాలకు విలువనిస్తాం. ఒకరకంగా మేము పరస్పర భక్తులం. మతపరంగా కాదు. ఇతర విషయాల్లో. జియోగ్రాఫర్ గారు మా స్కూల్లో జాగ్రఫీ టీచర్గా వచ్చి చేరారు. ఆ సబ్జెక్ట్ అంటే ఆయనకు అమిత అయిష్టమట. అదృష్టవశాత్తు మేనేజ్‌మెంటు వారు అది అనవసరమని భావించి ఎత్తేశారు. ఆయనకు ఆ జాగ్రఫీ పీడ విరగడై ప్రస్తుతం యింగ్లీషు బోధిస్తున్నారు. ఈ విధంగా ఆయనలో క్రమంగా సాహిత్యం పట్ల కుతూహలం పెరుగుతూపోయింది. అలా జరగకుంటే మా బతుకులకు కొంతైనా సార్థకత దక్కేది కాదు. అంటే అస్సామీ సాహిత్య సంఘం సభ్యులమయ్యేవాళ్ళంకాము అని అర్థం. నేను అప్పుడప్పుడూ ఈ విషయం తల్చుకుంటే మేను పులకరింతకు లోనయ్యేది. (ఎవరికో ఈ మాట దయనీయంగా అనిపించిందనుకుంటాను. అతనికి నా సమాధానం – మీ ఆజ్ఞ అభిప్రాయం మాకు అనవసరం).



జియోగ్రాఫర్‌కు ఆ పేరు మా స్కూల్ నౌకరు యిచ్చాడు. అతని పేరు భూపేన్. (భూపేంద్ర అనిపిలిస్తే అతనికి వల్లమాలిన కోపం వస్తుంది) అతను, చాలా గౌరవంగా "జాగ్రఫీ సార్" అనిపిలిచేవాడు. మేము మా కొలీగ్స్‌ని 'సర్' అనే బిరుదు తగిలించి పిలవం గదా సర్‌లను వదిలేశాం. భూపేన్ చాలా తెలివిగలవాడు. స్కూల్ బెల్ కొట్టడం లాంటి కష్టమైన పనులు చేసే సమయంలో కూడా భూపేన్ తన అరిచేతులతో పొగాకును నైపుణ్యంగా నలిపి జియోగ్రాఫర్‌కు అందించేవాడు పాపం. జియోగ్రాఫర్ తన పొగాకును తను నల్చుకోలేడు. క్లాసు ముగిసిన తరువాత మరో క్లాసుకుపోయే ముందు "జాగ్రఫీ సార్" అంటూ భూపేన్ పొగాకు అందించేవాడు. అందరూ చూస్తూండగానే. అయినా ఎవరూ గమనించనట్లు హాయిగా నిర్లజ్జగా అందుకునేవాడు. తీసుకుని నాలుక క్రింద పొందికగా దోపుకునేవాడు. దురదృష్టవశాత్తు ఈ దృశ్యం యిప్పుడు కనిపించటం లేదు. ఎందుకంటే జియోగ్రాఫర్‌కు ప్రమోషనొచ్చి, నమిలే పొగాకు స్థానంలో సిగరెట్ అమిరింది. కారణం ఎవరికీ తెలియదు. బహుశా ఈ విపత్తుకు కారణం సురభి సాహిత్య పరిషత్తు' ఏర్పడటం వల్లనేననుకుంటాం. అంటే కేంద్ర సంఘంతో గుర్తింపు వచ్చిన నాటి నుంచి విపత్తు అని ఎందుకంటున్నానంటే, సిగిరెట్ దమ్ములాగుతుంటే జియోగ్రాఫర్ గారి ముఖ గోళంలో వచ్చే భయంకరమైన కవళికలను, ఏకాగ్రతను చూసి తీరాల్సిందే. ఏకాగ్రత కూడా భయంకరంగా వుంటుంది అని అనుమానమా? ఎందుకుండదు, ఉంటుంది. నేను ఆ దృశ్యాన్ని చూస్తున్నప్పుడు నా ముఖ కండరాల్లో ఏదో అనుకోని కదలిక మొదలై చిరునవ్వు లాంటి దొకటి పెదవుల మీద మెరిసేది. కాని నేనూ సైలెన్సర్ అతనికి శిష్యులం. నవ్వటం తప్పుగదా. అందుకని బలవంతంగా నవ్వును ఆపుకునేవాళ్ళం.

మీరు ఊహించింది రైటే. సైలెన్సర్ పేరు కూడా భూపేన్ సారవంతమైన మెదడు నుండి పుట్టిందే. యిది అద్భుతమైన సృష్టి. సైలెన్సర్‌ను గురించి ఒక్క మాటలో చెప్పమని ఎవరైనా అడిగితే ఠక్కున వచ్చే పదం "సైలెన్స్" అది అతని ప్రధాన గుణం అనండి, అతని ధర్మం అనండి, మరేదైనా అనండి. అన్నింటికి తల ఊపటం, మౌనంగా అన్నీ ఒప్పేసుకోవటం అతని అలవాటు. యితర అలవాట్లు, గుణగణాలు లేవని కాదు. అవి కేవలం రెండో తరగతికి చెందినవే. వాటికంత ప్రాముఖ్యం లేదనే అనాలి. అంతగా చర్చించాల్సినవి కూడా కావు. సైలెన్సర్ ఎవరినైనా తన గురువుగా స్వీకరించాడంటే, ఆయన మాట్లాడిన ప్రతి మాటకూ గంగిరెద్దులా తలవూపుతూనే వుంటాడు. ప్రస్తుతం అతను జియోగ్రాఫర్ శిష్యుడు. ఆయన ఏం మాట్లాడినా అవునన్నట్లు తల వూపుతాడు. భూపేన్ దృష్టిలో సైలెన్స్, సైలెన్సర్ రెండూ పర్యాయపదాలు. ఏది ఏమైనా సైలెన్సర్ అనేపేరు, ఏదో సూచిస్తున్నట్లు అందంగా పొందికగా అమరిపోయింది.

ఇంక పొయెట్. అంటే నేను నాకీ పేరు భూపేన్ యివ్వాల్సిన అవసరం లేదు. నాకై నేనే కవిగా చలామణి అవటం మొదలు పెట్టాను. నేను రాసిన కవిత్వం వల్లనే నాకీ బిరుదొచ్చింది. జియోగ్రాఫర్ కూడా నన్ను కవిగా పిలుస్తుంటే, నా కవితావర్షంలో తడిసి ముద్దయినా నాను. నేను కవిగా ఏం సాధించానో కొలత చేయటానికి సాహితీ వ్యాపారులు ఎలా లెక్కలేస్తారో నా కనవసరం. నాకు జియోగ్రాఫర్ యిచ్చిన గుర్తింపు చాలు కవిననటానికి అదే నా క్వాలిఫికేషన్.

సాహిత్య వ్యాపారుల్లో, సాహిత్యం, సాహిత్య విమర్శ అనే రెండు అంశాలున్నాయనేది అందరూ అంగీకరించిన సత్యం. లీగల్ భాషలో చెప్పాలంటే వీటిని కాగ్నిజబుల్.. నాన్ కాగ్నిజబుల్గా చెప్పొచ్చు.

తేలిక మాటల్లో చెప్పాలంటే... గుర్తింపు పొందిన, గుర్తింపు పొందని కవుల తెగలన్న మాట. ఎవరి పాదపద్మాల అండకోసం

తపిస్తారో వాళ్ళు గుర్తింపు పొందిన వారుగా పరిగణింపు పొందుతారు. ఆ కోవలోకి వచ్చే రకంలో, వారి వారి స్నేహితులు, బంధువర్గం, ఆ ప్రాపు కోసం పాకులాడేవాళ్ళు వస్తారు. గుర్తింపు పొందనివారిని గురించి అట్టే ఆలోచించాల్సిన పనిలేదు. కాని జియోగ్రాఫర్ సాహిత్య వ్యాపారి కాదు. అతను పాక్షిక మేధావి. అందుకనే అతని గుర్తింపు నాకు వరంలా భావించాను. నా కవితలను అతను పరిగణనలోకి తీసుకున్నాడు.

జియోగ్రాఫర్ నా కవితలను విమర్శనా దృష్టిలో విశ్లేషించేవాడు. అవును, మరిచే పోయాను. నేను స్కూల్ టీచర్ని. స్కూల్లో పాఠాలు చెప్పటానికి నేను మొదట జాయిన్ అవ్వలేదు. మొదట క్లర్క్‌గా చేరాను. కొన్నాళ్ళ తర్వాత పి.టి. మాష్టారు వెళ్ళిపోయిన తర్వాత ఆ స్థానాన్ని ఆక్రమించాను. బహుశా డ్రిల్ చేయిస్తున్నప్పుడు వాయించే లయబద్ధమైన బ్యాండు ధ్వని వల్ల నా బుర్రలో ఈ కవిత్వపుటాలోచన వచ్చినట్లుంది. కాకపోతే ఒక పి.టి. మాష్టారుకు ఈ అలవాటు ఎలా సంక్రమిస్తుంది. తన స్కూల్లోనే ఒక కవి ఉన్నాడనే విషయం భూపేన్‌కు తెలియనే తెలియదు. అతను నన్ను డి.ఆర్. సార్ అని పిలిచేవాడు. డ్రిల్ సార్‌కు బదులుగా డిఅర్ అనేపదం, గిరిల్ లాగా పొయెటెక్‌గా ఉన్నట్లుంది. అయినా నా పేరు నాకు నచ్చలేదు. నన్ను నేను కవిత్వ సృష్టికర్తగా ముద్ర వేయించుకోవటంలోనే ఆనంద ముందనిపించింది. అందుకనే జియోగ్రాఫర్ యిచ్చిన 'పొయెట్"నే నా పేరుగా భావించాను. అదే నాకు ముద్దు.



మా నామధేయాల విశిష్టత విషయం ప్రస్తుతం పక్కన పెట్టేద్దాం. ఈ పేర్లలో ఏదో రహస్యంగానీ, నిగూఢార్ధవెూ వుంటాయనుకున్న వారు నిరుత్సాహపడక తప్పదు. కాని ఈ సందర్భంగా నా కవిత్వం గురించి చెప్పకపోవటం మంచిది గాదు. అందులో ఫ్రెండ్‌గా, ఫిలాసఫర్‌గా గైడ్‌గా జియోగ్రాఫర్ పాత్రేమిటో మీకు అర్థమవుతుంది. ఇక సైలెన్సర్ అభిప్రాయాలా? అవి జియోగ్రాఫర్ గారి భావాలకు కార్బన్ కాపీలే గదా! కాబట్టి అతని అభిప్రాయాలను నాన్ కాగ్నిజబుల్‌గా పరిగణించవచ్చు. నేను నా మొదటి కవితను జియోగ్రాఫర్‌కు చూపించినప్పుడు ఆయన నన్ను కొద్దిగా పొగిడాడు. "నీవు మంచి రొమాంటిక్ పొయెట్రీ రాశావోయ్" అని భుజం తట్టాడు. ఈ రొమాంటిక్ అనే పదం యిది వరకు విన్నాను గానీ, కవిత్వ భాషలో నాకు దాని అర్థం తెలియదు. ఎలాంటి కవిత్వాన్ని రొమాంటిక్ అంటారో అస్సలు తెలియదు. ఆయన, నేను చూసి ఆనందపడి రాసిన కవితను రొమాంటిక్ అంటారని చెప్పిన తర్వాత కొంత అర్థమయింది.

నేను ముందే మనవి చేసుకున్నాను, నేను పి.టి. మాష్టారుగా వుండే సమయంలోనే కవిత్వం ప్రారంభించానని, కాని యిప్పుడాలోచిస్తే నా కవిత్వ కుండలినీ శక్తికీ మరేదో కారణముందనిపించింది. ఆ సమయంలోనే మా స్కూల్లో పనిచేయటానికి లీవు వేకెన్సీలో ఒక అందమైన అమ్మాయి చేరింది. ఆ అమ్మాయి టీచర్స్ రెస్ట్ రూంలోకి అడుగు పెట్టిందంటే చాలు మగ పంతుళ్లు ఈగలు ముసిరినట్లు ఆమె చుట్టూ చేరేవారు. ఈ కవిగారు కూడా (అప్పటికింకా నేను కవి కాలేదు) అందుకు మినహాయింపు కాదు. ఎందుకు ఎలా జరిగిందో తెలియదుగానీ. ఒక రోజు నేను ఆమె పూరెమ్మల కోమలత్వం అందుకున్న అందమైన ముఖారవిందాన్ని చూస్తుంటే, అకస్మాత్తుగా నా గుండెల్లో పరవళ్ళు తొక్కుతున్న సౌందర్యానంద ప్రవాహం పెల్లుబికినట్లయింది. అదే రోజు రాత్రి ఒక కవి జన్మించాడు. అతని కలం నుండి ఈ ఫంక్తులు జాలువారాయి.

వెన్నలా మృదువైన నీ ముఖారవిందము చూసి
నా గుండె చప్పుడు లయ తప్పి తటతట లాడింది.

నా కవిత్వం విన్న జియోగ్రాఫర్ అందమైన అద్భుతమైన కవిత్వం రాశానని తెగ మెచ్చుకున్నాడు.

మూడు నెలల తర్వాత నా కవితాశక్తి, (అంటే సెలవులలో చేరిన అమ్మాయి వెళ్ళిపోయినా, నా కవితా ప్రవాహం మాత్రం ఆగలేదు. గంగోత్రి నుండి తుళ్ళుతూ మొదలైన గంగానది తన నిరంతర ప్రయాణం తరువాత బంగాళాఖాతంలో కలిసినట్లు, నా కవితా గంగా ప్రవాహం ఉరుకులు, పరుగులతో అస్సామి సాహిత్య సముద్రంలో కలిసింది. అది కేవలం ఆరంభం మాత్రమే. 'ప్రభావన్' అనే ప్రముఖ అస్సామీపత్రిక మా రోజుల్లో వెలువడుతూ ఉండేది. నా కవితలు అందులో ప్రచురితమైనప్పుడు నేను ఉబ్బితబ్బిబ్బయ్యాను. ఆ పత్రిక అస్సామీ భాషలో చాలా ప్రముఖమైంది. కాని అది తన తుదిశ్వాస పీల్చినప్పుడు నేను ఏ సాయం చేయగలనో పాలుపోలేదు. అంతలోనే "కామధేను" అని మరో కొత్త పత్రిక కొచ్చిందని తెలిసి నా కవితలు పంపిస్తే అవి ప్రేమతో పెంపుడు పావురాల్లా నా దగ్గరకే తిరిగొచ్చాయి. అయినా మళ్ళా కొన్ని పంపించాను. ఈసారి అవి తిరిగి రాలేదు. ఏమైనాయే కూడా తెలియరాలేదు. చాలా నిరుత్సాహం కలిగింది. నాలో కవి క్రమంగా అస్తమించేలా ఉన్నాడు.

ఇటువంటి ఆపద సమయంలో, కృశించిన కవి హృదయానికి సంజీవిని అందించాడు. ఒకరోజు అతను "చూడు కవి మిత్రమా! ఈ మధ్య చాలా కాలం నుండి నీ కవిత్వం పత్రికల్లో రావటం లేదు. ఏమయింది?" అని అడిగాడు.

నేను కవిత్వం రాయకకాదు. వేసుకునే నాథుడు లేక ప్రభావన్ మాయమైంది. కొత్త పత్రికలలో నా కవితలు మాయమవుతున్నాయి. ఏం చేయాలీ కవితలను? వింటానంటే యివిగో... నా కవితలు" అంటూ ఒకటి అందించాను. ఎందుకైనా మంచిదని నా కవితలను జేబులోనే పెట్టుకు తిరగటం అలవాటు చేసుకున్నాను. కవిత చదివిన తర్వాత అతను అన్నమాటలు నివ్వెరపరిచాయి.

'మైడియర్ కవిగారూ! ఇలాగా. చంద్రుడు, వెన్నెల, మలయమారుతము, సూర్యకిరణాలు, ప్రకృతి పువ్వులు, సువాసనల కాలం చెల్లిపోయింది. ఈ విషయం నీకు అర్థం చేసుకోవాల్సిన అవసరముంది. అంతటా ఆధునికత విస్తరిస్తున్న ఈ సమయంలో యింకా నీవు నీ ఊహా ప్రపంచంలో తెలిమబ్బులలో తేలియాడుతుంటే

ఎవరు హర్షిస్తారు? కవితా ప్రపంచంలో చాలా చాలా మార్పులు జరిగాయి" అన్నాడు. నాకు అర్థం కాలేదు.

జియోగ్రాఫర్‌గారు సాహిత్య గురువుగా మారిన దగ్గర్నుంచి సాహిత్య రంగంలోని తీరు తెన్నులను అధ్యయనం చేస్తూ వున్నాడు. అందులో అతనికి సాధికారత వుంది. ఆయన ఆ మాటలన్న తర్వాత, నా కవిత్వంలో ఎక్కడో ఏదో లోపముందని నాకు అర్థమయింది.

నిజంగా చంద్రుడు, ప్రకృతి, మలయమారుతాలకి మనుషులతో సంబంధం తెగిపోయిందా? యింకా అవి అలానే ఉన్నాయి కదా? నేను ఆశ్చర్యపోయాను. జియోగ్రాఫర్ గారు నా సందిగ్ధావస్థను గమనించినట్లున్నాడు.

"నీవు యిప్పుడిచ్చిన కవిత్వంలో చంద్రుడు మబ్బుల మాటు నుండి చల్లని కిరణాలను ప్రసరిస్తుంటే, నీ కవి ప్రేయసి చిరునవ్వుల్లా భాసించాయి. బాగానే ఉంది. కానీ మైడియర్ ఫ్రెండ్. నీ కాళ్ళు నేల మీద ఉండాలి. ఆలోచిస్తే చంద్రుడి ఉపమానాన్ని మరోలా కూడా ఉపయోగించవచ్చు. ఉదాహరణకు ఆకలేస్తున్న వ్యక్తికి అదే మచ్చల చంద్రుడు. కాల్చిన రొట్టెలా కన్పించొచ్చు. ఈ రకంగా ఆధునిక కవులు, చంద్రుణ్ణి, ప్రకృతిని వేరే దృష్టితో చూస్తారు. యిది ఆధునిక కవిత్వ దృష్టి. నీ కవిత్వం ఆధునికతను సంతరించుకోవాలంటే, నిజంగా ఆధునిక భావజాలాన్ని ఉపయోగించి రాయాల్సి ఉంటుంది. జీవితం రాను రాను సంక్లిష్టమవుతోంది. ఆధునిక కవికి ఈ ఆధునిక భావాలు కూడా సంక్లిష్టంగానే తోస్తాయి. అందుకే వాటి ప్రకటన కూడా సంక్లిష్టంగానే ఉంటుంది. నీవు ఆక్రోటు తిన్నావు గదా. దానిపై టెంకె చాలా మందంగా వుంటుంది. దాన్ని పగలగొడితే లోపలున్న పప్పు చాలా రుచికరంగా వుంటుంది. ఆధునిక కవిత్వం కూడా అంతే. ఆక్రోటులాంటిదే. పైకి చూడటానికి ఎండినట్లుంటుంది. రుచి మాత్రం బావుంటుంది. నీలో ప్రేరణ కలిగినప్పుడు, నీ హృదయం ద్రవించినప్పుడు, నీలో కవిత్వధారం నీటిబుగ్గలా ఊటలూరుతుంది. కాని ఆధునిక కవులకు దాంతో పనిలేదు" అంటూ ఆధునిక కవిత్వం మీద ఒక చిన్న పాటి లెక్చరిచ్చి, దాని మీద ఓ పుస్తకాన్ని కూడా యిచ్చాడు. ఆయన సలహా ప్రకారం ఆ పుస్తకాన్ని చదివి అర్థం చేసుకుని ఆధునిక కవిగా రూపాంతరం చెందటానికి నాకు ఎక్కువ కాలం పట్టలేదు. కానీ 'కామధేను' పత్రిక నా కవితలను తిప్పి పంపింది. అది పెద్దగా పట్టించుకోవాల్సిన విషయం కాదు. నాకులాగే చాలామంది కవి మిత్రుల కవితలు తిరిగొచ్చాయి. మేమందరం కలిసి ఒక చిన్న పత్రికను నడపటం ప్రారంభించాం. జియోగ్రాఫర్ మాకు సలహాదారు. అతనితో పాటే సైలెన్సర్ కూడా చేరాడు. జియోగ్రాఫర్ మెచ్చుకుని బాగుందంటే, వందమంది విమర్శకుల మెప్పుకోలు పొందినట్లే. 'ఆయన మారుపేరుతో' నా కవిత్వం మీద పూలజల్లు కురిపిస్తూ సమీక్షలు కూడా రాశాడు. ఆ తర్వాతనే ప్రగతి సాహిత్య సంఘం ఏర్పడింది. కాని మా సంఘ అభివృద్ధి కుంటుపడటంతో, దానిని సురభి సాహిత్య సంఘంగా



మార్చాల్సి వచ్చింది. గుర్తింపు కూడా వచ్చింది. ఆ కారణంగానే మేము ముగ్గురం రైల్వేస్టేషన్‌కు బయలుదేరాం. అస్సాం సాహిత్య సమ్మేళనంలో పాలు పంచుకోవటానికి.

జియోగ్రాఫర్, సైలెన్సర్లు చాలా ఉత్సాహంతో వూగిపోతున్నారు. ఆనందానికైతే అవధులే లేవు, కవిని గాబట్టి, నా కవిత్వం విన్న వేలమంది సభికుల కరతాళ ధ్వనులతో హాలు మార్మోగుతుందేమో! కాని ఎందుకో నా ఉత్సాహం పాలు కాస్త తగ్గినట్లు నాకే అనిపిస్తుంది.

ఆహ్వానం అందిన ఆనందంలో ఓ నలభై కవితలు రాసి జియోగ్రాఫర్ గారికిచ్చాను. అతనికి నచ్చిన కవితలను సెలెక్ట్ చేయమని, సాహిత్య సమ్మేళనంలో చదవాలి గదా, కాని నిన్న నా కవితలను తిరిగిచ్చేస్తూ, తన అభిప్రాయాన్ని మెల్లగా జార విడిచాడు.

చూడు కవిమిత్రమా! యింకా నీవు ఆధునిక కవితా మేడల్లోనే విహరిస్తున్నావు. ప్రస్తుతం దానికి చెల్లింది. నీవు ఆ మేడల్లోంచి దిగి రావాలి. ముక్కు మూసుకుంటూ యింకా ఆ పాతపాటలనే పాడుతున్నావు. పగిలిన పెంకులను ఏరి వాటిని క్రమపద్ధతిలో అమర్చటానికి ప్రయత్నిస్తున్నావు. ఇది వరకు అలా చేశామంటే ఫర్వాలేదు. అది అందరి అంగీకారం పొందింది. కానీ యిప్పుడీ కాలం పోస్ట్ మోడరన్‌ది. అంటే ఆధునికాంతరవాదంది" అన్నాడు.

అది విని నేను నివ్వెరపోయాను. దానికి తోడు సపోర్టుగా సైలెన్సర్ గంగిరెద్దులా తల ఊపటం. ఇదివరలో జియోగ్రాఫర్ గారు మెచ్చుకున్న కవితలనే నేను ఏరి అందించాను. నిన్నటి అభిప్రాయం నేడు మారింది. మారుతున్న సాహితీవాదాలు, విలువలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండటం ఆయనకు అలవాటు. అందుకని అటువంటి సీనియర్ అభిప్రాయాలకు విలువ వుంటుంది. కాని ఎవరో చెప్పారని రాత్రికి రాత్రే, పోస్ట్ మోడరన్ కవిత్వం వొంటికి రాసుకోవటం ఎలా సాధ్యం. అసలా కవిత్వమంటే ఏమిటో నాకు విడమరిచి చెప్తే గదా? నిన్నంతా ఆయన చాలా బిజీగా గడిపాడు. అతని ముఖభూగోళం సీరియస్‌గా వుంది. పోస్ట్‌మోడర్నిజం అనే పోస్టాఫీసు తలుపులు మూసుకుని కూర్చున్నాడు. నా జేబులోని కవిత్వం నాకు బరువుగా వ్యర్థంగా తోచింది. రైల్వేస్టేషన్‌లో కూడా నేను ఈ అయోమయస్థితిలోనే ఉండిపోయాను.

ఏడో నెంబరు ప్లాట్‌ఫాం మీద కాళ్లుంచగానే మేము ఎక్కవలసిన రైలు రెండు గంటలు లేటని అనౌన్స్‌మెంటు వినపడింది. జియోగ్రాఫర్ నొసలు విసుగుతో ముడివడింది. సైలెన్సర్ కూడా విసుగును అనుకరించాడు. నా మెదడంతా ఆధునికాంతరవాదం ఆక్రమించినందువల్ల ఈ అనౌన్స్‌మెంటు ప్రభావం కలగలేదు. తూర్పువైపు చివరగా ఖాళీగా వున్న బెంచి కేసి చూపిస్తూ "పదండి. మనం అక్కడ కూర్చుందాం." అన్నాడు జియోగ్రాఫర్.సూట్‌కేసులు ప్రక్కనే పెట్టుకుని ముగ్గురం అక్కడ కూర్చున్నాము. లేటును తలుచుకుని

జియో[గ్రాఫర్ గారు దరి[ద్రపు రైళ్ళు'అంటూ మరోమారు అసహనాన్ని [ప్రదర్శించారు.

నాకు అవకాశం దొరికింది. జియో[గ్రాఫర్ గారికి ఎప్పుడు కోపం, వచ్చినా ఎక్కువ సేపు నిలవదు. కర్పూరంలా కరిగిపోతుంది. ఆ సమయాల్లో తనకు యిష్టమైన, పట్టున్న ఏ విషయాన్నైనా అనర్గళంగా మాట్లాడతాడు. యిది నాకు గతంలో బాగా అనుభవమే. ఒక్కోసారి అతన్ని సంతోషపెట్టడానికి పెద్దన్నా' అని పిలవటం కూడా నాకు అలవాటే. ఈ పోస్ట్ మో[డరన్ వ్యవహారమేమిటో తెలుసుకోటానికి యిదే అనువైన సమయమనిపించి అడిగాను.

"బడేభాయ్, నిన్న నన్ను పోస్ట్‌మోడరన్ కవిత్వం రాయమన్నావు. అప్పటి నుండి నా ఆలోచనలన్నీ దాని చుట్టే తిరుగుతున్నాయి, యిదేమిటో తెలియకుండా ఎలా రాయను." మో[డన్ కవిత్వం ఎలా రాయాలో నాకు విడమర్చి చెప్పి నాకిచ్చిన [ప్రోత్సాహం నేనెన్నడూ మరవలేను. నీ సలహా పాటించే, నేను యింత వరకు ఎదిగాను. మో[డన్ కవిత్వం రాసుకుంటూ వచ్చాను. ఇప్పుడీ పోస్ట్ మోడరన్ కవిత్వమేమిటో, ఎలా రాయాలో చెప్తే నాకు చాలా సహాయం చేసిన వాడివవుతావు.'' అన్నాడు [ప్రాధేయ పూర్వకంగా, జియో[గ్రాఫర్ కనుబొమ్మలు కలిసే చోటును గమనిస్తే అతని ఆలోచనలు కూడా తెలుస్తాయి. మేధావితనం ఉట్టిపడుతున్నవైనం [ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. కాంతివంతమైన ఆలోచనా కిరణాలు మిడతగంతుల్లాగా అతని మస్తిష్కంలో దూకుతున్నట్లుంది.



మొఖం సీరియస్‌గా పెట్టె "ఆఁ! యిప్పుడు నీవు పోస్ట్‌మోడరన్ స్థితిలోనే ఉన్నావు. కాని అదేమిటో నీకు అర్థం కావటం లేదు. ఈ రైల్వేస్టేషన్‌ను చూస్తున్నావు కదా! యిదే పోస్ట్‌మోడరనిజం అంటే..." అన్నాడు.

ఈ బరువైన డైలాగులు నన్ను అయోమయంలో పడేశాయి. ఎడ్లబండితో మొదలై నాగరికతా [ప్రభావమూలంగా, వేగంగా [ప్రయాణించే ఈ రైళ్ళు రావటం, అందుకుగాను, రాక పోకలకు నిలయంగా ఈ రైలు స్టేషన్ రావటం ఆధునికతకు [ప్రతీక అని నేను యింతవరకు అనుకుంటూ వచ్చాను. కాని యిక్కడ రణగొణ ధ్వనుల అయోమయం నాకు తెలియదు. చాలాకాలం [క్రితం ఈ అలజడి, అస్తవ్యస్తాలను గురించి ఒక కవితను కూడా రాశాను. అందులో నాకొక లంకె దొరికింది. మానవుల అస్థిత్వంలోని కొన్ని నిమిషాలు, వారి జీవనయానంలోని కొంత సమయాలకు ఈ రైలు స్టేషన్లు ఆధారభూతాలవుతాయి. ఆ కవిత చదివిన జియో[గ్రాఫర్ నన్ను ఆకాశానికి ఎత్తేశాడు. కాని ఇప్పుడు దీనినే ఆధునికాంతర పరిస్థితి అంటున్నాడు. నాకంతా అయోమయంగా వుంది. ఈ మధ్య జియో[గ్రాఫర్ బెంగాలీ, ఇంగ్లీషు పుస్తకాలు ఎక్కువగా చదివాడు. ఆంగ్లం అర్థం చేసుకోవటం కొద్దిగా కష్టం కాబట్టి, ఎక్కువగా బెంగాలీ పుస్తకాలే చదివేవాడు. తత్ఫలితంగా అతని మెదడనే యాంటీనా'లోకి చాలా ఛానల్స్ వచ్చిచేరాయి. ఈ 'యాంటీనా' ద్వారా పోషక పదార్థాలకు అవసరమైన విటమిన్లు లాంటివి సేకరించి, మనో యం[త్రంలో రంగరించి పీల్చి పిప్పిచేసి, సారం బయటికి లాగాడు. ఫైనల్‌గా అవసరమైన మేరకు తన ఒరిజినల్ మా[త్రలుగా ము[ద్రవేసి మాలాంటి వారికందిస్తున్నాడు. ఆయన అందించిన మోడరన్ మా[త్ర మింగి, నేను మో[డన్ కవిత్వం వొంటపట్టించుకున్నాను. ఇప్పుడు పోస్ట్‌మోడరన్ అనే కొత్త మా[త్ర యివ్వటానికి సిద్ధమైనాడు. కాబట్టి నేను కూడా దానిని మింగి నా అజీర్తిని నివారించుకోవటానికి తయారైనాను.

జియో[గ్రాఫర్‌గారు మొదలుపెట్టారు.

"ఇప్పుడు మనం చూస్తున్న ఈ రైలు స్టేషన్‌లో రకరకాల వస్తువులున్నాయి. ఇటు [ప్రక్క పాసిపోయిన అన్నం తాలూకు దుర్గంధం – అక్కడ [వేలాడదీసిన టి.వి.లో బొంబాయి హీరోయిన్‌గారు అర్థనగ్న క్లాసికల్ డాన్స్ – జవాన్లు – ముసుగు లేసుకున్న మార్వాడి వనితలు– ఆ దూరంలో బెంచీమీద [ప్రేమజంట – యివేమీ పట్టకుండా తమదారిన తాము తిరుగుతున్న రైల్వేకూతలు. పోతసాగళ్ళు – రకరకాల భాషలు మాట్లాడుతున్న [ప్రయాణీకులు – యిక్కడున్న [ప్రతి ఒక్కరూ తన తన [ప్రత్యేక [ప్రపంచంలో వున్నారు. తమ [ప్రపంచాలను తమ వెంట తెచ్చుకున్నారు. వారందరికీ [ప్రస్తుత నెలవు ఈ రైల్వేస్టేషనే. అంటే వివిధ రకాల వ్యక్తులు, వివిధ భాషలు మాట్లాడే వ్యక్తులు, వివిధ భావాలకు నిలయమైన వ్యక్తులు, ఒకే సమయంలో ఒకే చోట వున్నారు. ఇది వర్తమాన స్థితి. ఒక కవిగా వీటన్నిటిని వేటికవే [ప్రత్యేకమైనవిగా, ఖండాలుగా తమ [ప్రపంచం తప్ప మరో [ప్రపంచం పట్టని వారులా, నీ మో[డన్ మెదడులో నిలుస్తాయి. వీటన్నిటిని ఏకసూ[త్రం ద్వారా అతికించి, ఒక ఇమేజ్‌ని సృష్టిస్తావు.. యిందులో లోతైన అర్థాన్ని, [ప్రత్యేక భావాన్ని దర్శిస్తావు. కానీ నీవు పోస్ట్ మోడరన్ అయినట్లయితే నీవు చూస్తున్నదంతా విడివిడిగా దేనికదే అన్నట్లు, యధాతథంగా చూస్తావు. [ప్రతి వస్తువు, వ్యక్తి తన వ్యక్తిగతంగా, తన పరిధిలో, తనభావాలకు, చర్యలకు బద్ధలవటం గమనిస్తావు. విభిన్న వ్యక్తులు, ఒకే సమయానికి రైలుస్టేషన్‌కు రావచ్చు. అందువల్ల ఒక గందరగోళం, అలజడి, కన్పిస్తుంది. దీనికంతా ఫుల్‌స్టాప్ పెట్టాలని స్టేషన్ మాస్టర్ అనుకుంటే, అందర్నీ ఒకే రైలులో బలవంతంగా తోసేసి [ప్రశాంతతను, నెలకొల్పవచ్చు. కాని అప్పుడు కూడా సంక్షోభమే మిగుల్తుంది. ఆధునిక కవులు ఈ స్టేషన్‌ను అ[క్రమంగానూ, స్టేషన్ మాష్టరుగారి రైలు, ఈ అ[క్రమాన్ని స[క్రమంలో తెచ్చే పరికరంగా భావిస్తారు. నీ దృష్టిలో స[క్రమంగా వున్నదంతా అందంగా కనిపిస్తుంది. ఈ అ[క్రమానికి నీకు ఎలాంటి సంబంధం వుండదు. మరోలా చెప్పాలంటే ఈ అ[క్రమం గందరగోళం స్థానంలో ఒక [క్రమత, నిశ్చింతత రుద్దాలని [ప్రయత్నిస్తావు. కాని అది అయ్యేపనికాదు. చేతులతో అయేపనికాదు కాబట్టి, నీవు ఆ పనికి కవిత్వాన్ని ఆ[శయిస్తావు. అర్ధరా[త్రి అంతరార్థాలు వెతికి నీవు పెట్టుకున్న స[క్రిమీతా కళ్ళద్దాం గుండా, నీ అభ్యుదయ సౌధంలో, నీవు సృష్టించుకున్న నీ సొంత ఇమేజ్‌లో మమేకమవుతావు."

నాకు ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు. ఆధునికతను అలవరచుకోవటంలో పొరపాటేదైనా చేశానా అనిపించింది. నేను ఆధునికాంతరవాదిగా మారితే అంతా సర్దుకుని సవ్యంగా వుంటుందా? చాలా కాలం క్రితం ఈ జియోగ్రాఫర్‌గారే నాకు ఆధునికవాదాన్ని నూరిపోశారు. యిప్పుడాయనే తన సొంత ఆధునికాంతర వాదాన్ని విడమర్చి చెప్తున్నాడు. అప్పుడు తేలికగానే అర్థమైంది. సులువుగా ఆధునిక కవిని కాగలిగాను. కాని యిప్పడీ వాదం నాకు గందరగోళం, గజిబిజిగా వుంది.

జియోగ్రాఫర్ తన సిద్ధాంతాన్ని యింకా పూర్తి చేయలేదు. మొఖం మీద సీరియస్‌నెస్‌ను యింకాస్త పులుముకుంటూ, తన థియరీని చెప్పటం ప్రారంభించారు.

"ఇప్పుడు మహా కథనాలకు కాలం చెల్లింది" అన్నాడు.

మహా కథనమా? ఇదేమిటి? నా మెదడులో రక్త నాళాలు గడ్డకడతాయేమో! ఆయన చెప్పే మహాకథనం చిందులేసే కుర్రాడిలా మారి నా మెదడులో చిందులేస్తున్నాడా! అంతా గందరగోళం. అయోమయం. ఈ ఆధునికాంతర వాదం నా మెదడులో కుమ్మరి పురుగైంది.



నా మొఖంలోని అయోమయాన్ని గుర్తించినవాడిలా మొఖం పెట్టి ఉదాహరణకు నిన్నే తీసుకో. యిక్కడున్న వివిధ దృశ్యాలలోని ఒక్కొటిగా తీసుకుని, వాటినన్నింటిని ఒక క్రమంలో పూలతో అల్లిన మాలలా గుది గుచ్చాలను కుంటావు. కాని అందుకు ముందుగా ఒక సూది, దారం కావాలి. అప్పుడే మాల తయారవుతుంది. అలాగే ఆధునిక మానవులందరి క్రమబద్ధంగా, ఒకే మాలలా చేయాలంటే, జీవితాలకో అర్థం, పరమార్థం కోసం సిద్ధాంతాలను కనుక్కోవాలి. (అతను చేస్తున్న పని కూడా యిదే గదా!) ఒక మహా కథనాన్ని సృష్టిస్తాడు. అది దారం అనుకో. తద్వారానే మానవులందరినీ ఒకే తాటి మీద తేవటానికి వీలవుతుందని నమ్ముతాడు. నమ్మిస్తాడు. చాలా చాలా ప్రయత్నం మీద ఒకే ఒక విశ్లేషణ కథనాన్ని సృష్టిస్తాడు. దీన్నే మనం మహాకథనం అంటాం. ఒకే ఒక దారం అన్ని విషయాలకు ఆధారభూతమవుతుంది. కానీ మైడియర్ ఫ్రండ్! నీవు జాగ్రత్తగా, సూక్ష్మంగా పరిశీలిస్తే అందులో చాలా దారాలు ఒక దానికొకటి ఖండించుకుంటూ పోతుండటం గమనిస్తావు. నీవు నీ ప్రయత్నం చేత పూలనన్నింటినీ ఒకే సూత్రం ద్వారా బంధించాలని ప్రయత్నిస్తే అందులోని పూలు ఒకదానిలో ఒకటి అతకవు. విభేదిస్తాయి, సంఘర్షిస్తాయి. అలా అతకని పూలను నీవు తొలగించవచ్చు. కాని తొలగించినా అది అస్తిత్వంలోనే వుంటాయి కాని నీవు మాత్రం వాటి ఉనికిని గమనించటానికి తయారుగా ఉండవు. నిరాకరిస్తావు. ఎందుకంటే నీ మహా కథనంలో అవి లేవు, ఇమడవు. ఇక ప్రయోజనం లేదని బల ప్రయోగానికి దిగుతావు. ఈ మహా కథనమనేది బలవంతంగా శక్తినుపయోగించి అణిచి వేయాలని చూస్తుంది. కాని ఆధునికాంతరత బలవంతాన్ని సహించదు."

నా మెదడులో ఏదో సుడిగాలి ప్రవేశించినట్లయింది. ఏ సిద్ధాంతకర్త ఆలోచనలు తిరస్కరించి ఆయన తన దారపు సూత్రాన్ని కనుక్కున్నారో నాకు తెలియదు. బహుశా ఆ సిద్ధాంతపు ప్రాంతీయ వెర్షన్ చెప్తున్నాడులా వుంది. అంతే ఐవుంటుంది. బూటకపు విశ్లేషణలే మనకు సరిపోతాయి.

అలాఐతే "మహా కథనాలకు బదులుగా లఘు కథనాలకు పోవటం మంచిది గదా?" ధైర్యం చేసి అడిగాను.

అతను నన్నో వెర్రివాడిని చూసినట్లు చూశాడు.

వాటిని లఘు కథనాలని అనరు. ప్రాంతీయ కథనాలంటారు. చూడు మైడియర్ ఫ్రండ్! ఈ "పోవటం మంచిది" అని ఎందుకంటున్నావ్. అంటే ప్రాంతీయ కథనాలు యిది వరలో లేవనా? అది తప్పు. అవి యింతకు ముందే ఉనికిలోనూ, వ్యాప్తిలోనూ ఉన్నాయి."

నాకర్థమైందల్లా జియోగ్రాఫర్‌గారు ఆధునికాంతరవాద వ్యాపారి అని. ఆయన తన వాదాలను అమ్మాలని ప్రయత్నిస్తున్నాడు. సాహిత్యానికి పండిన ఫలం జాగ్రఫీలా అనిపించింది. అదృష్టవశాత్తు నా ఆలోచనలను నా ముఖంలో ప్రతిఫలించలేదు. లేకపోతే నా ఈ ఆధునిక అనుమానాన్ని అవహేళన చేసేవాడు, కాని ఆయన ప్రవచనాలు యింకా అయిపోయినట్లు లేదు. తిరిగి అత్యంత శ్రద్ధతో తన సిద్ధాంతాన్ని కొనసాగించాడు. (ఈ పరస్పర విరుద్ధమైన వాదాలు నాకు ఒక దేవుడు – అనేక దేవుళ్లు సిద్ధాంతం లా చికాకుపరుస్తోంది)

ఈ ప్రాంతీయ కథనాలనేవి వివిధ జీవితాల అనేక పార్శ్వాలను స్పర్శిస్తాయి. పని, మతం, సాహిత్యం, రాజకీయం, సంస్కృతి, యింకో రకంగా చెప్పాలంటే ప్రజలు తమ పని పరిధులలో తమకంటూ ఒక భాషనూ, నిర్మించుకుంటారు. వారి వారి అవసరాలకి అనువయ్యే విధంగా. కాని వేగవంతంగా మారే జీవన క్రమంలో ఈ అనేక పరిధులు, విలయాల మధ్య దూరం చాలా తగ్గింది. ఒకరినొకరు నెట్టుకుంటారు. భుజాలు, భుజాలు రాసుకుంటారు. ఒకరి మీదొకరు పడొచ్చు. అంటే చిరు సంఘర్షణలు జరగొచ్చు. కాని బల ప్రయోగం ద్వారా అణచటం వుండదు. మహా కథనాలు బల ప్రయోగాలకు ఆధార భూతాలవుతాయి. అందుకని ప్రాంతీయ కథనాలని అలాగే మన నివ్వటం అవసరం. ఒకరి ప్రక్క ఒకరు తమ తమ పరిధులలో, విడివిడిగా బ్రతకాలి. అప్పుడే శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయి."

స్టేషన్‌లో నెలకొన్న ఈ రణగొణ ధ్వనుల కథనాల మధ్య, జియోగ్రాఫర్ ఉపన్యాసం ఒక మహా కథనంలా అనిపించి నా తలదిమ్మెక్కింది. అంతలో ఒక పిల్లాడు మావైపు వచ్చాడు. అతని చేతిలో మసాలా పల్లీల సంచి ఉంది. ఇటువంటి మసాలా పల్లీలు, శెనగలు తింటే నా మనసులో మెదిలే అనుమానాల నుంచి ఉపశమనం పొందొచ్చు అనిపించింది. నిజానికి అది నా కిష్టమైన అలవాటు కూడా. అతన్ని పిలిచి మసాలా పల్లీలు కొన్నాను. జియోగ్రాఫర్ గారి వ్యాఖ్యానాలు

నా మెదడును మొద్దుబారేట్లు చేశాయి. యింకా అతని దగ్గర బోలెడంత సరుకు మెదడంతా నిండి వున్నట్లుంది. అయినా దాని జోలికి పోకుండా "యిదిగో నీ దగ్గర సిగిరెట్లున్నాయా?" అన్నాడు కుర్రాడితో..

మసాలా పల్లీలు, సిగిరెట్లు కేవలం ఆధునికాంతరవాదంలోనే ఒక దాని ప్రక్కన ఒకటి ఇమడగలుగుతాయి. కాని పల్లీల కుర్రాడు కేవలం సాంప్రదాయకుడు. అందుకేనేమో" నా దగ్గర సిగిరెట్లుండవు సార్! అక్కడున్న స్టాల్‌లో దొరుకుతాయి. తెచ్చిపెట్టాలాసార్" అన్నాడు.

"సరే. నా కొక పెట్టె తెచ్చివ్వు" అంటూ డబ్బులిచ్చాడు జియోగ్రాఫర్. డబ్బులిచ్చి నాక్కూడా మరో పెట్టె తెచ్చిపెట్టమని అడిగాను. మసాలా పల్లీలు తింటూ నా చుట్టూ వున్న స్థానిక కథనాలను గమనిస్తూ కూర్చున్నాను. మా ముగ్గురిది కలిపి ఓ ప్రాంతీయ కథనం, అంటే సాహిత్యానికి సంబంధించినది. సుదూరంలో పరుపు చుట్టల మీద కూర్చుని, యింటి దగ్గర్నుండి తెచ్చుకున్న తిండిని తింటున్న జవాన్లది మరో కథనం. బహుశా అది యుద్ధ కథనం కావచ్చు. మైగుడ్‌నెస్! యిక్కడ విసుగెత్తి ఆవులిస్తున్న ప్రయాణీకులందరికి వారి సొంత కథనాలు ఉండి వుంటాయి. మా కోసం సిగరెట్లకు వెళ్ళిన ఆ మసాలా పల్లీల కుర్రాడికి కూడా వాడి కథనమేదో వాడికుంటుంది.



నేనిలా ఆలోచిస్తుండగానే, సుదూరంలో స్టేషనంతా దద్దరిల్లేలా ఒక పెను విస్ఫోటనం. చుట్టూ కేకలు, హాహాకారాలు, ఏడ్పులు, పెడబొబ్బలు, ప్లాట్‌ఫాం అంతా అల్లకల్లోలమైంది. కేకలతో జనమంతా చెల్లాచెదురైపోయారు. దయనీయమైన శబ్దాలు గాలిలో. అదే సమయంలో లైట్లు ఆరిపోయాయి. స్టేషనంతా చీకటి మయమైంది. మేము కూర్చున్న చోటికి కొద్ది దూరంలోనే శక్తివంతమైన బాంబు ప్రేలింది. మరో విధమైన కథనం యిక్కడ బాంబు రూపంలో ప్రేలిందనిపించింది. మహా కథనంతో సయోధ్య కుదరని ఆధునికాంతరతకు చెందిన ప్రాంతీయ, స్థానిక కథనమేదో యిక్కడ విస్ఫోటనం చెందింది. మిగతా అన్ని కథనాలూ, కేకలలో, అరుపులలో, ఏడుపులలో, బాధల్లో, మూలుగుల్లో కలిసిపోయాయి.

లేచి అటూ యిటూ హడావుడిగా పరుగెడుతూ, జియోగ్రాఫర్‌గారు తన సూట్‌కేసు అందుకున్నారు. (ఒకవైపు అటూ యిటూ పరగెత్తటం, లేవటం, సబబేనో కాదో అలంకారికులే తేల్చాలి) సైలెన్సర్ యధాప్రకారం గురువు గారిని అనుసరించాడు. నేను కూడా నిలబడ్డాను కానీ ప్రేలుడు సంభవించినవైపు నిర్వేదంగా చూస్తూ వున్నాను. మేము సిగిరెట్ల కోసం పంపిన కుర్రాడు అక్కడే వున్న షాపు దగ్గరి కెళ్ళటం చూశాను. అతనికి దగ్గరలోనే ఆ విస్ఫోటనం సంభవించింది. అతనికేమయినా అయిందా? బ్రతికే వుంటాడా? లేక ఆ ప్రేలుడులో...!

జియోగ్రాఫర్ నా చేయి పట్టి బలవంతంగా లాగాడు. అతని ముఖ భూగోళంలో సమూల పరివర్తన ఆందోళన, ఆతృత.

"కమాన్! యిక్కడి నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. మరికొన్ని నిముషాలలో పోలీసులు, సైనికులు స్టేషన్ను దిగ్బంధనం చేస్తారు. అందర్నీ నఖశిఖ పర్యంతం పరీక్షిస్తారు. గుచ్చి గుచ్చి ప్రశ్నలడుగుతారు. మనమీ రొంపిలో యిరుక్కోకుండా వుండాలంటే వెంటనే బయటపడాలి" అంటూ నన్ను నిల్చున్నపళంగా లాగటం మొదలుపెట్టాడు.

"చాలామంది చనిపోయినట్లున్నారు. మనం వెళ్ళి చేతనైనంత వరకు కొందరికైనా సాయం చేయటం మంచిది. ఆ పల్లీల కుర్రాడికేమయిందో? అదైనా ఆరా..."

నా మాటలను మధ్యలోనే తిట్లతో తుంచేశాడు జియోగ్రాఫర్.

"యూ ఇడియట్ . పల్లీల కుర్రాడు గంగలో కలవనీ... యిక్కడుంటే మనం యిరుక్కుంటాం" అంటూ నన్ను బలవంతంగా స్టేషన్ బయటకి లాక్కొచ్చాడు. రెండు ఆటోల్లో, ఆందోళనల మధ్య ఇళ్ళకొచ్చిపడ్డాం.

– – –

న్యూస్ పేపరు మొదటగా జియోగ్రాఫర్ యింటికొస్తుంది. అందుకని నేను పెందరాళే అతనింటికి వెళ్ళాను ఆతృతగా. నాకంటే ముందే అక్కడ సైలెన్సర్ ప్రత్యక్షమైనాడు. పేపర్ రాగానే ఆకలిగొన్న వాళ్ళలా పేపర్ మీద పడ్డాం. జియోగ్రాఫర్ గారు తలపైకెత్తి "థాంక్ గాడ్! మనకు తెలిసిన వాళ్ళెవరూ చనిపోలేదు" అన్నాడు నింపాదిగా శ్వాసపీలుస్తూ (చనిపోయిన వారి వృత్తుల్లో పల్లీల కుర్రాడు లేనట్లు అర్థమైంది). కానీ జియోగ్రాఫర్ "మనకు తెలిసిన వాళ్ళు" అనే పదం విని నాకు ఆశ్చర్యమేసింది. మొత్తం ఏడుగురు మృతి చెందినట్లు పేపర్లో వచ్చింది. అది అతని దృష్టికి ప్రాధాన్యత లేని అంశం. ఏడు అనేది అతనికి కేవలం ఒక సంఖ్య. అంతకు మించి ఏమీ కాదు. మానవ జీవితంలో ఏ మాత్రం సంబంధంలేని కేవలం అంకె. సైలెన్సర్ తన డ్యూటీ ప్రకారం గురువు గారికి మద్దతుగా తల ఉపాడు.

కాని నాకు మాత్రం షాక్ తిన్నట్లయంది. జియోగ్రాఫర్ నావైపు ఆశ్చర్యంగా చూసి" ఏమైంది నీకు? మొఖం ఎందుకలాపెట్టావ్? అని అడిగాడు.

ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం కాలేదు. నోట్లో మాటరావటం లేదు. అందుకు బదులుగా అదే పేజీలో వున్న ఒక న్యూస్ ఐటమ్‌ను వ్రేలితో చూపించాను. ఎవరిదో తెలియని సూట్‌కేసొకటి స్టేషన్ బెంచీ మీద దొరికిందనీ, దానిని గురించి దర్యాప్తు సాగుతున్నందున దానిమీదున్న యినిషియల్స్‌ని పోలీసులు బయటపెట్టలేదనీ, అది బహుశా తీవ్రవాదులలో ఒకరిది కావచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారనీ ఆ వార్త సారాంశం.

నువ్వు నీ సూట్‌కేసును అక్కడే వొదిలేశావా?

జియోగ్రాఫర్ సైలెన్సర్ గొంతుకలు ఏకంగా శ్రుతి కలిపి అడిగారు, ఆశ్చర్యంగా అలవాటుకు భిన్నంగా (మామూలుగా గురువుగారు అన్న తర్వాత అనటం సైలెన్సర్‌కు అలవాటు). వారిరువురి డ్యూయెట్ నా అయోమయాన్ని ఇనుమడింపజేసి బాధను, భయాన్ని ద్విగుణీకృతం చేసింది.

పోలీసోళ్ళ బూట్ల చప్పుడు నా చెవులకు ముందుగానే వినిపించింది. నా మనోనేత్రం ముందు నా వీపుపై రాళ్ళ లాఠీదెబ్బలు పడటం ఆధునికాంతరవాదసత్యంగా మెదిలింది. •

## కవిత

# "అంతర్ముఖం"

### - కటుకోర్ఘ్వుల రమేష్‌కుమార్



అంతర్ముఖాలను
ఆవిష్కరించడమంటే
విలువల వలువలూడదీయటం కాదు
నిజాన్ని నిబ్బరంగా నినదించడమంటే
వెగటును వెళ్లగక్కడం కాదు
సత్యందరికి చేరడమంటే
నిండు జీవితాల్ని
పదిమందిలో వొంపుకోవడం కాదు

నమ్మకం గోడల మీద నిలబడి
బతుకుమెట్లు ఎక్కుతున్న వాళ్ళకు
సత్యం ఎప్పుడూ సవాలే...

అంతరంగాల్లో దాచుకున్న
అందమైన చిత్రాల్ని
ఏ పొలిగ్రాఫ్ యంత్రాలో లాగేస్తే

వికృత చిత్రాలే తెరమీది కొస్తాయి
క్షణ క్షణం మారే మానసాకృతిని
ఏ దర్పణం నిండుగా స్కానింగ్ చేస్తుంది

ఓర్చుకోవడం హద్దుల్ని గీసుకోవడం మాని
లోలోని కలల్ని ఊహల్ని ఊసుల్ని
పనికిమాలిన ప్రశ్నల పరంపరలో

నిక్కచ్చిగా తడుముకుంటూ పోతే
నిజాలన్నీ నిజంగానే నిప్పై దహిస్తాయి

ఇప్పుడు
నన్ను తొలుస్తున్న ప్రశ్నొక్కటే!
మనిషిలోని డబ్బు దాహాన్ని
సొమ్ము చేసుకుంటున్న బుల్లితెరల్ని
పాశ్చాత్య పోకడల్లో మునిగి
కేరింతలు కొట్టే వెర్రి వెంగలప్పల్ని
సమాధానాల అవధానాలల్లో
తమను తామే భేష్ భేష్ అనుకుంటూ
భుజం చరుచుకునే
స్వయం కృతాపరాధుల్ని
ఏ అక్షరాలతో దునుమాడాలి
ఏ విలువల ఉరికొయ్యకు
వీళ్ళను వేళ్ళాడదీయాలి!

# హరిత విప్లవ సందేశం

### - నజరా



నా ఉఛ్వాస నిశ్వాసాల శబ్దం
నాకు వినిపిస్తుంది...
నా చుట్టూ ఉన్న నిశ్శబ్దం
పెట్టుబడిదారుల
కపట ఐకమత్యంలా
నర్మ గర్భంగా ఉంది
జైలు గదిలో వేలాడే బల్బు
దోపిడికి గురయ్యే
పేదవాడి ఆఖరి ఆశలా
ఆరుతూ వెలుగుతూ ఉంది

కాలం స్తంభించి
కొంగ జపం చేస్తుంది
గదిలో మూలగా కూర్చున్న
నా వరకూ వచ్చి, ఆగిన
అన్నం పళ్ళెం
బైటి ప్రపంచంలో
టైమెంతైందో తెలియజేస్తుంది.

పళ్ళెంలో పదార్థాన్ని చూస్తే
ఆపాటి తిండికి కూడా
ముఖం వాచిన నా వాళ్ళు గుర్తుకొచ్చి
నోటి వరకూ ముద్ద ఎత్తడానికి
చెయ్యి వెనకాడుతుంది

ఎత్తుగా ఉండే వెంటిలేటర్ వెనక
పావురాళ్ళు
రెక్కల్ని టపటపలాడిస్తాయి
నా నిశ్శబ్దంలో
ఆ చప్పుడు
ఉరిమే స్టెన్‌గన్ చప్పుళ్ళా
వినిపిస్తుంది.

బైట పెనుగాలులు వీచినప్పుడు
నా గదిలో... నా హృదిలో... కూడా
వాతావరణం చల్లబడుతుంది,
బైట వర్షం కురుస్తుంది,

పచ్చకర్పూరం పొడిలా
నా చుట్టూ
సన్నటి నీటితుంపర కురుస్తుంది.
తడిసిన మట్టివాసన–
మోకాళ్ళ వరకూ బురద అంటిన
అమ్మానాన్నలను
జ్ఞాపకం చేస్తుంది.

వెంటిలేటర్‌లోంచి ఎగిరొచ్చి
నా గదిలో వాలిన
పచ్చని ఆకు
అడవి పంపిన సందేశం
నాకు వినిపిస్తుంది
తెల్లని ఖైదీ దుస్తుల్లో నేనూ
వెంటిలేటర్‌లో తెల్లని పావురాళ్ళూ
ఒక్కలాగే అసహనంగా ఉన్నాం,
అశాంతి కపోతాల్లా ఉన్నాం,
మంచు కప్పుకింద పొంగుతున్న
అగ్గిబుగ్గల్లా ఉన్నాం,
నన్ను చూస్తున్న పావురాళ్ళు
నా సందేశాన్ని మోసుకెళ్తాయి...
"పచ్చదనాన్ని వేటాడినంత కాలం
శాంతి బందిఖానాలోనే ఉంటుంది,
శాంతికి స్వేచ్ఛ వచ్చే వరకూ
హరితం విప్లవిస్తూనే ఉంటుంది.

వర్తమానం

# ఆర్థిక, ఆధిపత్య ప్రయోజనాలకే ఒబామా పర్యటన



- తెలకపల్లి రవి

***ప్రపంచీకరణ అంటే సరిహద్దులు లేని సరుకుల సంత. ఆ సంతను సొంతం చేసుకోవాలనే ఆదరగణ్ణం దేశం అమెరికా. సోవియట్ విచ్ఛిన్నానంతర ప్రపంచంలో ఆర్థిక రాజకీయ సాంస్కృతిక ఏకచ్ఛత్రాధిపత్యం సాగించడమే ఏకైక లక్ష్యంగా చేసుకున్న శక్తి అది. ఆర్థికంగా దివాలా ఎత్తి ప్రపంచంలో అత్యంత రుణగ్రస్త దేశంగా డాలరును బాంబర్లను అడ్డం పెట్టుకుని నెట్టుకొస్తున్న ప్రపంచ పోలీసు అమెరికా. అయినా దానితో స్నేహం చేయవద్దని ఎవరూ అనరు. వాణిజ్య లావాదేవీలు వద్దనీ చెప్పరు. కాని ఆ పారవశ్యంలో మన ప్రయోజనాలు ఫణం పెట్టడమే ప్రమాదకరం. ఉభయతారకంగా ఉండాల్సిన ఒప్పందాలను సంబంధాలను ఏకపక్షంగా చేసుకోనివ్వడమే ఆందోళనకరం. నేను పొట్టుతెస్తాను మీరు పప్పులు తీసుకు రండి వూదుకు తిందామని అమెరికా అంటే ఆహో ఓహో అంటూ మనం ఎగబడిపోవడమే అత్యంత అభ్యంతరకరం.***

**అ**మెరికా అధ్యక్షుడు బారక్ ఒబామా తీపి మాటలతో తాయిలాలు తన్నుకుపోతున్నప్పుడు, ఈ సువిశాల దేశాన్ని ఆధిపత్య వ్యూహంలో చిక్కించుకుంటున్నప్పుడు మీడియాలో గాని, పాలక రాజకీయ పక్షాలలో గాని అప్రమత్తతే లేకుండా పోయింది. మొదటి నుంచి సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని ప్రదర్శిస్తున్న వామపక్షాలు మరికొన్ని దేశభక్తియుత శక్తులు మినహాయిస్తే ప్రధాన పాలక గణాలన్ని సాగిలబడటమే జరిగింది. దేశాన్ని రెండు పార్టీల నాయకత్వంలో రెండు మిశ్రమ ప్రభుత్వాలు పాలించినా మా పట్ల వైఖరి మారకపోవడం మహాదానందకరమని ఒబామానే పార్లమెంట్‌లో చెప్పాడు. ప్రపంచీకరణ అంటే సరిహద్దులు లేని సరుకుల సంత. ఆ సంతను సొంతం చేసుకోవాలనే అదరగణ్ణం దేశం అమెరికా. సోవియట్ విచ్ఛిన్నానంతర ప్రపంచంలో ఆర్థిక రాజకీయ సాంస్కృతిక ఏకచ్ఛత్రాధిపత్యం సాగించడమే ఏకైక లక్ష్యంగా చేసుకున్న శక్తి అది. ఆర్థికంగా దివాలా ఎత్తి ప్రపంచంలో అత్యంత రుణగ్రస్త దేశంగా డాలరును, బాంబర్లను అడ్డం పెట్టుకుని నెట్టుకొస్తున్న ప్రపంచ పోలీసు అమెరికా. అయినా దానితో స్నేహం చేయవద్దని ఎవరూ అనరు. వాణిజ్య లావాదేవీలు వద్దనీ చెప్పరు. కాని ఆ పారవశ్యంలో మన ప్రయోజనాలు ఫణం పెట్టడమే ప్రమాదకరం. ఉభయతారకంగా ఉండాల్సిన ఒప్పందాలను సంబంధాలను ఏకపక్షంగా చేసుకోనివ్వడమే ఆందోళనకరం. నేను పొట్టు తెస్తాను మీరు పప్పులు తీసుకురండి వూదుకు తిందామని అమెరికా అంటే ఆహో ఓహో అంటూ మనం ఎగబడిపోవడమే అత్యంత అభ్యంతరకరం.

50వేల ఉద్యోగాలను సృష్టించే వెయ్యి కోట్ల డాలర్ల ఒప్పందాలు అన్న పేరిట ఘనంగా ప్రచారమైన వార్తలు వాస్తవంలో భారతదేశం నుంచి ఆయన తీసుకుపోయినవి మాత్రమే. మరోవైపున ఈ పర్యటనలో మనకు ఒనగూడిన ప్రయోజనం ఇది అని ఒబామా గాని, మన్మోహన్ గాని ఇదమిద్ధంగా చెప్పిన దాఖలాలు లేవు. స్టేట్స్‌మన్‌గా కాకుండా సేల్స్‌మ్యాన్‌గా వచ్చాడన్న వ్యాఖ్య వాస్తవాన్ని సరిగ్గానే ప్రతిబింబించింది. అమెరికా నుంచి జరుగుతున్న ఎగుమతులలో రెండు శాతం మాత్రమే ఇండియాకు వస్తున్నాయని, ఇది మరింత పెరిగేందుకు ఆంక్షలు సడలించాలని ఆయన హితబోధ చేశారు. అయితే మననుంచి జరుగుతున్న ఎగుమతుల కంటే మన దేశంలోకి వచ్చిపడుతున్న అమెరికా దిగుమతులు రెట్టింపు శాతం వున్నాయన్న వాస్తవాన్ని ఆయన అస్సలు పట్టించుకోలేదు. మన వ్యవసాయ ఎగుమతులను గాని, మరీ ముఖ్యంగా వస్త్ర ఎగుమతులను గాని అమెరికా అడ్డుకోవడం తీవ్ర సంక్షోభాలకే కారణమవుతున్నా స్పందించలేదు. మాంద్యంతో కుదేలైన అమెరికాలో నిరుద్యోగం పది శాతం వరకూ పెరిగింది. అసోసియేటెడ్ ప్రెస్ వార్తా సంస్థ అంచనా ప్రకారం అక్కడ 1.47 కోట్ల మంది నిరుద్యోగులున్నారు. అరకొర ఉద్యోగాలు చేసేవారిని కూడా కలిపి చూస్తే ఈ సంఖ్య దాదాపు రెండు కోట్లు అవుతుందని సాయినాథ్ లెక్క వేశారు. 2008లో వచ్చిన మాంద్య ఫలితంగా అనేక సంస్థలు గిరాకీ లేక గిరికీలు కొడుతున్నాయి. ఈ కడగండ్ల ప్రభావం ఒబామాపైన పడటం వల్లనే ప్రతినిధుల సభకు జరిగిన ఎన్నికలలో ఆయన పార్టీ అయిన డెమోక్రట్లకు తీవ్రమైన

***మన స్వతంత్రత గిట్టని సామ్రాజ్యవాద శక్తి మనం ఎదగడానికి దోహదం చేస్తుందన్న ఆలోచనే అర్థరహితం. ప్రపంచీకరణలో దాంతోపాటు ఎంతోకొంత వాటా కోరుతున్న బేహారులకు అమెరికాతో చెలిమి అవసరం కావచ్చు. కానీ వ్యవసాయ సంక్షోభంలో చిక్కిన రైతులకు కాదు. నిరుద్యోగులకు అంతకన్నా కాదు. పరిశ్రమలు సేవలు వ్యవసాయం విద్య, వైద్యం సంస్కృతి అన్నిటిలోకి చొచ్చుకు వస్తున్న అమెరికాను తన విధానాల పరిధిలో నిలువరించగలిగిన సత్తా చైనాకు వున్నట్టు మనకు లేదనేది జగమెరిగిన సత్యం. మనం మహాశక్తిగా ఎదిగిపోయామని ఆయన మునగచెట్టు ఎక్కిస్తే మురిసిపోవడం ముప్పుకే దారితీస్తుంది.***

ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాను ఎవరు పాలించినా ప్రపంచాన్ని అమెరికా పాలించాలనే ఆధిపత్య సూత్రాన్ని సంపూర్ణంగా పాటించే సామ్రాజ్యవాద నీతి కారణంగా ఈ గెలుపు ఓటముల వల్ల తక్కిన ప్రపంచానికి ఒరిగేదేమీ వుండదు. ఆయన దేశ రాజధానికి రాకుండా వాణిజ్య రాజధానికి వెళ్ళి కార్పొరేట్ కుబేర సంతతితో బేరసారాలు సాగించడానికి ప్రథమ ప్రాధాన్యతనివ్వడం ఈ పర్యటన స్వభావాన్ని తేటతెల్లం చేసింది. మీకు యాభై వేల ఉద్యోగాలు రావచ్చుగాని మాకు ఒరిగిందేమిటనీ ప్రశ్నిస్తే దీన్ని చూపించి మీకు అనుకూలంగా మా వాణిజ్యవేత్తలలో మార్పు తెస్తానని ఆయన చెప్పడం మామగారి చెవిలో కేశాలు మొలిపించమన్న చందంగా ఉంది.

ఒబామా పర్యటనలో సానుకూల అంశమేదీ లేదా? ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత సభ్యత్వానికి మద్దతుగా మాట్లాడ్డం ఆహ్వానించదగింది కాదా? పర్యటన మొదట్లో దీనిపై ఆయన చేసిన వ్యాఖ్యలకు చివరలో చేసిన ప్రకటనకూ మధ్య తేడా ఉంది. తన ఏకపక్ష పర్యటన పట్ల వైముఖ్యం గమనించిన తర్వాతనే స్థూలమైన వ్యాఖ్యలు చేశారు తప్ప భారతదేశం పేరును తాము ప్రతిపాదిస్తామని చెప్పింది లేదు. పైగా ఐరాస ఇప్పుడున్న రూపంలో అమెరికా చెప్పుచేతుల్లో పనిచేసే సంస్థగానే కొనసాగేట్టయితే మనం వారి మద్దతు తీసుకున్నాక శాశ్వతంగా అక్కడ ఉండడం వల్ల చేయగలిగింది వారి సేవ మాత్రమే! ఇప్పటికే ఇరాన్ బూచిపై చర్యలు తీసుకునే విషయంలో మనం అమెరికాకు వత్తాసు పలుకుతున్నాం. 21వ శతాబ్దంలో కీలక పాత్ర వహించాలనుకున్న దేశాలు నిర్వహించాల్సిన విధులేమిటో ఒబామా తన ప్రసంగంలో పరోక్షంగానే నిర్దేశించడాన్ని నిన్న ఇదే పుటలో ఎం. కృష్ణారావు చక్కగా విశదపర్చారు. చైనాను ఒత్తిడి చేయడంలో కలిసి రావాలన్న సంకేతం కూడా ఇచ్చారు. భారత వ్యతిరేక చర్యలకు పాకిస్థాన్ పాలకుల ప్రమేయం లేనట్టుగా తీవ్రవాదులపై అణచివేత చర్యలు తీసుకోవాలని హితబోధల గంధలేపనం చేయడం పెద్ద విజయమనుకోవడం మరీ అసంబద్ధం. ఈ పర్యటనకు ముందే ఒబామా పాకిస్థాన్‌కు 200 కోట్ల డాలర్ల విలువైన ఆయుధ సహాయం అందించడం మర్చిపోకూడదు. అలాంటి అమెరికాతో రక్షణ ఒడంబడికలు, భారీ ఎత్తున వారి నుంచి ఆయుధాల కొనుగోళ్ళు నేరుగా అణు సంస్థల్లోకి ఆహ్వానాలు అనర్థదాయకాలే తప్ప ఆనందకారకాలు కాదు. పాక్ అమెరికా జాతీయుడు తాజ్ హోటల్ దాడికి సూత్రధారి డేవిడ్ హెడ్లీని తమ దగ్గర పెట్టుకుని ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటం అంటూ ఊకదంపుడు చేయడం విజ్ఞతను పరిహసించడం గాక మరేమిటి? అణు దేశాల కూటమిలోకి మనను అనుమతించినట్టు డిఆర్‌డివో వంటి సంస్థలపై ఆంక్షలు తొలగించినట్టు చేసిన ప్రకటన నిన్నటి ఆధిపత్య అహంకారాన్ని తెలియజేయడంతో పాటు ముందున్న ఆపాయాలనూ గుర్తు చేస్తుంది. అమెరికా ఆంక్షలనూ అవరోధాలనూ అధిగమించి సోషలిస్టు సోవియట్ సహకారంతో మన శాస్త్రజ్ఞులు రూపొందించిన అణు స్వావలంబన వ్యవస్థలోకి ఈ విధంగా చొరబాటుకు ఆస్కారం కలుగుతుంది. పనిలేని అమెరికా అణు విద్యుత్ కంపెనీలకు లాభాలు పెరుగుతాయి.

స్నేహ సంబంధాలెప్పుడూ ఇచ్చి పుచ్చుకునే రీతిలో పరస్పర ప్రయోజనకరంగా వుండాలి తప్ప, ఏకపక్ష ధోరణిలో కాదు. గతంలోనూ ఇప్పుడూ కూడా మన స్వతంత్రత గిట్టని సామ్రాజ్యవాద శక్తి మనం ఎదగడానికి దోహదం చేస్తుందన్న ఆలోచనే అర్థరహితం. ప్రపంచీకరణలో దాంతోపాటు ఎంతో కొంత వాటా కోరుతున్న బేహారులకు అమెరికాతో చెలిమి అవసరం కావచ్చు. కానీ వ్యవసాయ సంక్షోభంలో చిక్కిన రైతులకు కాదు. నిరుద్యోగులకు అంతకన్నా కాదు. పరిశ్రమలు, సేవలు, వ్యవసాయం, విద్య, వైద్యం, సంస్కృతి అన్నిటిలోకి చొచ్చుకు వస్తున్న అమెరికాను తన విధానాల పరిధిలో నిలువరించగలిగిన సత్తా చైనాకు వున్నట్టు మనకు లేదనేది జగమెరిగిన సత్యం. మనం మహాశక్తిగా ఎదిగిపోయామని ఆయన మునగచెట్టు ఎక్కిస్తే మురిసిపోవడం ముప్పుకే దారితీస్తుంది. చైనా, రష్యా, బ్రెజిల్, ఇండియా కలిసి రూపొందిస్తున్న బ్రిక్ వంటి వ్యవస్థలను పటిష్టం చేసుకోవడం నేటి అవసరం తప్ప అమెరికా వుచ్చులో చిక్కుకోవడం కాదు. అంకుల్ శ్యాంకు మనం ఇంతగా లోబడిపోతూ ఆయన జైహింద్ అన్నాడని సంబరపడడానికి ఇది పిల్ల వ్యవహారం కాదు. అమెరికా పక్కనే వున్న వెనిజులా వంటి దేశాలు ప్రతిఘటనతో ప్రత్యామ్నాయ మార్గంలో వెళుతున్న తీరు మనకు స్ఫూర్తిదాయకం కావలసింది.

భుజకీర్తులు తగిలించుకున్న ఘన మేధావులు కొందరు నేటి వాస్తవాలు గుర్తించనట్టు నటించినా ఒబామా మనకు వొరగబెట్టింది లేదని సగటు భారతీయుడు భేషుగ్గా అర్థం చేసుకోగలడు. గతంలో బిల్‌క్లింటన్, జార్జిబుష్‌లు వచ్చినప్పటి ఆర్భాటంతో పోలిస్తే ఈసారి పరిస్థితి భిన్నంగా వుందనేది స్పష్టం. మన రాష్ట్రంలోనే చంద్రబాబునాయుడు, రాజశేఖరరెడ్డి ఉభయులూ అమెరికా అధ్యక్షులను రప్పించడం గొప్ప విజయమన్నట్లు ప్రచారం జరిగింది. తీరా వారు వచ్చి చేసిందేమిటని ప్రస్తుత ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి పరస్పర సంవాదంలో ప్రయోగించిన భాష చూస్తే పరిస్థితి ఎంత మారింది తెలుస్తుంది. ఆనాడు బుష్‌తో నృత్యం చేసిన మైక్రో ఫైనాన్స్ మహిమ లేమిటో కళ్ళ ముందు కనిపిస్తూనే వుంది. కనుక మనవంటి వర్ధమాన దేశాలు స్వావలంబన, స్వయం పోషకత్వంపై శ్రద్ధ పెట్టాలే గాని అమెరికా ధృతరాష్ట్ర కౌగిలిలో చిక్కుకోకూడదన్నదే సారాంశం. •

## కవిత

# ప్రశ్న - ప్రగతి

**- గడీల సుధాకర్ రెడ్డి**

ప్రశ్న ప్రగతికి చిహ్నం
ప్రశ్న జగతికి రక్ష
ప్రశ్న సర్వకాలాల్లో వర్ధిల్లాలి
ప్రశ్నే లేకుంటే సర్వనాశనం
ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ సందర్భంలోనైనా
ప్రశ్నించాల్సిందే...
అనుమానాలు నివృత్తికి అసలైన ఆయుధం
ప్రశ్న
అవినీతి పాలకుల గుండెల్లో గునపమయ్యేది
ప్రశ్నే...
అమాయక మహిళలను
సూక్ష్మ ఋణాల పేరుతో
అమరపురికి సాగనంపుతున్న మెగా దా'రుణ'
షైలాక్ సంస్థలను
మాడు మీద గుద్ది ప్రశ్నించాలి
ఎవడబ్బ సొమ్మని
ఎందుకింత శాతం వడ్డీరా అని?
శ్రమ జీవుల రక్తాన్ని
జలగల్లా పీల్చే అధికారమ్మీ
కెవడిచ్చాడురా అని?
ప్రశ్నించకపోవడం దగాకోరుల లక్షణం,
దద్దమ్మల లక్షణం, చవటల లక్షణం,
సన్నాసుల లక్షణం
తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే
మూర్ఖుల లక్షణం.



ప్రశ్నే లేకుంటే
బ్రతుకు ఆశ్చర్యార్థకమవుతుంది.
చివరకు ఫుల్‌స్టాప్‌కు గురవుతుంది
ప్రశ్నించడం నేర్పిన సోక్రటీస్ హెమలాక్
విషానికి గురికావొచ్చు, కాని
ప్రశ్నకు మారుపేరుగా నిలచి అమృతాన్ని
పంచిన వీరుడు, శూరుడు, జగదేకవీరుడు
అమరుడు అన్ని కాలాల్లో దేదీప్యమానంగా
కీర్తి వెలుగుతున్నవాడు
మనకు ఆదర్శంకావాలి,
స్ఫూర్తి కావాలి
ప్రశ్నించని సమాజం
సజీవ సమాధవుతుంది
ప్రశ్నిస్తేనే సక్రమ మార్గంలో నడుస్తుంది

ఇంటా, బయటా ఎక్కడైనా వక్రమార్గాన్ని
ప్రశ్నించాల్సిందే
తరగతి గదిలో ప్రశ్నలుంటేనే
విద్యార్థుల జీవితాల్లో వెలుగు
ప్రశ్నలు లేకుండా బోధించడమంటే
తరగతి గది స్మశాన సమానమే
ప్రశ్నించేతత్వాన్ని అభివృద్ధి చేయడం
నేటి ఉపాధ్యాయుల తక్షణ కర్తవ్యం
రాజ్యాంగాన్నే భ్రష్టు పట్టిస్తున్న
రాక్షస పాలకులను ప్రశ్నించాలి
విజ్ఞతతో కూడిన ప్రతి ప్రశ్న
రాజ్యాంగ స్ఫూర్తిని నిల్పుతుంది
సమసమాజానికి దారి తీస్తుంది
ప్రశ్నను చంపొచ్చేమో కాని
ప్రశ్నను గెలవలేరు
ప్రశ్నించేవాడు ముమ్మాటికి అజేయుడే!
అవినీతి పరులను, లంచగొండులను
అడుగడుగున ప్రశ్నించాలి.
To ask a question may
bring a moment shame
but not to ask and remain
ignorant is a life time shame
ప్రశ్నకు అణుబాంబుకంటే శక్తెక్కువ
దగాకోరుల గుండెలు బ్రద్దలయ్యేలా
ప్రశ్నాబాంబులు పేల్చండి!

---

# నానోలు

**- డా॥ మౌని**

బతుకు పుస్తకం
రాసింది అమ్మ...
సర్వహక్కులు..
ఆమెకే...!

దుక్కి
మిగిల్చింది
రైతుకు
దుఃఖం

ఓటమి
ఓడిపోయింది
ఆత్మ విశ్వాసం
ముందు...

అమ్మ...
అన్నపూర్ణ
కొడుకులు
రైతులు

మది...
సబ్బుల పెట్టెలో
నురుగుల
ఆలోచనలు

వినీలాకాశం
పుస్తకం
నక్షత్రాలే
అక్షరాలు

వానపాట
పాడింది
మబ్బుల
కోయిల

మనిషి తల
నెరిసింది
మనసు
పండింది

చీకటి
కొండపై
చంద్రుడు
వేలాడే దీపం

వాన
కురవనిమబ్బు
రైతు
క్షత్రగాత్రుడు

దేశ...
ప్రగతి తక్కెట్లో
నాయకులే
కప్పలు

మట్టి
చెట్టు
మనిషికి
తల్లీ, చెల్లి

సూర్యుని పయనం
పగలు
కవి సమయం
రేయింబవళ్లు

చరిత్ర పుటలు
రక్తసిక్తం
రాజులే
ముద్దాయిలు

అక్షరం
నాకన్ను
చదువుతుంది
ప్రపంచాన్ని

జీవిత
గ్రంథం నిండా
నెత్తుటి
గేయాలే...!

కవికి
మనిషికి
కాలం....
'విభజన రేఖ'...

విరిగిన
నాగలి... కర్రులో..
ముక్కలైన
రైతు గుండె.

ఐకమత్యానికి
గుర్తుగా...
ఐదువేళ్లూ
బిగించిన 'పిడికిలి'

కొడిగట్టిన
కోటి జీవితాలను
వెలిగించిన 'దీపం'..
"మదర్ థెరిస్సా'...!

టుమ్రీ

# దూది



**- పప్పల వైకుంఠరావు**

**అద్దె గొంతు అప్పలరాజు పేరు రాష్ట్రం మొత్తం మీద మారుమ్రోగుతుంది. పంచాయితి ఎన్నికల నుండి పార్లమెంటు ఎన్నికల వరకు, అభినందన సభల నుండి సంస్మరణ సభల వరకు, అప్పలరాజు ప్రసంగాలకు మంచి గిరాకి. అవతల పార్టీవోళ్ళను తిట్టడం, ఇవతల పార్టీవోళ్ళను పొగడటం, ప్రజలను ఆకర్షించటంలో అందవేసిన చేయి అప్పలరాజుది.**

మంచి పలుకుబడి కలిగిన వ్యక్తి అవ్వటం వలన అధికార, అనధికార కార్యక్రమాలలో ఆస్థాన విద్వాంసుడిగా ప్రత్యక్షమై, ఎవరికీ అవకాశం ఇవ్వకుండా సర్వం తానై డామినేట్ చేసే గుణం అణగదొక్కే స్వభావం అప్పలరాజు సొంతం.

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. అధికార పార్టీ మళ్ళీ ఎన్నికల్లో గెలిచింది. ఊరు, వాడ అభినందన సభలు జరుపుతున్నారు. జిల్లా కేంద్రంలో కూడా విజయోత్సవ సభలకు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మళ్ళీ తోడేళ్ళ తాట్రాజుకు మంత్రి పదవి లభించింది. “తాట్రాజు”ను రాజధాని నుండి తిరిగివస్తున్న సందర్భంలో కళామందిరానికి అభిమానులు ఊరేగింపుగా జిల్లా సరిహద్దుల నుండి తోడ్కొని వచ్చారు. అభినందన సభ ఆరంభమైంది. ప్రారంభోపన్యాసం మన ఆస్థాన అద్దె గొంతు అప్పలరాజుగారు మైకు అందుకున్నారు. ఉపన్యాసం ప్రారంభించారు. ప్రజల్లో కొంతమంది యువకులు “దూది”ని పంచుతున్నారు. వేదిక మీద వున్న నాయకులకు కూడా దూదిని ఇచ్చారు. అందరూ ఈ “దూది” చూసి ఆశ్చర్యపోతూ తీసుకుంటున్నారు. ఇంతలో ఒక యువకుడు అప్పలరాజు వద్ద వున్న మైకు తీసుకుని అందరూ మేమిచ్చిన ఈ “దూది”ని మీ రెండు చెవుల్లో పెట్టుకోండి అని మైకులో చెప్పాడు. అంతే అందరూ ఆ “దూది”ని చెవుల్లో పెట్టుకున్నారు. పాపం “మంత్రి”గారు. “అద్దె గొంతు అప్పలరాజు” ఆ యువకుడివైపు నిర్ఘాంతపోయి చూస్తున్నారు. మైకులో మీ ప్రసంగాలు విని విని విసిగిపోయాం. ఆపండి మీ ప్రసంగాలు అందుకే మీ ప్రసంగాలు వినకుండా ఈ ‘దూది’తో ప్రజల చెవుల్ని మూసివేయించాం. ప్రజల కడుపు నింపే ప్రసంగాలు చేయండి. ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే ప్రసంగాలు చేయండి అంటూ సందేశం ఇచ్చాడు.

వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి ఆ యువకుడిని అతని బృందాన్ని అరెస్టు చేసి యాంటి సోషల్ యాక్టుతో కారాగారంలో పడేసారు. దీనిపై ప్రతిపక్షాలు రాష్ట్రంలో పెద్ద ఉద్యమం లేవదీసి రాస్తారాకోలు, రైలురోకోలు చేస్తూ విధ్వంసానికి నాంది పలికారు. ఆ యువకులు కారాగారంలో చిత్రహింసలు అనుభవిస్తూ కునుకులేస్తున్నారు.

**అనంతపురంజిల్లా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన కవితల పోటీలో బహుమతి పొందిన కవితలు**

# నేను

## - ముకుందాపురం పెద్దన



నామాటే
వారికి వేదం
వాళ్ళంటే
నాకు ప్రాణం
తెల్లగా నవ్వుకున్న
సుద్దముక్క పొత్తిళ్లలో
గూడు కట్టుకున్న అక్షరాలను
నల్లరంగు పరుపు మీద
కుప్పగా పోసి
పాతాల ముగ్గుల్ని తీర్చినప్పుడు
వారి కంటి వెలుగులు
లోగిళ్ళుగా మారుతుంటాయి
కానీ
స్వప్నాలు
ఆ కంటి వెలుగుల్ని
శూన్య ప్రస్థానాలకు
అపహరించుకుని పోయాయేమో.
మౌనం
పెనుగులాడుతోంది
గ్లోబలైజేషన్ తొడుగుల క్రింద
చివుకుపోయిన చేతి వ్రేళ్ళకు
ఏ వైరస్ సోకిందో
మనిషికి మనస్సుకు మధ్య
వంతెన కూలిపోయింది
తనకు తానే బరువై
ప్రయివేటీకరణం ఆలింగనాల మధ్య
గుండెలు ముక్కలవుతున్నాయి
ఆత్మీయతలు కొండెక్కుతున్నాయి
సంభాషణలు...
పెదాలకు రంగులు పులుముకుంటున్నాయి
సంబంధాలు...
సవాళ్లు విసురుతున్నాయి
ఇప్పుడు
నామాట
ఒక గడ్డి పోచ

# సర్కారు బడి



## - కె. పాలవాయి రాధిక

వీధి లైట్ల ముందు
మసక వెలుతురులో
సర్కారులో బడిలో చదివిన విశ్వేశ్వరయ్య
ప్రపంచంచే మెచ్చుకోబడిన ఇంజనీరు
కాలేదా?
కమ్ముకొస్తున్న కారుచీకట్లను ఛేదించి
కాంతితో యుద్ధం చేసిన
సి.వి.రామన్ శాస్త్రవేత్త కాలేదా?
ఆముదం నూనె దీపాల ముందు చదివి
అక్షరాలతో ఆకాశానికి నిచ్చన లేసి
నోబెల్ బహుమతిని పొందిన రవీంద్రుడు
చదివింది సర్కారు బడిలో కాదా?
లక్షలు ఖర్చుపెట్టి
పండువెన్నెలలాంటి కరెంట్ వెలుగులో
చదువు 'కొని' కనీసం
పాసుమార్కులు పొందగలుగుతున్నారా?
'వాసి' పోసి 'నుసి' నాట్లు నాటుకుపోతుంటే...
కట్టెలమ్మే కూటికి లేని పేదవాడు
నాబిడ్డ కంప్యూటర్ ఇంజనీరు కావాలంటూ...
తల తాకట్టు పెట్టి చదువు 'కొని'స్తే..
కట్టెలు కొట్టడానికి పనికిరాక..
ఉద్యోగమూ రాక తిరుగుతారే..?
డబ్బులకు డిగ్రీలు కొనొచ్చంటున్నారు
నోట్లతో కాపీలు చేసుకునేవారు
సర్టిఫికేట్లనే ఇంటికి తెప్పిస్తానంటారు
డబ్బున్న మారాజులు
డబ్బు దర్పాన్ని పెంచుతుందేమో కానీ
చదువుకున్న వాడు సంస్కారానికి ఆభరణమై..
చదువు మంచితనానికి ప్రతిరూపమై
గాంధీల్ని తయారుచేస్తుంది.
విద్య రవీంద్రుల్ని ఉదయింపజేస్తుంది
విద్య జ్ఞానానికి మూలధాతువై
అనంత ప్రవాహమై...
కాంతుల్ని వెదజల్లుతుంది

# సామాజిక చేతనం

## - పంచరత్నం శ్రీనివాసరావు



చదువు
యశస్సును
సంపదను ప్రసాదిస్తుంది!
నిజమే!
చదువు సామాజిక చైతన్యాన్ని
సశాస్త్రీయ భావనను ప్రతిష్ఠించాలి
అక్షరబద్ధమై ఆలోచించే శక్తి చదువురులకు
మాత్రమే సాధ్యం శాశ్వతం
బడీడు పిల్లలు
అంగటి ముందర
వీధుల ఇరుకు సందుల్లో
పందులు తిరిగే గొందుల్లో
హోటల్లో లాడ్జీల్లో
పశువుల కాపర్లుగా పల్లెల్లో దర్శిస్తున్నాం
విద్యను గడించాల్సిన పిల్లలు
పుస్తకాల వాసన
అయ్యవార్ల అవసరం తెలియదని
చదువు అవసరం వారికొద్దనీ
నిశ్శబ్దంగా ఉందామా!
వినువీధుల్లో విహరిస్తున్నాం
విద్యకు దూరమవుతున్న వాళ్ళను చూస్తున్నాం
జన విజ్ఞానం
సాంకేతిక పరిజ్ఞానం
విలసిల్లుతున్న కాలంలో
బడీడె పిల్లలను జాగృతం చేయలేమా!
ఇప్పుడే టి.వి లో విన్నాను
విజయనగరంలో శ్మశానవాటికలో
చితిమంటల వెలుగులో అక్షర జ్ఞానాన్ని
పొందుతున్నారని!

# వెలుగు

## - ఎస్. రాధాస్వామి



అక్షరాలు దిద్దించి
అజ్ఞానాన్ని తొలగించి
మృత జీవితానికి
అమృతాన్నందించే
దివ్యౌషదం గురువే
అహర్నిశలు శ్రమించి
అద్భుత కళాకృతికి జీవం పోసే
అమరశిల్పి గురువే
ప్రైవేటీకరణ పునాదులపై
విద్యను పెట్టుబడిగ పెట్టి
నైతిక విలువల్లేని నాసిరకం నిర్మాణం చేపట్టి
లక్షలకు లక్షలార్జించి
కన్నవాళ్ళకు కడగండ్లు మిగిల్చే
బడా వ్యాపార భూతాల్ని తరిమికొట్టాలి
జాతి పరువు కాపాడే చదువును నిలబెట్టాలి
విలువలున్న చదువే జగతికి వెలుగు
విలువలు బోధించు గురువే
కలకాలం వెలుగు

## నచ్చిన పుస్తకం

# ఆశయాల బతుకుపుటల్లో అనుభవాల నెమలి కన్నులు




**- వాధూలస**

అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో మారుమూల ప్రాంతం ఖానాపూర్. అక్కడ పుట్టి పెరిగిన టి.సంపత్‌కుమార్ అంచెలంచెలుగా ఎదిగి అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగం చేస్తూ హస్తినాపురంలో స్థిరపడ్డారు. తన తొలి కథల సంపుటి 'లియోసా కథలు'తో పాఠకుల మనస్సును చూరగొన్న సంపత్‌కుమార్ దశాబ్దకాలం తర్వాత మలి సంపుటి 'పెన్నులు'-మshen-ఇంకా... ఇంకాతో మరొక్కసారి పాఠకుల ముందుకి తన అనుభవాలతో ఆశయాలను రంగరించి తీసుకొని వచ్చారు.

ఈ సంపుటిలో 'పెన్నులు'తో సహా పదకొండు కథలున్నాయి. ఇందులో పెన్నులు చాలా పెద్ద కథ. ఇది ఒక విలక్షణమైన కథాగుచ్ఛం. రచయితకు పెన్నంటే ప్రేమ. అది మనసులోని భావాలను కాగితం మీద పరచి పదిమందినీ పలకరిస్తుంది గనక. పెన్నుల సేకరణ ఈయన హాబీ. ఆ విధంగా అనేక పెన్నులు భద్రపరచుకొన్నారు. వృత్తిపరంగా ఆయన అనేక దేశాలు తిరిగినప్పుడు బస చేసిన హోటళ్ల ఆనవాళ్లుగా వున్న పెన్నుల్లోని ఐదు పెన్నుల నేపథ్యంలో కథ నడుస్తుంది. అందులో అంతర్లీనంగా పంచభూతాల ప్రమేయం కనిపిస్తుంది. అలవోకగా అల్లిన ఈ కథలో అనుభూతులు వెల్లివిరుస్తాయి. అనుభవాలు పాఠాలు చెబుతాయి. అద్భుతమైన జలపాతపు సొగసుల్ని చూపిస్తాయి. రగిలే రాజకీయ సంక్షోభాగ్ని దగ్గర నిలబెడ్తాయి. మనసు కలిసిన ప్రేమల మధురానుభూతుల్ని పంచుతాయి. పగుళ్లు వారిన భూమిలో పగిలిపోయిన జీవితాల వెతలను వెళ్లబోస్తాయి. ఆకాశాన్నంటిన ద్రవ్యోల్బణం తీరు తెన్నుల్ని వివరిస్తాయి. ఒకే కథలో ఇన్ని విశేషాలను చెప్పగల్గటం సంపత్‌కుమార్ ప్రత్యేకత. అంత ప్రాణప్రదంగా చూచుకునే పెన్నులు కథ ముగింపులో అతనిలో రేపిన అలజడిని వ్యక్తీకరించిన విధానం అతని సున్నితమనస్తత్వాన్ని ఆవిష్కరిస్తుంది.

ఇక మిగిలిన పది కథలు రచయిత ఆదర్శాలు, ఆశయాలు, అనుభవాలు పెనవేసుకున్న కబుర్ల గుబుర్లు. కథలన్నింటినీ దాదాపుగా కబుర్లు చెప్పినట్లుగా నడిపించి, తాను చెప్పదలచుకున్న విషయాలను పాఠకుల మనసుల్లో నింపుతాడు రచయిత. విసుగెత్తించే బావమరిది ఊతపదం ఉగ్రూతలూగించే వ్యాపార ప్రకటనకు ఉపయోగించిన వైనం "ఇంకా... ఇంకా..."

తాను అందలాలు ఎక్కినా తన తపన అంతా తాను పుట్టి పెరిగిన పల్లెజీవుల గురించే- స్వాతంత్ర్యానికి షష్టిపూర్తి జరిగినా, విజ్ఞానం వినువీధుల్లో విహరిస్తున్నా ఎదుగూ బొదుగూ లేని బడుగు జీవితాల గురించి అడుగడుగునా తల్లడిల్లుతాడు. అందరూ వెన్ను చరచుకోవలసిన కథ "చంద్రి.. 78000" మన వైద్య వ్యవస్థ, సామాజిక, రాజకీయ వ్యవస్థలు సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితిని కళ్లముందుంచుతారు రచయిత. కథ చదివితే గుండె భారమవక తప్పదు. ఆలోచింపజేసి కన్నులు విప్పుతుంది ఈ కథ.

ఎంత అరచి గీపెట్టినా, ఎన్ని చట్టాలు తెచ్చినా రూపుమాప లేకపోతున్న వరకట్నపు దోపిడీని అరికట్టాలంటే కొత్త దారులు వెదకాల్సిందే. అలా ఈ సమస్య పరిష్కారానికి కావలసిన మానసిక వికాసాన్నందిస్తారు మరో కథ 'దోపిడీ'లో.

'పల్లెటూరు మన భాగ్యసీమరా' అనుకునే రోజులు పోయి నగరాల వ్యాపార సంస్కృతిలో పల్లెసిరి మాసిపోతున్న దృశ్యాన్ని ఎగుమతి కథలో చూస్తాం.

ముఖ చిత్రం మీద శీర్షికలో భాగంగా వున్న మరో కథ 'మshen'- శీర్షికలో సూచించినట్లుగానే యంత్రసదృశమైన మగువ పరిస్థితిని, మగవాడి ఆభిజాత్యపు కోరల్లో ఇరుక్కుపోయిన దైన్యాన్ని వివరిస్తూనే, ఆ మగువ తెగువ చూపేందుకు మంత్రం చెపుతారు రచయిత ఈ కథలో.



# మస్తకానికి పుస్తకం

- కోటం చంద్రశేఖర్

అందరూ 'సెల్' మాటల చుట్టూ
అందరూ 'టీవీ' పాటల చుట్టూ
ఆధునిక కాలంలో మస్తకానికి
పుస్తకం అక్కర్లేదా?
ఎవరైనా హాల్లో కూర్చుంటే
టీపాయ్ మీద మ్యాగజైన్ చూస్తుంటే
ఒక ఆనందం
కాకపోతే
మొక్కుబడిగా తిప్పితే
దిక్కులు చూస్తూ తిప్పితే
కళ్ళలో నలుసుపడ్డ బాధ –
కనపడాల్సిన వ్యక్తి కలవకపోతే
కలవాల్సినవ్యక్తి కనబడకపోతే
దిగులుమొయిలుల స్తబ్ధహృదయాలయం
పుటలు తిరిగేసే నటనాలయం
అరచేతిలో నాటుకున్న పుష్పరాగం
చేతివ్రేళ్ళతో మీటుతున్న వీణసరాగం
అలభ్యాస్వాదన –
పేజీలు తిప్పుతూ క్షణం ఆగితే
అడ్వర్టైజ్‌మెంటో, అర్ధనగ్నతారో
మెరిసే బంగారామా ?
మనసుకు మురిసేదే సింగారమా ?
పుస్తకమంటే కొత్తదృష్టి, ఖడ్గసృష్టి
పుస్తకమంటే ఆత్మచైతన్యం, మేధోనైపుణ్యం
పుస్తకమంటే జనాత్మకత, సృజనాత్మకత
పుస్తకమంటే నేస్తం, సమస్తం
కళ్ళను వాల్చబడమూ
మెదళ్ళను కదల్చబడమూ
ఇప్పుడింకా కష్టమే కాబోలు
డ్రీమ్స్ డ్రైనేజిలో డైకొడితే
కలర్స్ కాల్వల్లో కాళ్ళిడితే
పుస్తకం చూసే చూపు
మిణుగురుల చెంతకా !
పుస్తకం చేసే గోడు
నూతిలోని గొంతుకా !
పెద్దబాలశిక్ష పఠించేకదా
పండితుడవై, పామరుడవై
పథనిర్దేశకుడవై–
గణితబోధిని చదివేకదా గగనంలోని తారకల్ని
లెక్కించే ఘనుడవై–
అక్షరాలు దిద్దకుంటే అరణ్యాలు దాటేవాడివా ?
పాఠాలు నేర్వకుంటే గుణపాఠాలు తెలిసేవా ?
క్యాలుక్లేటర్ మీద ఆడేవేళ్ళు
కంప్యూటర్ మీద నర్తించే కళ్ళు
నిన్ననడిచొచ్చినమెట్లేకదా పునాది
నేటి ప్రవాహంలో
పడిపోక కొట్టుకపోక నేనెందుకిలా
అక్షరంవాలితే ఘర్షణలు సంఘర్షణలు మాయమై
పదం పల్కరిస్తే బాధలు విభేదాలు మాటుమాయమై
వాక్యం పెనవేసుకుంటే వ్యథలు వధలు బహుదూరమై
కవిత్వం కరచాలనం చేస్తే కక్షలు శిక్షలు సుదూరమై...

---

నేటి తీవ్ర సమస్యల్లో ఒకటి ఎయిడ్స్ వ్యాధి. ఈ నేపథ్యంలో సాగిన కథ "అంకురం". దురదృష్టవశాత్తు ఆ వ్యాధి బారిన పడిన వాళ్లకు ఆత్మస్థైర్యాన్ని నూరిపోస్తుంది.

మరోవైపు మహిళా చైతన్యాన్ని కలిగిస్తున్న పొదుపు సంఘాల ప్రగతి బాటను ప్రస్తుతిస్తూ అభ్యుదయాన్ని అభినందిస్తాడు 'ఇంతింతై' కథలో.

క్వశ్చన్ మార్క్ కథ ఒకటుంది ఇందులో. కథలోని పాత్రలు సామాన్య మానవునికి మనుషులుగా కనిపించనివి.

కాయిదాల గుడిసెల్లో, సిమెంటు గొట్టాల్లో నివసించే అలగాజనం అని పిలువబడే వారి గురించి, వారి దీనస్థితిని వివరిస్తూ రాసిన కథ, రచయితకు గల సామాజిక స్పృహను తెల్పుతుంది. దారిద్ర్య రేఖ ఎగువ దిగువలు తెలియపరిచే 'రేఖ' మరో మంచి కథ.

డబ్బు సంపాదనకీ, దాంపత్యానికీ ముడిపడ్డ కథ "మనీ (మంగళ) సూత్రం'. పక్కదారి పట్టబోతున్న మగవాడిని మార్చుకునే ఆధునిక మహిళ మనో నిబ్బరం చాటి చెపుతోందీ కథ.

ఈ సంపుటిలోనే కథల గురించిన, కథానిలయం గురించిన, కథా రచయితను గురించిన వ్యాసాలు కూడా అనుబంధంలో ఉన్నాయి. అవి పాఠకుడిని రచయితకు దగ్గర చేస్తాయి.

కథలన్నింటిలోనూ రచయిత మనతో ఉంటూ మనకు కబుర్లు చెబుతాడు. మనను మాట్లాడిస్తాడు. మందలిస్తాడు. చురక పెడతాడు, చూపునేర్పుతాడు. కథ నిడివితో రాజీ పడక, కథను సమగ్రంగా పాఠకుడికి అందజేయటానికి రచయిత తనకున్న రచనా నైపుణ్యాన్ని పూర్తిగా వాడుకున్నారు. కథా సందర్భానికి అనువైన పదప్రయోగాలు చాలా గడుసుగా ఉపయోగిస్తారు ఈయన. తాను చూచిన దృశ్యాల్ని మన కన్నులతో చూచేట్లు చేయటంతో కృతకృత్యులయ్యారని చెప్పవచ్చు. అంతేగాక మనకు తెలియని విషయాలెన్నో తెలుసుకునే విధంగా కథలను రూపొందిస్తారు.

ముఖ్యంగా రచయిత తన ఆదర్శాలను, ఆశయాలను, అనుభవాలను తన కథల ద్వారా నేరుగా పాఠకులకు అందజేస్తారు.

దీనికి తోడు ఈ పుస్తక రూపశిల్పి తాళ్లపల్లి మురళీధర్ గౌడ్ పుస్తకాన్ని అందంగా, అచ్చుతప్పులు దొర్లకుండా, ఆకర్షణీయంగా తీసుకురావడంతో బంగారానికి తావి అబ్బినట్లుగా వుంది. ఏది ఏమైనా పుస్తకం చదివిన ప్రతివారికీ సంపత్ కుమార్ అతి సన్నిహితుడైనట్లుగా అనుభూతి కలుగుతుంది. డైరీలోని పేజీల్లా బుద్ధి పుట్టినప్పుడల్లా మళ్లీ మళ్లీ చదువుకొని భద్రపరచుకో దగిన మంచి పుస్తకం.

■

# కొత్త పుస్తకాలు




### గోపి కవిత్వం I

(1967-2009)

**వెల : 250/- పేజీలు : 349**

43 సంవత్సరాల గోపిగారి సమగ్ర కవిత్వాన్ని ఒక్క గొడుగు కిందకి తేవడం అంత సులభం కాదని నా అనుభవం వల్ల తెలిసింది. ఇటువంటి వారి పట్ల సమగ్రమనే మాట వర్తించదు. నిత్య చైతన్యంతో కవిత్వమే ఊపిరిగా బతికే గోపిగారు తమ బయోడేటాను ప్రతి సంవత్సరం మార్చుకోవలసి వుంటుందని నాకు తెలుసు. ఎందుకంటే కొత్త సంగతులను దానిలో చేర్చేది నేనే కాబట్టి.

**- అరుణ**

### గోపి కవిత్వం II

(1967-2009)

**వెల : 350/- పేజీలు : 483**

నానీల్లో నాలుగు పాదాల నియమాన్ని పాటించాను. వచన కవితల్లోలాగే ఈ విభజనకు హేతుబద్ధత ఏమీ లేదు. అయితే నిర్మాణం దృష్ట్యా వీటిలో ఒక పద్ధతిని గమనించవచ్చు. వీటిలో మూడొంతులకు పైగా నానీల్లో రెండేసి పాదాలకో భావాంశాన్ని (యూనిట్) గుర్తించవచ్చు. మొదటి రెండు పాదాల్లో ఒక భావాంశం, చివరి రెండు పాదాల్లో మరో భావాంశం ఉంటాయి. మొదటి దానికి రెండోది సమర్ధకంగా ఉంటుంది.

**- డా॥ గోపి**

### గోపి కవిత్వం III

**వెల : 250/- పేజీలు : 337**

ఈ కవితలు కాక ఓ యాత్రా చరిత్ర కూడా రాశాను. వీటిని దానిలో చేర్చకుండా విడిగా వేస్తున్నాను. అది బాహ్యంగా జరిగిన భావయాత్ర అయితే ఇది ఆంతరిక లోకాల్లోకి భావోద్వేగ యాత్ర. ఈ కవితల్ని బ్లైండ్ కవిత లనవచ్చునేమో. ప్రయోగమని అనను గాని ప్రయాణం మాత్రం అవును. లోపలికీ బయటికీ జరిగిన ప్రయాణం. అనుభూతి ప్రధానం.

**- డా॥ గోపి**

**ప్రతులకు : 040-27037585**

---




### చిలకలు వాలిన చెట్టు (కథలు)

**జి.వెంకటకృష్ణ**

**వెల : రూ. 50/- పేజీలు : 171**

**ప్రతులకు : 89850 34894**

ఈ కథల్లోని ముఖ్యమైన లక్షణ మేమిటంటే, రచయిత ఏ సమస్యను గురించి మాట్లాడినా, "ఇది ఇట్లాగే జరుగుతుంది" అనో, "దీనికి ఈ పరిష్కారం సిద్ధంగా వుంది" అనో కాకుండా, "ఇది నాకిట్లా అర్థమయింది" అని సున్నితంగా, స్నేహంగా చెప్పటం. తన కథలకు పటిష్టమైన వ్యూహాన్ని నిర్మించటంలో, శ్రద్ధగా శిల్పాన్ని చెక్కడంలో కంటే తన లోపలి ఆలోచనలకూ, అలజడులకూ, వ్యక్తీకరణను వెదుక్కోవటానికే అతనెక్కువగా తపన పడతాడన్పిస్తుంది.

**- కాత్యాయని**




### భారతీయ తత్వశాస్త్రంలో భావవాదం, భౌతికవాదం

**దేవీప్రసాద్ చటోపాధ్యాయ**

**సంక్షిప్త అనువాదం : తెలకపల్లి రవి**

**వెల : 60/- పేజీలు : 174**

**ప్రతులకు : 040-27608107**

ఈనాటి మన తాత్విక అవసరాల కోణం నుంచి మన తాత్విక సంప్రదాయాలను విశ్లేషించ డమే ఈ రచన ఉద్దేశ్యం. లౌకికతత్వం, హేతువాదం, శాస్త్రీయ దృష్టి అన్నవే నేటి ఆ అవసరాలు. ఈనాడు మనం దేన్నైతే ఎదుర్కొని పోరాడు తున్నామో దానికి వ్యతిరేకంగా పోరాడేం దుకు మన తాత్వికులలో ఒక భాగం అమూల్యమైన సూచనలు అందజేశారు. వాటిని మనం పూర్తి ఆమోదంతోనూ, జాతీయ గర్వంతోనూ పెంపొందించవచ్చు. భారతీయ తాత్విక సంప్రదాయాన్ని అర్థం చేసుకోవాలంటే సాధారణ సూత్రీకరణలను అధిగ మించాలి. తాత్విక దృక్పథంలో ఏది సజీవమో, ఏది నిర్జీవమో విచక్షణతో విడదీయాలి.

**- ప్రచురణకర్తలు**

---




ప్రపంచానికి ఉత్తేజమిచ్చిన ప్రసిద్ధ నవల

### కాకలు తీరిన యోధుడు

**నికొలాయ్ ఓస్ట్రోవ్‌స్కీ**

**వెల : రూ. 100/- పేజీలు : 286**

**ప్రతులకు : 040-27608107**

సోవియట్ సాహిత్యంలో నికొలాయ్ ఓస్ట్రోవ్‌స్కీ నవల 'కాకలు తీరిన యోధుడు'కు ప్రత్యేక స్థానం వుంది. ఈ పుస్తకం రాయడం ఒక్కటే కాదు. అసలు ఆయన రచన వ్యాసంగమే ఒక వీరకృత్యం. ప్రజా విముక్తి కోరే చైతన్యవంతులైన వారందరికీ నిరంతర ఉత్తేజం కాకలు తీరిన యోధుడు. నికొలాయ్ ఓస్ట్రోవ్‌స్కీ సాహసిక జీవితపు కథా రూపమైన ఈ నవలను ప్రసిద్ధ తెలుగు రచయిత **మహీధర రామమోహనరావు** అనువదించారు.

**- ప్రచురణకర్తలు**




### జీవన జ్వాల

**డాక్టర్ కోట్నీస్ అమరగాథ**

**కడియాల అమర సుందర్**

**వెల : రూ. 40/- పేజీలు : 124**

**ప్రతులకు : 040-27608107**

త్యాగనిరతికి, అకుంఠిత సేవా తత్పరతకు, సామ్రాజ్యవాద వ్యతిరేక స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం డాక్టర్ ద్వారకానాథ్ కోట్నీస్. చైనాపై జపాన్ సామ్రాజ్యవాదులు జరుపుతున్న దాడిలో క్షతగాత్రులైన సైనికులకు, పౌరులకు వైద్య సేవలందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆనాటి జాతీయ కాంగ్రెస్ ఇచ్చిన పిలుపుకు స్పందించి చైనా బయలుదేరిన వైద్య బృందంలో కోట్నీస్ చేరాడు. స్వంత ఆరోగ్యాన్ని ఏ మాత్రం లెక్కచేయకుండా అవధులులేని శ్రమ చేయడం వల్ల ఆయన ఆరోగ్యం క్షీణించి ఎపిలెప్సీ వ్యాధిగ్రస్తులయ్యారు. చివరకు ఆ వ్యాధితో ఆయన మరణించారు. అప్పటికి ఆయన వయస్సు కేవలం 32 సంవత్సరాలు. అలాంటి మహనీయుని శతజయంతి సందర్భంగా ఈ ప్రచురణ.

**- ప్రచురణకర్తలు**

# కొత్త పుస్తకాలు




## దుబ్బ చెలక (కథలు)

**ఎలకట్టె శంకరరావు**

**వెల : రూ. 50/- పేజీలు : 110**

**ప్రతులకు : 93463 59268**

స్వభావ రీత్యా శంకర్ వామపక్ష భావనావలంబి. సాహిత్య ప్రస్థానం ప్రారంభించి సుదీర్ఘకాలం కాకపోయినా చెప్పుకోదగిన మజిలీల్ని అధిగమించిండు. ఇటీవలి కాలపు వాదాలు ఏవీ తనకు తగినంత సంతృప్తిని ఇవ్వలేదనిపిస్తుంది. దేన్ని బలపరుస్తున్నట్లు కనిపించడు. అలాగని దేన్నీ విమర్శించడు. జీవితపు మూలాలకు దూరమై వేరు విడిచి సాముచేసే ఏ అతివాదాన్నీ శంకర్ సహించడు.

**- బోధనం నర్సిరెడ్డి**




రాగం పరాగమైన వేళ...వో

## ఊపిరి సంతకం

**కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి**

**వెల : 75/- పేజీలు : 111**

**ప్రతులకు : 99487 74243**

కొండ్రెడ్డి కవిత్వ ప్రస్థానం వివరణాత్మకమైన తాత్వికతలోకి అడుగుపెట్టింది. తత్వం సంక్షిప్తంగా ఉంటుందనుకుంటాం. కానీ దాని లోతుల్లోకి వెళ్లిన కవికి సున్నితమైన వాసనలను పసిగట్టే ప్రజ్ఞ వచ్చాక తత్వాన్నీ వివరంగా చెప్పకుండా ఉండలేడు. లేకపోతే ఒకే ప్రపంచాన్ని యిన్ని రకాలుగా ఎలా చూడగలుగుతాం? అయితే కొండ్రెడ్డి చూస్తున్న మనకు చూపిస్తున్న ప్రపంచం మనందరం చూస్తూ నిరామయంగా ఒప్పుకుంటున్నదే. కానీ కొండ్రెడ్డి తాత్విక వివరణలో మనం గమనించగలిగేదేంటంటే ఇలాంటి బాధామయ ప్రపంచాన్నీ ప్రేమించి దాన్లో ఓ అర్థాన్ని వెదకాలనే తప్ప దాన్నుంచి పారిపోవడమో లేదా స్వార్థపూరితమైన ఆధిపత్యధోరణిలో వక్రభాష్యాలు చెప్పమనో కాదు.

**- డా॥ విద్యాసాగర్ అంగళకుర్తి**



## మధుశాల (కవిత)

**పద్మభూషణ్ డా॥హరివంశరాయ్‌బచ్చన్**

**(హిందీ కావ్యానికి తెలుగు రూపం)**

**డా॥ దేవరాజు మహారాజు**

**వెల : రూ. 50/- పేజీలు : 62**

**ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్**

హరివంశ్‌రాయ్ 'మధుశాల' చదివాను. పొంగిపోయాను. ఎందుకంటే పైన చెప్పుకున్న వాటికంటే భిన్నంగా, ఒక లోతైన తాత్త్విక చింతనతో, నిగూఢమైన భావావేశంతో జలపాతంలా సాగిపోయిన 'మధుశాల' నన్నాకట్టుకుంది. దాన్ని తెలుగు సాహితీ మిత్రులతో పంచుకోవాలనిపించింది.

**- డా॥ దేవరాజు మహారాజు**




## ప్రతిపాటి కవితలు

**ప్రతిపాటి వెంకటేశ్వర్లు**

**వెల : రూ. 20/- పేజీలు : 72**

**ప్రతులకు : 040-27608107**

ఈ పుస్తకంలోని కవితల శీర్షికలు మన జీవితంలోని దాదాపు అన్ని పార్శ్వాలను స్పృశిస్తాయి, మానవాళికి కర్తవ్య నిర్దేశం చేస్తాయి. వయస్సును బట్టి, అనుభవాన్ని బట్టి నేర్చుకున్న అంశాలను పదిమందికి అందజేసే, ఉత్తేజపరిచే లక్షణం ఈ కవితలలో ఎల్లెడలా కనిపిస్తుంది.

**- మోతుకూరు నరహరి**



## యల్.రాన్.హబ్బర్డ్

## సంతోష మార్గం

**తెలుగు సేత : వాసిరెడ్డి భాస్కరరావు**

**వెల : 50/- పేజీలు : 90**

**ప్రతులకు : 0870-2431361**

ఈ పుస్తకంలోని నీతి నియమావళి కొత్తదేమీకాదు. అనేక పౌరాణిక గ్రంథాలలో, నీతి శతకాలలో చెప్పబడినవే. కాని అవి యిప్పుడు ఉపయోగంలో లేవు. పాఠశాలలో వాటిని గురించి చదువు చెప్పటం లేదు. ఈనాటి యువతకు ఆయా విషయాలు తెలియవు. కనుక మరొకసారి చెపితే బాగుంటుందని భావించాను. హబర్డ్ పుస్తకాలు చదవగానే చాలా ఆకర్షణీయంగా వుంటాయి. కొన్నింటిని సారాంశ రూపంలోనైనా తెలుగు పాఠకులకు పరిచయం చేయాలనుకున్న ఫలితమే ఈ పుస్తకం

**- వాసిరెడ్డి భాస్కరరావు**




## తలారి తీర్పు (నాటికల సంపుటి)

**విడదల సాంబశివరావు**

**వెల : రూ. 60/- పేజీలు : 80**

**ప్రతులకు : 040-27608107**

ప్రజలకు, ముఖ్యంగా సామాన్యులకు తెలియని కొత్త విషయాలు చెప్తూ రసం పుట్టించగలగాలి. ఆ అగ్ని పరీక్షను ఎదుర్కొని శ్రీ సాంబశివరావు ఈ నాటిక రచన సాగించారు. కథను ఓవర్‌టోన్స్ లేకుండా – రస ప్రధానంగా రచించారు. అందుకు అభినందిస్తున్నాను. ఇలాంటి నాటికలు రాయడానికి సమాజం పట్ల అంకితభావం కావాలి. నా ప్రజలు అనే ఆర్తి కావాలి. అది సాంబశివరావులో పుష్కలంగా ఉంది.

**- ఆకెళ్ల**

## కవిత

# పవనం

**- వి. సూర్యారావు**

ఆకాశంలో
సూర్యునిలా
ఆలోచన వెలగాలి -

రగిలిన
నిప్పులా
ఆవేదన మండాలి-



కొలిమిన
కాలిన చువ్వలా
నిర్దిష్టత వుండాలి-

అపుడు లక్ష్యం
వెలుతురు గమనంలో...

---



# నానీలు

**- భుజంగరావు కంచరాన**

బ్యారెల్ చమురుకు
మార్కెట్ ధర లభ్యం
రైత్వారీ ఉత్పత్తులకు
గిట్టుబాటే మృగ్యం

మేఘాల్ని
విమానాల్లో ఎక్కించి తెస్తాం
మేఘ మథనం
ఒక బడాయి

నగరాల్ని
సుందరీకరిస్తున్నారు
మురికి వాడల్ని
శివార్లకు తరిమి

గుండెల్లో ఎండ
కళ్ళల్లో వాన
అదును చిక్కక
ఆరుగాలం కరువు సేద్యం

కుంభకర్ణులు
సాగునీటి ప్రాజెక్టులు
ఎంతకూ
కళ్ళు తెరవ్వు

పంట పొలాల్లో అగ్గి
పల్లె నెత్తిన బుగ్గి
థర్మల్ ప్లాంట్ భయం
సౌర విద్యుత్ నయం

నీ రాజకీయంతో
రైతు ఇల్లు గుల్ల
వానపామే నయం
కాస్తయినా సాయం

సమ్మె చేస్తున్నారు
ప్రభుత్వోద్యోగులు
జీతాల కోసం కాదు
సమ్మె హక్కు కోసం

కొడవలికి
చాలా మంది భయపడతారు
కొడవలంటే
ప్రశ్న కదా!

సంక్షేమానికి కోత
సంక్షోభానికి
తెరతీత
ఆర్థిక సంస్కరణలు

మాట్లాడకుండా
ప్రపంచ దేశాలన్నింటినీ
శాసించగలదు
డాలర్ భాష

---

# "అంతిమయాత్ర"

**- నల్లా త్రినాథ దుర్గా శ్రీనివాస్**

అడుగులు తడబడుతున్నాయ్
అనుభవంతో నిండిన
సముద్రపు అలల తాకిడితో
జీవితపు మలిసంధ్య
ప్రొద్దు గ్రుంకే వేళ
కోటగోడల మెట్లు
కూలుతున్నాయ్ !!



అవిశ్రాంత పోరాటంలో
అలసిన మనసుకు

ఆలంబన కరువై
వణుకుతున్నాయ్ !!
రేపటి ఉషోదయానికి
స్వాగతం పలుకుతూ....
ఒంటరి ఓ యోధుడి
అంతిమ యాత్రకై...
ఆకాశాన వేగుచుక్క
ఎదురుచూస్తోంది నిర్వేదంగా !!

## నివాళి

# ప్రజా కవి 'అల'

ప్రముఖ ప్రజా కవి, గాయకుడు అయినంపూడి లక్ష్మణరాజు (అల) విజయనగరం జిల్లా 'అన్నమరాజుపేట'లో నవంబర్ 23 మధ్యాహ్నం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా కాన్సర్‌తో బాధపడుతున్నారు. వక్తగా, విమర్శకుడిగా, కవిగా బహుముఖ కోణాలలో తనదైన ముద్ర వేసుకున్నారు. 'నిప్పుల వాగు', 'మట్టిచెట్టు – పిట్ట భజనిక' అనే దీర్ఘ కవితలు అలల సవ్వడి (కవితా సంపుటి), పుస్తకాలతో కవిగా సుదీర్ఘ ప్రయాణం సాగించి తనువు చాలించారు. గాయకుడిగా పలు ప్రజా సమస్యలను గానం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. సమాజంలో పరివర్తన, సామాజిక అభ్యుదయాన్ని కాంక్షించే నిర్మలమైన వ్యక్తిగా గుర్తింపు పొందారు.

రామభద్రరాజు, పాపయ్యమ్మగార్లకు 17 ఫిబ్రవరి, 1959న జన్మించారు. స్వగ్రామం నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి పోస్టు ఎంబేరయ్య గుళ్లు.

ఇంటి ప్రక్కనే తను గురువుగారైన 'లక్ష్మీ నరసింహం' పేరిట 'అన్నమరాజు పేట"లో పాఠశాలను స్థాపించి విద్యాబోధన కొనసాగిస్తూ వచ్చారు. చాలామంది పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది ప్రయోజకుల్ని చేశారు. జనసాహితిలో చాలాకాలం చురుగ్గా పాల్గొన్న అల, గత కొన్నాళ్ళుగా విజయనగరం జిల్లా సాహితీ స్రవంతి కార్యక్రమాల్లో క్రియాశీల పాత్ర వహించారు.

చివరి వరకు పేద ప్రజల పక్షాన తన కలాన్ని, గళాన్ని వినిపించారు. అందుకు వీరి భార్య కుసుమ, పిల్లలు సౌజన్య, సృజన తోడ్పాటును అందించారు. వారి మరణానికి "సాహితీ స్రవంతి" తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేయుచున్నది.

**– చీకటి దివాకర్**

**కన్వీనర్ సాహితీ స్రవంతి, విజయనగరం జిల్లా**

## నిబద్ధ కవి 'అల'

విజయనగరం జిల్లా అన్నంరాజు పేటకు చెందిన కవి 'అల' సామాజిక మార్పు కోసం తపించిన నిబద్ధ రచయిత. నిరంతరం రచనలు చేస్తూనే సాహిత్య కార్యక్రమాల నిర్వహణలో క్రియాశీలంగా పాల్గొనేవారు. సాహితీ స్రవంతి నిర్వహించిన రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి సాహిత్య కార్యక్రమాలలో 'అల' చురుగ్గా పాల్గొన్నారు.

'అల' హఠాన్మరణం పట్ల సాహితీ స్రవంతి విచారం వ్యక్తం చేస్తుంది. సామాజిక స్ఫూర్తితో కవిత్వం రాసిన అల రచయితలకు ప్రేరణగా ఉంటారు. అల మృతికి మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం.

**– తెలకపల్లి రవి**

**సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు**



**2006లో విజయనగరం జిల్లాలో జరిగిన సాహిత్యశాలలో ప్రసంగిస్తున్న 'అల'**

## 'అల' తలపుల్లో

### - మొయిద శ్రీనివాసరావు

*సాహితీ సంద్రాన తానో ఎగసిన 'అల'*
*అక్షరాలను ఆయుధాలుగా మార్చిన అగ్ని కీల*
*స్తబ్దత మరణమంటూ ముందుకుసాగే కవితా ప్రవాహ జ్వాల*
*ఆస్వాదిస్తున్న తరుణంలో అర్ధాతరంగా చెదిరిన కల*
*మొదటిసారి... ముఖమున తొణికే*
*పాల తరగలాంటి నవ్వును చూసి*
*భావ కవేమోనని భ్రమపడ్డాను*
*తన హృదయాంతరాన జనించే 'అలల సవ్వడి'తో*
*విప్లవ భావావేశాన్ని అర్థం చేసుకున్నాను*
*నిట్టూర్పు నిరసనేనని తెలుసుకున్నాను*
*ఆకలి మంటలలో బహుళ సంస్థలు దహించుకుపోవాలన్నావ్*
*మీడియా శిథిల చీకటి గోడల్ని చీల్చుకుంటూ...*
*మనిషిగా సమూహం వైపు సాగిపొమ్మన్నావ్*
*గుంపంటే గొర్రెల మందకాదని*
*పరమాణువంటూ మమ్మల్ని అక్షర యుద్ధానికి సిద్ధం చేసి*
*మధ్యలోనే వదిలేశావ్*
*పోరాటాల వెలుతురు వెల్లువలో*
*మరో ప్రపంచాన్ని కలగన్నావ్*
*వంగిన మా వెన్నెముకలను కవిత్వపు కీడు బడితెపై*
*వజ్రాయుధాలుగా సానపెట్టేదెవరు?*
*పుస్తకమై పునర్జన్మిస్తానన్నావ్*
*నేలను వదులుకోలేని నీవు*
*పోరు మొక్కై పుట్టుకొస్తానని మాటిచ్చావ్*
*మమ్మల్ని కార్యోన్ముఖుల్ని చేస్తూ*
*నీ కవితా కరములైనా, నిత్యం*
*మా తలపుల తలుపుల్ని తడతాయని ఆశిస్తూ....!*

## నివేదిక

# మెరుగు

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 'మెరుగు' కార్యక్రమం అక్టోబర్ 31న గురజాడ స్వగృహంలో జరిగింది. చీకటి దివాకర్ మాట్లాడుతూ ప్రకృతితో చేసిన పోరాటమే మానవావిర్భావం. మంచైనా, చెడైనా చేస్తున్నాడు. హోరున నిరంతరాయంగా కురుస్తున్న వర్షంలో కూడా 26 మంది సాహితీ మిత్రులు రావడం హర్షించదగిన విషయంగా చెప్పారు. ఒబామా భారత్ పర్యటన వలన మనకు కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ, సమకాలీన సామాజికాంశాలు సాహితీ వస్తువులుగా స్వీకరించాలని కోరారు.

డా॥ యు.ఎ. నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యను ఏ రూపంలో గ్రహించినా జ్ఞానసముపార్జనకు దోహదపడే విధంగా ఉండాలని సూచించారు. విద్య ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళితే ఏం అనర్థాలు జరుగుతాయో ఆనాడే గురజాడ చెప్పారన్నారు. ఎంతటి రాయైనా సమ్మెట పోటు వేస్తే బద్దలవక తప్పదన్నారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతైనా వుందన్నారు.

డా॥ రామసూరి మాట్లాడుతూ వ్యక్తి యొక్క కృషిని అధ్యయనం చేయాలి. నిరంతర ప్రణాళిక, పరిశోధన అవసరమన్నారు. అప్పారావుగారి సాహిత్య సృజన అధ్యయనం మనకు అత్యంతావశ్యకం అని అన్నారు.

ప్రబంధాల్లో ఒక్కొక్క కవి ఒక్కొక్క నాయికను ఏడిపిస్తే, ఇతను వాళ్ళకు వ్యతిరేకంగా నవ్వించారు. ఆ నవ్వులో ఒక సందేశాన్ని తెలియజేశాడు. మిర్యాల కృష్ణారావు సమాజంలో జరుగుతున్నటువంటి వాటిపై తన స్పందనను తెలియజేశారు. సత్యనారాయణ మెరుగు వలన మెరుగైన రచనలు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎంటివి లక్ష్మణరావు అందరికి స్పృహ ఉంటుంది. దానిని సరైన మార్గంలో పెట్టినపుడే సమాజాభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కథా రచయిత రమేష్ మాట్లాడుతూ సామాజిక స్పృహ, జ్ఞానం సమాజం నుండే పుడుతుందని వివరించారు. ప్రసన్నలక్ష్మి మహిళా బిల్లు, ఏమిటీ వివక్ష అనే కవితలు చదివి వినిపించగా, బాలు ప్రేమోన్మాదం, హృషీకేశం, మైక్రోఫైనాన్స్, శ్యామల నిత్యం శుభోదయాలే, రాజా వర్షం, పి. లక్ష్మణరావు 'సంభాషణ' అనే కవితలు వినిపించారు. అయ్యగారి శ్రీనివాస్ పరుగు – పరుగు కథను, సిహెచ్. సింహాచలం పాడనా తెలుగు పాట అనే ఈలపాటను, జె.వి. రమణమూర్తి శుభోదయంలో స్వాగతమంటూ గానం చేశారు. పాపయ్య హరికథా గానం, చంద్రిక నా ప్రాణం – ఈ గానం అనే పాటలను, బేబి శ్రేయ కోటి రూపాయల కట్నమిచ్చి అనే జానపద గీతాన్ని ఆలపించారు.

# భావశిల్పి రవీంద్రుడు

43వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నవంబర్ 15న రవీంద్రనాథ్ ఠాగూర్ 150వ జయంతోత్సవం గురజాడ కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. ఈ సభకు ముఖ్య వక్తగా విచ్చేసిన ఆర్.కె. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఇ. ప్రమోదగారు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి. సామాజిక సద్భావనతో మానవ లోకానికి తనదైన శైలితో ప్రజల్ని చైతన్యవంతుల్ని




చేశారన్నారు. మానవతావాదిగా, భావశిల్పిగా మనకు కన్పిస్తాడన్నారు. కవి సమాజం నుండే పుడతాడు. కవికి సామాజిక బాధ్యత ఉందన్నారు. మూడువేలకు పైగా చిత్రాలను 10 సంవత్సరాలలో వేసి జర్మనీలో ప్రదర్శించారన్నారు. చిత్రాల ద్వారా భావవ్యక్తీకరణ చేసిన గొప్ప వ్యక్తిగా కొనియాడారు. మానవుడు నిత్య విద్యార్థి. విద్య అంటే చదువే కాదు. విద్య అనేది మనయొక్క సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేస్తాయన్నారు. మనిషిని ప్రభావితం చేసే ఏ అంశమైనా విద్యే అని అన్నారు. గాంధీజీని మహాత్మా అని మొదటిగా ఠాగూరే పిలిచారన్నారు. శాంతినికేతన్, శ్రీనికేతన్, విశ్వభారతి వంటి విద్యాసంస్థలు స్థాపించారు. మృత్యువు వస్తే నాకు భయం లేదు నాకు విశ్వభారతి వుంది అని ధీమా వ్యక్తం చేశారన్నారు. కాబూలీవాలా ప్రతి ఒక్కరు చదవవల్సినదిగా సూచించారు. గ్రంథాలయ అధ్యక్షులు రాంగలి పోతన్నగారు గ్రంథాలయాలకు పాఠకులే దేవుళ్ళన్నారు.

సాహితీ స్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్ మాట్లాడుతూ ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో / ఎక్కడ మనుషులు తలెత్తుకు తిరుగుతారో / ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో / ఆ స్వేచ్ఛా స్వర్గానికి, తండ్రీ నా దేశాన్ని మేల్కొలుపు అని రవీంద్రుడు చెప్పాడన్నారు. రెండు దేశాలకు (భారత్, బంగ్లాదేశ్) జాతీయ గీతాలను అందించిన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు. సాంస్కృతిక రంగమే కాకుండా అనేక రంగాల్లో తన ప్రతిభను ప్రదర్శించారు. గిడుగు, గురజాడకు వ్యవహారిక భాషలో మార్గదర్శకుడయ్యారన్నారు. ఓయ్ పూజారి నీ పూజలేంటి? నీవు వెదికే ఈశ్వరుడు ఎక్కడో లేదు శ్రమజీవిలోనే ఉన్నాడని, వృత్తుల్లో ఉన్నటువంటి కష్టజీవుల్లో వున్నాడని, శ్రమలో దేవుడిని చూడమన్నారని అన్నారు. విద్యా విధానం మారాలని, యువతలో మార్పు రావాలని కాంక్షించారన్నారు. శ్రీశ్రీకి విప్లవం, చలానికి స్త్రీ, ఫైజ్ అహ్మద్ ఫైజ్‌కి ప్రవాసాలు – ప్రేయసి కన్నీళ్ళు, గోర్కికి చెమటా – నెత్తురూ, మయకోవ్‌స్కీకి సామ్యవాదమూ, లెనిన్, నెరుదాకి ఆకాశమంత ఆశ – దాని ఆకాంక్ష, బ్రెక్టికి వైరుధ్యాలు ఒక్కొక్కరికి ఒక్కొక్కటి సాధ్యమని, రవీంద్రుడికి ప్రకృతి, ప్రేమ అని అన్నారు. ఠాగూర్ భావవాదం నుండి పరిణామం చెంది చివరకు మతమౌఢ్యాన్ని నిరసిస్తూ గోరా వంటి నవలలు రాశారన్నారు. 35 దేశాలు తిరిగిన గొప్ప యాత్రికుడని, ఇతని యొక్క అపారమైన సాహిత్యాన్ని అందరూ అధ్యయనం చేయాలని కోరారు. రోహిణి "ఇదే ఇదే నా దేశం" అనే గీతాన్ని ఆలపించారు. ప్రారంభ గీతంగా బేబి శ్రేయ "జననీ భారతి జోహారు" గీతాన్ని వినిపించింది. సభకు కృష్ణారావుగారు స్వాగతం పలుకగా ఠాగూర్ రచన జనగణమనతో సభ ముగిసింది.

•

# ఇసిఐఎల్ సాహితీ స్రవంతి కృషి అభినందనీయం

## నీరాజనం పుస్తకావిష్కరణలో వక్తలు



ఇసిఐఎల్ ఉద్యోగుల రచనల సంకలనం
'నీరాజనం' పుస్తకావిష్కరణ దృశ్యం

ఇసిఐఎల్ సాహితీ స్రవంతి కృషి అభినందనీయమని 'నీరాజనం' పుస్తకావిష్కరణలో వక్తలు కొనియాడారు. డాక్టర్ ఎఎస్‌రావు ఏడో వర్ధంతి సందర్భంగా ఎఎస్‌రావునగర్‌లోని సీనియర్ సిటిజన్స్ ప్రాంగణంలో ఇసిఐఎల్ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న టెక్నికల్ ఎన్ఎస్ఎస్ ప్రసాదరావు, ప్రముఖ కవి సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు హిమజ్వాల 'నీరాజనం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఎఎస్‌రావు ఆశయాలను నాలుగు సంవత్సరాలుగా ఇసిఐఎల్ కవులు, రచయితలు ముందుకు తీసుకెళుతున్నారన్నారు. ఇందుకు కృషిచేస్తోన్న సాహితీ స్రవంతి కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. హిమజ్వాల మాట్లాడుతూ కవిత్వం, రచనలు బుద్ధిజీవులకే పరిమితం కాకుండా కార్మికులు సృష్టిస్తున్న కవిత్వం, రచనలు కూడా మంచి కవిత్వమే అన్నారు. ఎఎస్‌రావు ఆదర్శంగా చేస్తున్న ఈ కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఎఎస్‌రావు నగర్ సొసైటీ అధ్యక్షులు ఆర్‌వైఎన్ శర్మ, కార్యదర్శి కెకెబిఎ శర్మ సాహితీ స్రవంతి కృషిని కొనియాడారు. సాహితీ స్రవంతి ఇసిఐఎల్ కన్వీనర్ గిన్ని ఆనందరావు సాహిత్య కృషిని వివరించారు. సాహితీ స్రవంతి నగర కార్యదర్శి జి.యాదగిరిరావు సభకు అధ్యక్షత వహించారు. కార్యవర్గ సభ్యులు తిరునగిరి మురళి అతిథులను ఆహ్వానించగా, గణపతిరాజు, కృష్ణంరాజు వందన సమర్పణ చేశారు. సభానంతరం 'బద్రుల పలహారశాల' నాటికను ప్రదర్శించారు.

# ధీరోదాత్తుడు జాషువా



అక్టోబర్ 30న కల్వకుర్తిలో జరిగిన జాషువా వర్ధంతి సభ

"దళితులు, అణచివేయబడుతున్న వాళ్ళు రాజ్యాధికారం చేపట్టినప్పుడే జాషువా రచనలకు సార్థకత చేకూరుతుందని అందుకోసం కేవలం దళితులు మాత్రమే పోరాటం చేస్తే సరిపోదని, సమాజంలో అన్ని పీడిత, శ్రామిక వర్గాలు కలిసి పోరాటం చేయాలని ప్రజాకవి హిమజ్వాల అన్నారు. మహబూబ్‌నగర్‌జిల్లా కల్వకుర్తి సాహితీ స్రవంతి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 30వ తేదీన కల్వకుర్తిలో జాషువా సాహిత్య సభ జరిగింది. సాహితీ స్రవంతి కల్వకుర్తి డివిజన్ కమిటీ అధ్యక్షులు వెల్దండ రుక్మాంగదరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కవి వల్లభాపురం జనార్ధన మరో వక్తగా హాజరై ప్రసంగిస్తూ, జాషువా చాలా సరళశైలిలో పద్యాలు రాశాడని చాతుర్వర్ణ వ్యవస్థని నిరసించి, నిందించాడని, తనను కాదన్న, ఛీకొట్టిన అగ్రవర్ణ పండితులతోనే గౌరవాలు పొంది, తెలుగు సాహిత్యంలో ధీరోదాత్త కవిగా నిలిచాడన్నారు. సభాధ్యక్షులు వెల్దండ రుక్మాంగదరెడ్డి పాడిన పద్యాలు ఆలోచింపజేశాయి. ఈ సభలోనే సాహితీ స్రవంతి కల్వకుర్తి డివిజన్ కమిటీ గౌరవాధ్యక్షులు భుజంగరావ్ లైబ్రరీకై రు.5000/-లు విరాళం ప్రకటించి, స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఇదే సభలో పాల్గొన్న సాహితీస్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య, లౌకిక విలువలకై సాహితీ స్రవంతి కృషి చేస్తుందని, ప్రస్తుత పెట్టుబడిదారీ ప్రపంచీకరణ సందర్భంలో ఒక ప్రత్యామ్నాయ సంస్కృతికై కృషి చేస్తుందనీ, కావున అందరూ ఈ సంస్థకు అండదండలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సభకి సాహితీ స్రవంతి డివిజన్ కమిటీ ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్ ఆహ్వానం పలుకగా కోశాధికారి వందన సమర్పణ చేశారు.

# సమాజంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

## రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం జనార్ధన్



సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లభాపురం జనార్ధన్

నేటి విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరిస్తూ భాగస్వామ్యం పంచుకోవాలని సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం జనార్ధన్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా సాహితీ స్రవంతి వనపర్తిశాఖ స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూలులో వనపర్తి శాఖ అధ్యక్షులు డి. కృష్ణయ్య ఆధ్వర్యంలో బాలల దినోత్సవ కార్యక్రమం జరుపుకుంది. ఈ సందర్భంగా "తెలుగులో బాల సాహిత్యం" అనే అంశంపై వల్లభాపురం మాట్లాడుతూ చిన్నయసూరి, రవీంధ్రనాద్ ఠాగూర్, శ్రీరంగం శ్రీనివాసరావుల బాలసాహిత్యాన్ని పిల్లలకు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బాల బాలికలపట్ల ఓర్పుతో బాలసాహిత్యాన్ని కూడా వెలుగులోకి తేవాలని, అప్పుడే విద్యార్థులకు ఉపాధ్యాయులకు మధ్య సంబంధం మెరుగుపడుతుందని అన్నారు. సాహితీ స్రవంతి మహబూబ్‌నగర్ జిల్లా సభ్యులు విరజాజిరాంరెడ్డి "బాల కార్మిక సమస్య – వర్ధమాన పరిస్థితులు" అనే అంశంపై మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు బాల బాలికలను పాఠశాలలకు తప్పనిసరిగా పంపించాలని గతంలో శివకాశిలో జరిగిన బాణాసంచా ప్రేలుడులో 300 మంది బాలబాలికలు మృతి చెందిన సంఘటనను తెలియజేశారు. ప్రస్తుతం తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు తమ వృత్తులలో కొనసాగాలన్న నిశ్చయంతో వున్నారని, వారిని విద్యాప్రాముఖ్యత గురించి విస్తృత ప్రచారం కొనసాగిస్తే నూతన విద్యార్థితరం ఆవిర్భవిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా పేదరికం. అవిద్య లాంటివి వున్నాయని అంగన్‌వాడి, కస్తూరిబా లాంటి సంస్థలను మెరుగుపరిస్తే కొంత ఫలితం సాధించవచ్చని అన్నారు. కుల వ్యతిరేక పోరాట సంఘం వనపర్తి డివిజన్ అధ్యక్షులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ "హోటళ్ళు, కర్మాగారాలు, పొలాల్లో బాల బాలికల బాల్యం గడిచిపోతుందని, స్వాతంత్ర్యం లభించి ఇన్ని సంవత్సరాలైనా బాలబాలికల హక్కులు గురించి మాట్లాడుతున్నారే గాని అమలు పరచడంలో అధికారులు విఫలమవుతున్నారని ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కె. కుర్మన్న మాట్లాడుతూ నేటి సమాజంలో బాల బాలికల పట్ల జరుగుతున్న రాక్షసకృత్యాలు. దాని ద్వారా వ్యవస్థ ఎలా మారుతుందో వివరిస్తూ జరిగే పరిణామాలను అవగాహన చేసుకుంటూ లోకాన్ని అర్థం చేసుకోవాలని చెడుపట్ల జాగ్రత్త వహిస్తూ మహాత్ముల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వనపర్తి స్రవంతి సభ్యుడు సత్య నారాయణ స్వాగతం పలుకగా రేలారేలారే గాయకుడు శివలింగం, రవి ప్రసాద్‌గౌడ్ పాడిన పాటలు బాల బాలికలను ఆకట్టుకున్నాయి. శ్రీమతి లలితమ్మ డా॥ నాయకంటి నరసింహశర్మ, తెలంగాణ జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు బాబుగౌడ్, ఎస్.శాంతన్న, ఎన్. వెంకట రెడ్డి, భీమయ్య జానీ శంకర్, రాములు తదితర సాహితీ మిత్రులు పాల్గొ న్నారు. సాహితీ స్రవంతి కోశాధికారి వెంకటేశ్ వందన సమర్పణ చేశారు.


గుంటూరులో పులుపుల వెంకటశివయ్య సాహితీ సత్కారాన్ని స్వాతంత్ర సమరయోధులు ఏటుకూరి కృష్ణమూర్తికి అందజేస్తున్న విశాలాంధ్ర సంపాదకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు వేదికపై అరసం రాష్ట్ర అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షురాలు డా॥ కనపర్తి స్వర్ణలత


43వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో పద సాహిత్య పరిషత్ సంస్థ నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రసంగిస్తూ స్వీయ కవిత చదివిన తంగిరాల చక్రవర్తి. చిత్రంలో డా॥ గండ్లూరి దత్తాత్రేయశర్మ, డా॥ శరత్ జ్యోత్స్నా రాణి, రుద్రరాజు పద్మరాజు ఎంఎల్‌సి., త్రినాథ్‌రావు, శంకర్‌రెడ్డి, దాసరి వెంకట రమణ, డా॥ మంగళగిరి ప్రమీలాదేవి

## డైరీ

# అభ్యుదయ సాహిత్యానికి స్ఫూర్తినిచ్చిన అక్టోబర్ విప్లవం




తెలుగు సాహిత్యంపైనే కాకుండా అనేక భాషలు, సాహిత్యాలపైనా అక్టోబర్ విప్లవ ప్రభావం పడిందని వక్తలు అభిప్రాయపడ్డారు. సుందరయ్య వికాసవేదిక, సాహితీ స్రవంతి సంయుక్తాధ్వర్యంలో 'తెలుగు సాహిత్యంపై అక్టోబర్ విప్లవ ప్రభావం' అనే అంశంపై నవంబర్ 21వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గోష్టి జరిగింది. ఈ సదస్సుకు సాహితీ స్రవంతి నగర కార్యదర్శి జి.యాదగిరిరావు అధ్యక్షత వహించారు. అక్టోబర్ విప్లవం వివిధ భాషలను ప్రభావితం చేసిందని, ప్రజానీకంలో చైతన్యం కలిగిందని చెప్పారు. అభ్యుదయ సాహిత్యానికి అక్టోబర్ విప్లవం స్ఫూర్తిని, ఉత్తేజాన్నిచ్చిందని తెలిపారు. స్వాతంత్ర్యం, స్వేచ్ఛా సమానత్వాల కోసం పోరాడే ప్రతి దేశాన్నీ ప్రభావితం చేసిందన్నారు. జాతీయోద్యమానికి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని అన్నారు. జాతీయోద్యమ నాయకులు మహాత్మాగాంధీ, బాలగంగాధర్ తిలక్ వంటి వారిని ప్రభావితం చేసిందని హిమజ్వాల అన్నారు. గోష్టినుద్దేశించి ప్రజాశక్తి సంపాదకులు ఎస్.వినయ్‌కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ విప్లవం సామాన్యులనూ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలనూ ప్రభావితం చేసిందని చెప్పారు. ప్రజలకు అర్థం కాని భాషలో వారికి ఉపయోగపడని సాహిత్య ధోరణిని అక్టోబర్ విప్లవం మార్చివేసిందన్నారు. అందరికి అర్థమయ్యే రీతిలో, ప్రజలకు ప్రయోజనం కలిగే విధంగా సాహిత్యం రావడానికి సోవియట్ వివిధ రంగాల్లో సాధించిన విజయాలు ఊపునిచ్చాయన్నారు. సాధారణ మనిషినీ, చదువురాని వారినీ చదువుకునేలా చేసింది స్ఫూర్తి, ఉత్తేజాన్నిచ్చింది అక్టోబర్ విప్లవమేనని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటం అద్భుతమైన ప్రజాసాహిత్యాన్ని సృష్టించిందన్నారు. తెలంగాణ పోరాటానికి స్ఫూర్తినిచ్చింది అక్టోబర్ విప్లవమేనని గుర్తుచేశారు. సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు హిమజ్వాల మాట్లాడుతూ అక్టోబర్ విప్లవం గురించి మాట్లాడుకోవడమంటే ప్రపంచ పరిణామం గురించి, నాగరికత, సంస్కృతి, శ్రమజీవుల గురించి మాట్లాడుకోవడమేనని చెప్పారు. అక్టోబర్ విప్లవం వచ్చిన తర్వాతే సామాన్యునికీ గుర్తింపు వచ్చిందన్నారు. స్వేచ్ఛా, సమానత్వం, స్వాతంత్ర్యం కోసం నడిచిన ప్రతి ఉద్యమంపైనా అక్టోబర్ విప్లవ ప్రభావం పడిందన్నారు. అదే అక్టోబర్ విప్లవానికున్న ఘనత అని చెప్పారు. అక్టోబర్ విప్లవంపై వ్యతిరేకత ఉన్నవారు సోవియట్ యూనియన్‌లో ఉన్న వాస్తవ పరిస్థితులను చూసి అభిప్రాయాలు మార్చుకున్న ఘటనలున్నాయని చెప్పారు.

ఈ సదస్సులో సాహితీ స్రవంతి నాయకులు తంగిరాల చక్రవర్తి, లక్ష్మయ్య, పొత్తూరి సుబ్బారావు, నరసింహామూర్తి, కిశోర్, జావెద్ తదితరులు కవితాగానం చేశారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం కార్యదర్శి వై.సిద్ధయ్య, సుందరయ్య వికాసవేదిక కన్వీనర్ హౌరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నవంబర్ 14న అరసం రాష్ట్ర అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ రచించిన "నూరేళ్ళ పులుపుల" గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విశాలాంధ్ర సంపాదకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు, వేదికపై రచయిత, అరసం జిల్లా అధ్యక్షులు డా॥ కనపర్తి స్వర్ణలత, కథా సంపుటి రచయిత వల్లూరు శివప్రసాద్



నెల్లూరు తిక్కన రచయితల సంఘం ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా జరిగిన కవి సమ్మేళన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తున్న ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు ఆచార్య ఆదిత్య, ప్రక్కన కుట్టి లతీఫ్, తిక్కన రచయితల సంఘం అధ్యక్షులు కె. మురళీ మోహన్‌రాజు, సర్వేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత సర్వేపల్లి రామ్మూర్తి తదితరులు

# 'కథా రచన'కు ప్రోత్సాహం




మన లైబ్రరీ మరియు సాహితీ స్రవంతి జహీరాబాద్ కమిటీల ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కథా రచనల పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదాన సభ నవంబర్ 23వ తేదీన ఆర్.టి.సి. బస్‌స్టాండ్ ప్రక్కన మన లైబ్రరీ వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి ఐ. ప్రతాప్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ కవి హిమజ్వాల పాల్గొని ప్రసంగించారు. పాఠశాలలంటే నేడు విద్యార్థులకు జైళ్ళుగా మారాయన్నారు. చదువంటే మార్కుల కోసమే కాదన్నారు. తల్లిదండ్రులు కేవలం పిల్లల మార్కుల ముఖం చూస్తున్నారు గానీ పిల్లల ముఖంలో ఆనందం కోసం చూడటం లేదని వ్యాఖ్యానించారు. ఇది పిల్లల ఆనందాన్ని చంపేస్తున్నదని అన్నారు. విద్యాలయాలు విజ్ఞాన శిక్షణా కేంద్రాలు కావాలి కాని, శిక్షా కేంద్రాలు కాకూడదని ఆయన అన్నారు. నేడు యాంత్రిక జీవనంలో విద్యార్థులు సినిమాలు, టి.వి.లు, సెల్‌ఫోన్‌లు వంటి ప్రలోభాలకు లోనవుతున్న నేపథ్యంలో పుస్తకాల పట్ల ప్రేమను కల్గించే ప్రయత్నం హర్షించదగ్గదని అన్నారు. ఈ కార్యక్రమంలో మన లైబ్రరీ గౌరవాధ్యక్షులు డా॥ ఎ. విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులలో దాగి వున్న ఆసక్తిని బయటకు తీసేందుకే కథా రచనలు, చిత్రలేఖనం, పాటలు పాడటం, నాటికలు, వక్తృత్వం వంటి అంశాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకే ఇటువంటి పోటీలను మన లైబ్రరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐ. ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చాలా ఆసక్తితో సమకాలీన అంశాతో కూడిన రచనలు కూడా చేశారని అభినందించారు. మన లైబ్రరీ ప్రధాన కార్యదర్శి కె. విఠల్ మాట్లాడుతూ విద్యార్థులలో పఠనాసక్తి పెంపొందించేందుకే మన లైబ్రరీ స్థాపించడం జరిగిందని, విద్యార్థులు తమ ఐ.డి. కార్డు ఇచ్చి పుస్తకాలు చదువుకోవలసిందిగా సూచించారు. విద్యార్థులు పరీక్ష కోసం మాత్రమే చదవడం కాకుండా వ్యక్తిత్వ వికాసం కోసం, జీవితాన్ని తెలుసుకోవడం కోసం చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సభ్యులు, కృష్ణ, కిరణ్, రాము, నర్సిములు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

# "అలరించిన కవి సమ్మేళనం"




కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న కవి కటుకోర్ఘ్వల రమేష్

గ్రంథాలయాలు విజ్ఞాన నేత్రాలు... అమూల్య సంపదల కేంద్రాలు.. అంటూ కవయిత్రి కన్నాంబ (సస్య), మానసిక ఒత్తిళ్ళను చీకటి పొత్తిళ్ళలో వొదిలేసి... రేపటి కలల కుచ్చిళ్ళలో దాగిన ఆనంద గ్రంథాల్ని పేజీపేజీగా తెరుద్దాం.. అంటూ కవి కటుకోర్ఘ్వల రమేష్, జగతిన వెలుగును నింపేది గురువేకదరా బతుకున భావితను నింపేది గురువు కదరా... అంటు పాటల రచయిత లింగాల వెంకన్న చదివిన కవితలు సభికులను అలరించాయి. 43వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని నవంబర్ 17న ఇల్లెందు గ్రంథాలయ శాఖ, కవి సమ్మేళనం జనరంజకంగా సాగింది. సినీకళాకారులు సుందర్ పాడిన ఓయమ్మ నా పల్లెసీమా... ఈనాడు ఎందుకింత చిన్నబోయ్... పాట స్వాతంత్ర సమరయోధులు కృష్ణమూర్తి చదివిన కవిత "మంచిని పెంచే మమకారం... మన గ్రంథాలయం" పలువుర్ని ఆకట్టుకున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ విలువలు విచ్ఛిన్నమవుతున్నాయనీ, నేటి రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై తమ కవిత శారాలను సంధిస్తూ కవులు, కళాకారులు తమ కవితలు సంధించారు. సాహితీ స్రవంతి జిల్లా ఉపాధ్యక్షులు కె. రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు రత్నావల్ నాగన్న, సాంబయ్య, ఉపాధ్యాయురాలు అరుంధతి పాల్గొన్నారు.

## బ్రౌన్ సేవలు చిరస్మరణీయం




కుడి నుంచి ఎడమకు వంజరపు శివయ్య, యిమ్మడిశెట్టి కోటేశ్వరరావు, డా॥ మాడభూషి సంపత్‌కుమార్, డా॥ నిర్మలా పళనివేలు, కోనేటి సుబ్రహ్మణ్యరాజు, గుడిమెట్ల చెన్నయ్య

ఆంగ్లేయుడై ఉండి తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన సిపి.బ్రౌన్ తెలుగువారు ఉన్నంత వరకు చిరస్మరణీయంగా ఉంటారని మద్రాసు వర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ మూడభూషి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. నవంబర్ 10న సిపి.బ్రౌన్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని జనని సాంస్కృతిక సమితి సిపి బ్రౌన్ సంస్మరణ సభను చెన్నైలో ఏర్పాటు చేసింది. వ్యాసార్ పాడి జీవా ఎంకేబీ నగర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మద్రాసు వర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు మాడభూషి సంపత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆంగ్లేయుల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు ఇన్‌చార్జ్‌గా నియమితులైన బ్రౌన్ తాను బాధ్యత వహిస్తున్న ప్రాంతీయ భాషను నేర్చుకోవాలన్న దృక్పథంతో తెలుగు నేర్చుకోవడం ప్రారంభించి తెలుగు నిఘంటువును రాసే స్థాయికి ఎదగడం అనన్య సామాన్యమని ప్రశంసించారు. తెలుగువారు సైతం నిఘంటువు రూపొందించడం చాలా కష్టతరమైన ప్రక్రియ అని, అలాంటిది బ్రౌన్ చేపట్టడం ప్రశంసనీయమని కొనియాడారు. జనని సాంస్కృతిక సమితి వ్యవస్థాపకులు గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి బ్రౌన్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని తెలుగువారు బ్రౌన్‌కు ఘనంగా నివాళులు అర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి నిర్మలాపళనివేల్, భక్తి మాసపత్రిక సంపాదకులు కోటేశ్వరరావ్ పాల్గొన్నారు.

## కథలకు పెరుగుతున్న ఆదరణ



"సోమేపల్లి సాహితీ పురస్కారం"తో పాలపర్తి జ్యోతిష్మతిని సత్కరిస్తున్న వి. ప్రతిమ, కొల్లూరి, సర్వజిత్, తోటకూర వెంకట నారాయణ

"ప్రస్తుత కాలంలో కథలకు ఆదరణ పెరుగుతుందని" ప్రముఖ రచయిత్రి వి. ప్రతిమ పేర్కొన్నారు. అక్టోబర్ 24న విజయవాడలో 'రమ్యభారతి' ఆధ్వర్యంలో జరిగిన తృతీయ రాష్ట్రస్థాయి చిన్న కథలపోటీ విజేతలకు "సోమేపల్లి సాహితీ పురస్కార" ప్రదానోత్సవ సభలో ఆమె "తెలుగు కథ తీరు తెన్నులు" అనే అంశంపై ప్రసంగించారు.

వర్తమాన కథ కేవలం కాలక్షేపం కోసమే కాదని, ఉద్యమస్థాయిలో కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన పత్రికా సంపాదకులు కొల్లూరి ప్రసంగిస్తూ "కవిత్వానికి అవార్డులు చాలామంది ఇస్తున్నారు గాని ఈ విధంగా కథాప్రక్రియకు అవార్డులిచ్చి రచయితలను ప్రోత్సహించడం ఎంతైనా అభినందనీయమన్నారు. ఈ సభలో కథా నవలా రచయిత సర్వజిత్, తోటకూర వెంకట నారాయణ ప్రసంగించారు. తొలుత అవార్డు గ్రహీతలైన రంగనాథ రామచంద్రరావు (ఆదోని), గుండాన జోగారావు (సింహాచలం), పాలపర్తి జ్యోతిష్మతి (అద్దంకి), బొడ్డపల్లి కృష్ణావధాని (విజయవాడ)లను అతిథులు 'సోమేపల్లి' పురస్కారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని రమ్యభారతి సంపాదకుడు చలపాక ప్రకాష్, కవి కోసూరి రవికుమార్, సుభాని నిర్వహించారు.



**విజయనగరం జిల్లా పార్వతీపురం 'జట్టు సేవాశ్రమం'లో నవంబర్ 14వ తేదీన జరిగిన "మేలెరిగిన మనిషి" పుస్తకావిష్కరణలో పాల్గొన్న రచయితలు, బాల సాహిత్యకారులు ఎడమ నుంచి శివ్వం ప్రభాకరం, సిరికి స్వామినాయుడు, శ్రీమతి అమ్మాజీ, డొల్లు పారినాయుడు, పుస్తక రచయిత నారంశెట్టి ఉమామహేశ్వరరావు, బెహరా ఉమామహేశ్వరరావు, రెడ్డి రాఘవయ్య, మంచిపల్లి శ్రీరాములు, సామవేదం రామగోపాలశాస్త్రి, సాహిత్య ప్రకాశ్, నేరెళ్ళ నారాయణ మూర్తి, కె.ఎస్.వి. రమణమ్మ, ఎన్.వి.ఆర్. సత్యనారాయణమూర్తి, బొంపాడ చంద్రశేఖరరావు, దత్తి అప్పలనాయుడు, చింతా అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు.**

# నశీర్ అహమ్మద్‌కు
# 'షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ ఎక్సలెన్సీ అవార్డు'




**'షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ ఎక్సలెన్సీ అవార్డు'ను అష్ఫాఖుల్లా 110వ జయంతి వారోత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన సభలో ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు రాష్ట్ర జైళ్ళ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గోపీనాథ్‌రెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకులు  డాక్టర్ ఎం. కాంతారావు అందజేశారు.**

వినుకొండకు చెందిన చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు ప్రముఖ స్వాతంత్ర్య సంగ్రామయోధులు, అమరజీవి అష్ఫాఖుల్లా ఖాన్ పేరిట హైదరాబాద్‌కు చెందిన సామాజిక జనసముదాయాల అధ్యయన కేంద్రం 'మెహర్ ఆర్గనైజేషన్' ఏర్పాటు చేసిన 'షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ ఎక్సలెన్సీ అవార్డు' లభించింది. అక్టోబరు 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో పలువురి ప్రముఖుల సమక్షంలో అష్ఫాఖుల్లా ఖాన్ 110 జయంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర జైళ్ళ శాఖ డైరక్టర్ జనరల్ డాక్టర్ సి.యన్. గోపీనాథ్ రెడ్డి ఐ.పి.యస్. బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు 'షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ ఎక్సలెన్సీ అవార్డు' అందచేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖ సంచాలకులు డాక్టర్ ఎం. కాంతారావు నశీర్ అహమ్మద్‌ను సత్కరించారు. భారత స్వాతంత్రోద్యమంలో ముస్లింల పాత్రను వివరిస్తూ ఎన్నో వ్యయప్రయాసల కోర్చి, విస్మరించబడిన యోధుల చరిత్రను వెలికితీసి సయ్యద్ నశీర్ అహమ్మద్ వెలువరించిన పది ప్రామాణిక గ్రంథాల వెనుక గల ఆయన నిరంతర కృషి, ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రధానం చేస్తున్నట్టు మెహర్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. ప్రముఖ చరిత్రకారుల మన్నన పొందిన నశీర్ అహమ్మద్ పలు జాతీయ, అంతర్జాతీయ సభలు, సదస్సులలో ప్రసంగాలు చేయడమే కాకుండా అసంఖ్యాకంగా పత్రాలను సమర్పించారు, వ్యాసాలను వెలువరించారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు, సాంఘిక సేవా కార్యకర్తలు సయ్యద్ నశీర్ అహమ్మద్‌ను అభినందించారు.



**నవంబర్ 13న బాలల దినోత్సం సందర్భంగా కరీంనగర్ కళాభారతి ఆడిటోరియంలో జిల్లా సాంస్కృతిక మండలి, సాహితీకిరణం మాసపత్రిక సంయుక్తంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, కవయిత్రులు వరసగా గురజాడ అప్పారావు, రేగులపాటి కిషన్‌రావు, సబ్బని లక్ష్మీనారాయణ, మౌనశ్రీమల్లిక్, పెద్దూరి వెంకటదాసు, సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, గరిశకుర్తి శ్యామల, అడువాల సుజాత, ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్ జి.డి. ఆరుణ, కవిసమ్మేళనం నిర్వాహకురాలు కేతవరపు రాజ్యశ్రీ, డి.ఇ.ఓ రామేశ్వరరాజు, డి.పి.ఆర్.వో డి. శ్రీనివాస్ మాడిశెట్టిగోపాల్, అనంతాచార్యులు తదితరులు.**



**అక్టోబర్ 3న తూర్పు గోదావరిజిల్లా పెనగొండలోని ఎస్‌వికెపి కాలేజీ ఆడిటోరియంలో జరిగిన జాతీయ సమైక్యతా సభలో రమ్యసాహితి, పెనుగొండవారు జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితా సంపుటుల పోటీలో ప్రధమ బహుమతి పొందిన విజయవాడ కవి కె. ఆంజనేయ కుమార్ (మీకు దగ్గర్లోనే...)ని సన్మానించి అవార్డు బహూకరిస్తున్న దృశ్యం. చిత్రంలో (ఎడమ నుంచి కుడికి) జి. సుజాతా కుమారి, (ప్రిన్సిపల్ ఎస్‌వికెపి డిగ్రీ కాలేజి) డి.సిహెచ్. హనుమంతరావు (ప్రిన్సిపల్, ఎస్‌వికెపి జూనియర్ కాలేజి), ఎంఆర్‌విఎస్ మూర్తి (అధ్యక్షులు, రమ్య సాహితి), పి.వి. సునీల్‌కుమార్ ఐపిఎస్., డా॥ కె. రామచంద్రరాజు, టి. నాగిరెడ్డి, ఎస్‌వికెపి కాలేజీ వైస్ ప్రెసిడెంట్, పెనుగొండ.**

# అస్తిత్వం ప్రాంతం నుంచి బయలుదేరి దేశం దాకా విస్తరించాలి

## "చెమట చుక్కలు" ఆవిష్కరణ సభలో డా॥ అద్దేపల్లి

అస్తిత్వం స్వంత ప్రాంతం నుంచి బయలుదేరి దేశందాకా విస్తరించాలని డా॥ అద్దేపల్లి రామ్మోహన్‌రావు అన్నారు. నవంబర్ 14న మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయ కాలక్షేప మంటపములో యువకవి తోకల రాజేశం రచించిన నానీల సంకలనం "చెమట చుక్కలు" ఆవిష్కరణ సభలో పాల్గొన్నారు. చెమట చుక్కలు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథి మరియు ఆవిష్కర్తగా పాల్గొన్న రామ్మోహనరావు పుస్తకం గురించి మాట్లాడుతూ తోకల రాజేశం మౌలికంగా ప్రతిభా సంపన్నుడని, ఈ నానీలు ఈ ఆ ప్రతిభకు అద్దం పడుతున్నాయని అన్నారు. ఈ నానీలలో మట్టి వాసనలున్నాయని చెప్పారు. ఈ ఆవిష్కరణ సభకు దాస్యం సేనాధిపతి అధ్యక్షత వహించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో తోకల రాజేశంకు గల పరిచయ విస్తృతిని అభినందించారు. వివిధ జిల్లాల నుంచి ఆత్మీయులైన కవులను సభకు రప్పించడం చాలా గొప్ప విషయంగా పరిగణించారు. వై. శ్రీరాములు కవి యొక్క అంతరంగాన్ని పట్టుకొని విపులమైన సమీక్షను చేశారు. యువ కళా సమితి తన 41వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా డా॥ ఆశావాది ప్రకాశరావు, విశిష్ట అతిథిగా అర్కాల హేమలత, ఆత్మీయ అతిథులుగా జిల్లా సహకార శాఖాధికారి సుబ్బారాయుడు, మడిపల్లి భద్రయ్య, సూరారం శంకర్, వి.పి. చందన్‌రావు, సిహెచ్. ప్రకాశ్, సిరిసిల్లా గఫూర్ శిక్షక్, కె.వి. రమణారెడ్డి, పి. శ్రీనివాస్‌గౌడ్, ఏలేశ్వరం వెంకటేష్‌లు పాల్గొన్నారు. యువకళా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బోనగిరి రాజారెడ్డి సమన్వయకర్తగా పాల్గొన్నారు. కోశాధికారి రామోజు రమేష్ బాబు తొలి పలుకులు పలుకగా, ప్రసిద్ధ కవి చెమన్ సింగ్ ఆహ్వానించారు. మాల్యశ్రీ, చింతూరి వెంకట్రావు, నూటెంకి రవీంద్ర, తోటపల్లి భూమయ్య, అడువాల సుజాత, సామ లక్షారెడ్డి, ఏలేశ్వరం మాధవాచారి, జి. హరిచరణ్, టేకులపల్లి మహేష్ మొదలగువారితో బాటు 150 మంది దాకా పాల్గొన్న ఈ సభ ప్రధాన కార్యదర్శి తోట సదానందం వందన సమర్పణతో విజయవంతంగా ముగిసింది.



నవంబర్ 14న తోకల రాజేశం రచించిన "చెమట చుక్కలు" నానీల సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న డా॥ అద్దేపల్లి రామ్మోహన్‌రావు చిత్రంలో వై. శ్రీరాములు, దాస్యం సేనాధిపతి, కె.వి. రమణారెడ్డి, పి. శ్రీనివాస్‌గౌడ్, మరియు రచయిత తోకల రాజేశం

## ఉమ్మడిశెట్టి అవార్డుకు ఆహ్వానం

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు కోసం కవుల నుండి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ రాధేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 2010 సంవత్సరంలో ప్రచురించబడిన వచన కవితా సంపుటాలను పంపించవలసిందిగా కోరారు. 2011 జనవరి 31 లోపుగా నాలుగు ప్రతులను డాక్టర్ రాధేయ, ప్లాట్ నెం. 312, రాజహంస ప్యాలెస్ అపార్ట్‌మెంట్స్, ఆర్.టి.సి. బస్‌స్టాండ్ దగ్గర, అనంతపురం–515 001 చిరునామాకు పంపించాలి. ఇతర వివరాలకు 9985171411లో సంప్రదించవచ్చును.



నవంబర్ 7న కరీంనగర్ సాహితీ సోపతి, ఆలగడప మట్టి ముద్రణలు ఆధ్వర్యంలో 'తెలంగాణా కవిత 2009', "కావడి కుండలు" కవితా సంకలనాలు ఆవిష్కరణ



హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభలో 'నాయని సుబ్బారావు ట్రస్ట్, మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన నాయని జయంతి సభలో కవి డా॥ జె. బాపురెడ్డి'కి నాయని స్మారక పురస్కారం ప్రదానం చేసి సత్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, చిత్రంలో రఘుశ్రీ, ఆచార్య నాయని కృష్ణకుమారి, డా॥ రాపాక ఏకాంబరాచార్యులు

# అవగాహన, 32వ వార్షికోత్సవం

విశాఖ జిల్లా, యలమంచిలిలో, 'అవగాహన' సాహిత్యోద్యమ సంస్థ 32వ వార్షికోత్సవం నవంబర్ 7న జరిగింది.

"సినీ, టీవీ సంస్కృతి, వివిధ కోణాలు" అనే అంశం మీద సంస్థ వ్యవస్థాపకులు డా॥ మానేపల్లి, కీనోట్ ప్రసంగంచేస్తూ – సినిమాలు ముందు పుట్టినా, తొలికాలంలో అవి విలువల కోసం నిలిచాయన్నారు. తెలుగులో ఎల్.వి. ప్రసాద్, గరికపాటి రాజారావు, పుల్లయ్య మొదలు కెబి. తిలక్ వరకూ సందేశాత్మక చిత్రాలు నిర్మించారన్నారు. 2010కి ముందూ, ఆ ముందూ – టీవీల్లో సినిమా పేర్లమీదా, నటుల మీదా పాటల మీదా క్విజ్‌లు, పోటీలు ఏర్పాటుచేసి – చెత్త సినిమాలకు ప్రచారం కల్పించి ప్రేక్షకుల్ని సినిమాలకు తరుముతున్నాయన్నారు. ఐతే టీవీల్లో లోగడ ఒక గవర్నరు రాసలీలల్ని బయటపెట్టడం, ఇటీవల ఆజాద్ ఎన్‌కౌంటర్లను కళ్లకు కట్టినట్టు చూపడంవల్ల ప్రభుత్వ, ప్రభుత్వాంగాల దుర్మార్గాన్ని బట్టబయలు చేస్తున్నారని అన్నారు.

ఎన్.ఐ.సి. ఫీల్డ్ ఆఫీసర్, సాహిత్యాభిమాని, కె.విల్సన్ రావు స్పందిస్తూ, ఆన్‌లైన్‌లో వివిధ ఉద్యోగాలకు అప్లికేషన్లు తెప్పించుకోవడం, బ్యాంకింగ్ సర్వీసులను వినియోగించుకోవడం టివీల్లో మంచి అంశాలన్నారు. ఐతే సీరియల్స్‌లో స్త్రీలను దుర్మార్గులుగా చిత్రించడం, వివిధ భక్తిమార్గాలకు బానిసల్ని చేయడం, వంటల్లో చెరుకు ముక్కతో అప్పడాలు, టొమాటో వడియాలు, మునక్కాయతో పాయసం లాంటివి చూపించి, పక్కదారి పట్టిస్తున్నాయనీ ముఖ్యంగా జూనియర్స్‌కి ప్రేమ పాటల డాన్సులు నేర్పించి బహుమతులివ్వడం గర్హించవలసిందన్నారు. కత్తిపూడి నుంచి వచ్చిన శ్రీ రాంబాబు ఇవన్నీ సమగ్రంగా అర్థం చేసుకునే ఇంతవరకూ టీవీయే ఇంట్లోకి రానివ్వలేదనీ, ముఖ్య వార్తల్ని అవసరం మేరకు వామపక్ష దినపత్రికల్లో చదువుతుంటాననీ, "అవగాహన" కార్యక్రమాలకు లోగడ అనేకసార్లు హాజరై తానీ నిర్ణయం తీసుకున్నానన్నారు. తుని నుంచి వచ్చిన కండక్టర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్.ఐ.సి. ప్రయివేటీకరణ గురించి ప్రశ్నించగా సభలోని ఎల్.ఐ.సి. అధికారి నిజమేనని 49 శాతం ప్రైవేటీకరణ జరిగిందన్నారు.

చివరిగా ఇటీవల మరణించిన కె.బి.తిలక్, ఎస్.ఆర్. శంకరన్ లను గురించి డా॥ మానేపల్లి సంక్షిప్తంగా వివరించి నివాళి అర్పించారు. సభికుల హర్షధ్వానాల మధ్య "సాహిత్య ప్రస్థానం" తాజా సంచిక ప్రదర్శించి – చందాదారులు కావలసిందని ప్రోత్సహించారు. రిటయిర్డ్ హెడ్ మాస్టర్ ఎ.స్వీ. నరసింగరావు (73) గారి వందన సమర్పణతో సభ ముగిసింది.



రచయిత, పాత్రికేయుడు ఈతకోట సుబ్బారావు రచించిన 'అలనాటి నెల్లూరు' చరిత్ర గ్రంథం ఆవిష్కరణ అక్టోబర్ 24వ తేదీ నెల్లూరు ఎంఎల్ఏ హాలులో జరిగింది. మాజీ మంత్రి, తెలుగు భాషోద్యమ నాయకుడు మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించగా, డా॥ జి.వి. పూర్ణచంద్, చంద్రలత, వెన్నెలకంటి రామచంద్రరావు, జలదంకి ప్రభాకర్, జయప్రకాష్, డా॥ శ్రీనివాస తేజ, పి. అన్నపూర్ణ, పాలపిట్ట బుక్స్ అధినేత, రచయిత గుడిపాటి, రచయిత ఈతకోట సుబ్బారావు పాల్గొన్నారు



నవంబర్ 14న అరసం రాష్ట్ర అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ రచించిన "నూరేళ్ళ పులుపులు" గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విశాలాంధ్ర సంపాదకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు, వేదికపై రచయిత, అరసం జిల్లా అధ్యక్షులు డా॥ కనపర్తి స్వర్ణలత, కథా సంపుటి రచయిత వల్లూరు శివప్రసాద్

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# గరిమెళ్ళ సత్యనారాయణ

**14.7.1893 - 18.12.1952**



'మాకొద్దీ తెల్ల దొరతనం', పాట ద్వారా ప్రసిద్ధులు. 'అన్యాయ కాలంబు దాపురించిందిపుడు' అనే గేయం సోషలిస్టు ప్రభవాలతో రాసిన యువ కవి అని అనుకునే వారు. అనేక శిక్షలు అనుభవించారు. అజ్ఞాతంగా 1952లో మరణించారు.

## సాహిత్యకారులకు, పుస్తక ప్రియులకు సరికొత్త కానుక!

పేజీలు 356
అరుదైన ఫొటోలతో...

# శ్రీశ్రీ జయభేరి

## జీవితం-సాహిత్యం-రాజకీయాలు

## తెలకపల్లి రవి




సామ్యవాదమే నా గమ్యం కవిత్వంలోనూ జీవితంలోనూ అన్న శ్రీశ్రీ కవిత్వం భువన భవనపు బావుటాగా ఎగురుతూనే వుంది. శ్రీశ్రీ జీవితాన్ని, సాహిత్యాన్ని, రాజకీయాలను సమగ్రంగా, వాస్తవికంగా పరిశీలించిన పుస్తకం ఇది. ఆయన స్వీయరచనలు, సమకాలికుల జ్ఞాపకాలు, రాజకీయ చారిత్రక పరిణామాలు, ఉద్యమాల, సంఘాల పూర్వాపరాలు ఒకేచోట చూపించే విస్తృత ప్రయత్నం. శ్రీశ్రీ అశేషాభిమానులకు, అభ్యుదయ గాముకులకు ఆసక్తి గొల్పే రచన.

**ప్రతులకు:**

ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో

హైదరాబాద్- 040 - 27608107, ఖమ్మం- 9959700852, నల్గొండ - 08682-230525,
హన్మకొండ- 0870-2544559, విజయవాడ- 9490099060, విశాఖపట్నం-9490099061,
గుంటూరు- 9490259186 తిరుపతి- 9490099062, ఒంగోలు- 9490300359,
హైదరాబాద్- ఎస్.వి.కె. బ్రాంచ్- 040-27667543

వెల: రూ. 100/-

ప్రత్యేక తగ్గింపు 25%

వెంటనే కొని చదవండి!